ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 485 నవంబర్ 2025 వెల : రూ.20/-




జనసాహితి ప్రచురణ

29 నవంబర్ : అంతర్జాతీయ పాలస్తీనా సంఘీభావదినం సందర్భంగా....

# 20 సూత్రాల శాంతి పథకం పాలస్తీనా ప్రజలకు మాతృభూమిని అప్పగిస్తుందా!

**యుద్ధాలను** నిలువరించే శాంతి దూతగా అవతారమెత్తిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయిల్, పాలస్తీనాపై చేస్తోన్న యుద్ధాన్ని ఆపటానికి 20 సూత్రాల శాంతి పథకాన్ని 10 అక్టోబర్ 2025న అమలులోకి తెచ్చాడు. ఇజ్రాయిల్‌ను, హమాస్ సంస్థను పిలిచి వారి ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా తాత్కాలికంగానైనా, పాక్షికంగానైనా తన పథకాన్ని అంగీకరించాల్సిందే అనే వత్తిడితో ఈ శాంతి పథకాన్ని అంగీకరింపచేశాడు.

ఈ శాంతి పథకంలోని రెండు దశలలో మొదటి దశ, ఇజ్రాయిల్ హమాస్‌ల మధ్య తక్షణం కాల్పుల విరమణ జరపాలి. హమాస్ నిర్బంధంలో ఉన్న 20 మంది బందీలను, 28 మంది బందీల మృతదేహాలను 72 గంటల్లో ఇజ్రాయిల్‌కు అప్పగించాలి. అలాగే ఇజ్రాయిల్ కూడా తన జైళ్ళల్లో యావజ్జీవ కారాగార శిక్షననుభవిస్తున్న 250 మంది పాలస్తీనా ఖైదీలను, 2000 మంది బందీలను, హమాస్‌కు చెందిన 15 మంది గాజావాసుల మృతదేహాలను అప్పగించాలి. ఇక రెండో దశలో హమాస్ ఆయుధాలను త్యజించాలి. గాజాలో 53% భూభాగాన్ని ఆక్రమించిన ఇజ్రాయిల్ ఆ ప్రాంతాల నుండి వైదొలగాలి అనే అంశాలు ఉన్నాయి.

ఒకవైపు ట్రంప్ పథకానికి తలలూపుతూనే మరోవైపు గాజా పై భీకర దాడులను నెతన్యాహు చేస్తూనే ఉన్నాడు. ఖైదీల విడుదల క్రమం సాగుతుండగానే హమాస్‌పై దాడులు సాగుతున్నాయి. ఇక ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌ను, తూర్పు జెరూసలేంలలో ఇజ్రాయిల్ సెటిలర్లు, భద్రతా దళాలు కలిసి పాలస్తీనియన్ల ఇళ్లను కూల్చి వేస్తున్నారు, వారిపై దాడులను తీవ్రతరం చేస్తున్నారు.

ప్రపంచంలోనే అత్యంత చిన్న ప్రదేశం 365 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన గాజాపై హమాస్ ఉగ్రవాదాన్ని అంతం చేసే నెపంతో 2023 అక్టోబర్ 7 నుండి ఇజ్రాయిల్ జాతిహనన యుద్ధాన్ని చేస్తోంది. ఈ రెండు సంవత్సరాలలో సుమారుగా రెండు లక్షల టన్నుల పేలుడు పదార్థాలను గాజాపై కుమ్మరించింది. 90% పైగా ఇళ్ళు ధ్వంసమయ్యాయి. 19 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. 84 వేలమంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఒక లక్ష 70 వేల మంది కి పైగా క్షతగాత్రులయ్యారు. విద్యాలయాలు, వైద్యాలయాలు, నివాస స్థలాలు, సాంస్కృతిక వారసత్వ భవనాలపై చేసిన ఈ అధర్మయుద్ధంలో ఎక్కువగా ప్రాణాలు కోల్పోయింది చిన్నారులు, మహిళలే. మానవత్వానికి మాయని మచ్చలా వ్యవహరిస్తున్న ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రజలకు బయట నుండి అందిస్తున్న ఆహార పదార్థాలను ఇతర అవసరాల సరఫరాను కూడా నిలిపివేసింది. గాజాలో ఆకలి బాధలు, చిక్కి శల్యమైన చిన్నారుల ఆర్తనాదాలను మీడియాలో చూస్తున్నాం, వింటున్నాం.

గాజాలో ఇంతటి విధ్వంసాన్ని, బీభత్సాన్ని సృష్టిస్తున్న ఇజ్రాయిల్, ఇజ్రాయిల్‌కి అండగా నిలబడి సైన్యాన్ని, ఆయుధాలని అందిస్తూన్న అమెరికా ప్రతిపాదించిన శాంతి పథకంలోని అంశాలు ఇజ్రాయిల్‌కే అనుకూలంగా ఉన్నాయి. ఇజ్రాయిల్ కోరుకున్నట్లుగానే హమాస్‌ను ఆయుధాలను వదిలివేయమనటం, తమ బందీలను విడుదల చేయటం అంశాలు అన్నాయి గానీ రెండు దేశాల ప్రతిపాదన లేదు. తమ మాతృభూమి కోసం, గాజాను వల్లకాడుగా మారుస్తున్నా వెరవకుండా, పిడికెడు మట్టి నుండి మొలిచే ఆలివ్ మొక్కల్లా పాలస్తీనియన్లు దశాబ్దాలుగా పోరాటం చేస్తూనే ఉన్నారు. పాలస్తీనా పౌరుల భాగస్వామ్యం కానీ మాతృభూమి ఊసుకాని ఈ శాంతి పథకంలో లేవు. హమాస్, పాలస్తీనా పౌరులు ఒకటి కాదన్న వాస్తవాన్ని మనం గమనించాలి. అంతేగాక 'పాలస్తీనా మండేలా' అని పిలుచుకునే మార్వాన్ బర్ఘౌటీ విడుదలను ఇజ్రాయిల్ తిరస్కరిస్తోంది. పరిమిత అధికారాలతోనైనా పాలస్తీనా స్వయంపాలనను ఇజ్రాయిల్ అంగీకరించటం లేదు.

1993 సెప్టెంబర్ 13న పాలస్తీనా ఇజ్రాయిల్ ఇద్దరూ కలిసి ఒప్పందం చేసుకొని జరిపిన ఓస్లో శాంతి ఒప్పందాన్నే కాదు పొమ్మన్న ఇజ్రాయిల్, ఇప్పుడు హమాస్‌తో చేసుకున్న ఈ శాంతి పథకం ప్రయోజనాలు ఏమిటో చూడవలసిందే. ఆనాడు అప్పటి ఇజ్రాయిల్ ప్రధానమంత్రి యిట్జాక్ రబీన్ "పాలస్తీనా వాసులారా మేము మీతో యుద్ధం చేసాం. కానీ ఇప్పుడు గట్టిగా స్పష్టంగా చెబుతున్నాం.... ఇంతవరకు పారిన రక్తం కన్నీళ్లు ఇక చాలు. దుఃఖభరితమైన మన జీవన గ్రంథంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిద్దాం. పరస్పర గౌరవం అవగాహనతో మంచి ఇరుగు పొరుగులా మనం స్వేచ్ఛగా, శాంతియుతంగా జీవించే రోజు కోసం ప్రార్థిద్దాం" అంటూ పాలస్తీనా అధినేత యాసర్ అరాఫత్ అమెరికా అధ్యక్షులు బిల్ క్లింటన్ల సమక్షంలో ప్రకటించాడు.

ప్రపంచాన్ని నడిపిస్తున్న చమురు నిక్షేపాలు పుష్కలంగా ఉన్న పశ్చిమాసియాను, ఆసియా ఆఫ్రికా ఐరోపా ఖండాలకు మధ్యస్థంగా ఉండి, ప్రపంచ రహదారులకు కూడలిగా ఉన్న గాజా ప్రాంతాన్ని వదులుకోవటానికి ఇష్టపడని సామ్రాజ్యవాదం ఓస్లో ఒప్పందాన్ని, ఈ ఒప్పందానికి ముందు వెనక సాగిన అనేక

(తరువాయి 3వ అట్టలో....)

జనసాహితి ప్రచురణ

49వ ఏట ప్రవేశించి నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

485

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 49

సంచిక : 04

నవంబర్ 2025

website : www.prajaasaahithi.com


## ఈ సంచికలో...


| | | | |
|---|---|---|---|
| ❑ ముఖచిత్రం | : 20 సూత్రాల గాజా శాంతి పథకంపై – కార్టూనిస్ట్ : సతీష్ ఆచార్య (అంతర్జాలం నుండి) | | .....01 |
| ❑ రెండవ అట్ట | : అంతర్జాతీయ పాలస్తీనా సంఘీభావదినం సందర్భంగా.... | | .....02 |
| ❑ మూడవ అట్ట | : జనసాహితి క్రొత్త ప్రచురణలు | | .....35 |
| ❑ నాల్గవ అట్ట | : అక్టోబరు విప్లవానికి జేజేలు (అంతర్జాలం నుండి) | | .....36 |
| ❑ సంపాదకీయం | : ముందుకా.. వెనుకకా... | | .....05 |
| ❑ కథ | : సంఘర్షణ | – శ్రీదేవి | .....07 |
| ❑ పాట | : ఇజ్రాయెల్ ఇనుప డేగ! పాలస్తీనా తల్లి కోడి!! | – ఉప్పెన | .....10 |
| ❑ పుస్తక పరిచయాలు | : పూర్వ కళింగుల జీవన అద్భుతం "కారువాకి" నవల | – శీలా సుభద్రాదేవి | .....11 |
| | : "అసురుడు" – ఆనంద్ నీలకంఠన్ | పరిచయం : జి.వి.భద్రం | .....23 |
| ❑ వ్యాసం | : బహుళజాతి కంపెనీల డేటా సెంటర్లు – భవిష్యత్తు తరాలకు వరాలా? శాపాలా?? | – ప్రశ్న | .....20 |
| ❑ దేశ విభజన వస్తువుగా సాహిత్యం | : దేశ విభజన నేపథ్యంలో సినిమాలు, నాటకాలు–3 | – కొత్తపల్లి రవిబాబు | .....17 |
| ❑ గల్పిక | : పెన్సిల్ + పేపర్ + ఎరైజర్ @ జీఎస్టీ 2.0 | – సౌరవ్ | .....14 |
| ❑ వ్యంగ్యం | : భారతీయ ఓటరును కావడం నాకు గర్వకారణం | – శంకరం | .....29 |
| ❑ సినిమా సమీక్ష | : 'స్థల్' (2023) | – బాలాజీ (కోల్‌కతా) | .....31 |
| ❑ గుర్తుంచుకుందాం | : 'ఎక్స్ రే' కొల్లూరి, బాలసరస్వతీ దేవి (13); టి.జె.ఎస్. జార్జి (16); కొంపల్లి వెంకట గౌడ్ (19); ఆచార్య పావనమూర్తి (22); | | |
| ❑ వివిధ | : ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (04); ఉత్తరాలు (30); చైతన్యవాహిని (33) వార్తాసాహితి, ఈ పుస్తకాలు అందాయి (34) | | |



ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : **9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు, పుస్తకాలు, రచనలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

సంపాదకుని చిరునామా :
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దగ్గస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com



ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 0971-278X

LIBRARY OF CONGRESS
LCCN 94903393

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
IFSC No. CNRB0000680
UPI 9490196890

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 25,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 20,000 |
| లోపలి అరపేజి | రు. 10,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# ముప్ఫై ఏళ్ళ క్రితం "ప్రజాసాహితి"

**సంచిక : 4 సంపుటి : 19 నవంబర్ 1995**







**చిత్రకారుడు** బాలి గీచిన 'చిదిమివేయబడుతున్న బాల్యానికి ఎవరు బాధ్యులు' అనే ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. రెండు, మూడు కవరు పేజీలలో పాకిస్తాన్ తివాచీ పరిశ్రమలో బాలకార్మికుడైన 12 సం॥ల ఇక్బాల్ మాసీని స్మరించుకుంటూ రాహుల్ రాసిన 'పల్లవి' అనే కవితను ప్రచురించారు. ఇక్బాల్ మాసీ, దోపిడీకి గురౌతూన్న తివాచీ కార్మికుల తరపున నవంబర్' 94లో స్వీడన్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రసంగించాడు. అతను ఏప్రిల్ 16, 1995న తుపాకీ తూటాలకు గురై మరణించాడు. నాల్గవ కవరు పేజీలో 'సాహిత్యం–సౌందర్యం' పుస్తకావిష్కరణ ఫొటోను ముద్రించారు.

'బాల్యం లేని బాలలు' అనే సంపాదకీయాన్ని, 'నైజీరియా ప్రజారచయిత, ప్రజాఉద్యమ నాయకుడు కెన్‌సారోవివా, ఇతర ఉద్యమ నాయకులపై మిలటరీ ట్రిబ్యునల్ విధించిన మరణదండనను ముక్తకంఠంతో ఖండించండి!" అనే ప్రకటనను ప్రచురించారు. పిల్లల ప్రపంచం శీర్షికలో 60వ పుట్టినరోజు జరుపుకుంటున్న నిర్మలానందగారికి 'లాంగ్‌లివ్ తాతగారు!' అని చెప్పిన శుభాకాంక్షలు, నిర్మలానంద రాసిన 'నా బాల్యం' అనే తన బాల్యస్మృతులను ప్రచురించారు. కాలువ మల్లయ్య రాసిన 'ఆమె మరణం' కథనూ, 'అంక్షలూ–నిషేధాలు' శీర్షికలో 'సాహిత్యంలో మతఛాందసుల జోక్యం! ప్రముఖ ఉర్దూకవి మహమ్మద్ ఆలీపై ఫత్వా!"నూ, రవి రాసిన 'రాజుగారి మాటలకు అర్థాలు వేరయా!' అనే గల్పికనూ ప్రచురించారు.

బీజింగ్ 1995 అంతర్జాతీయ మహిళా సదస్సు సందర్భంగా డా॥ బి. సూర్యసాగర్ 'నింగి–నేలా' అనే వ్యాసాన్ని రాశారు. సారా వ్యతిరేక పోరాట నేపథ్యంలో శక్తి రాసిన 'పులిజూదం' నవలను 'పులిజూదం – ఒక పరామర్శ' అనే సమీక్షను ఎన్. వాసు చేశారు. చినువా అచ్‌బే రాసిన 'చెదిరిన సమాజం' ఆఫ్రికన్ నవల ధారావాహికనూ, అనామకుడు రాసిన 'దృశ్యం', కె. హరిబాబు రాసిన 'వాడి జేబుల్లో గ్లోబు', శోధన్ రాసిన 'ప్రజా రచయితలు' అనే కవితలనూ, 'ఉత్తరాలు', 'చైతన్యవాహిని' శీర్షికలను ప్రచురించారు.

1/8 డెమ్మీలో 68 పుటలు. వెల : రూ. 5/–

సంపాదకీయం

# ముందుకా.. వెనుకకా....

**నేటి** డిజిటల్ యుగంలో దేశపు నడక మునుముందుకా?!.. లేక మధ్యయుగాల అంధకారంలోకా?!.. అని ప్రశ్నించుకునే సంఘటనలు రోజురోజుకి పెరుగుతున్నాయి. అక్టోబర్ నెల ఆరు, ఏడు తారీఖుల్లో జరిగిన రెండు సంఘటనలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. దళితులపై, పేదవారిపై అనునిత్యం అమానుష సంఘటనలు జరగడం ఈ దేశంలో మామూలైపోయాయి. ఉద్యోగపరంగా ఉన్నతమైన హోదాలోనూ, ఆర్థికంగా స్థితిమంతులైన దళితులపై కూడా అవమానాలు, అమానుషాలు చోటు చేసుకుంటున్నాయి.

మొదటి సంఘటన అక్టోబర్ 6వ తారీఖున దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులోనే జరిగింది. భారతదేశ ప్రధాన న్యాయమూర్తి, ప్రగతిశీలవాది అయిన బి.ఆర్.గవాయ్ పై, రాకేష్ కిషోర్ అనే 71 ఏళ్ళ న్యాయవాది 'సనాతన్ కా అవమాన్ నహీ సహేంగే..' అని అరుస్తూ బూటు విసిరారు. ఇది కేవలం కోర్టు ఆవరణ-భద్రత వంటి మామూలు విషయం కాదని, దీని వెనక కుల ఆధారిత, మత ఆధారిత ఆధిపత్యం, హింస దాగి ఉన్నాయనేది స్పష్టమే. అప్పటికి 20 రోజుల ముందు సెప్టెంబరు 16న గవాయ్ గారు మధ్యప్రదేశ్‌లోని ఖజరహో ఆలయంలో దెబ్బతిన్న ఒక విగ్రహం విషయంలో జరుగుతున్న ఒక కేసు విచారణ సందర్భంలో.. గువాయ్ హిందువుల మనోభావాలను కించపరిచారని, కనుకనే తాను ఆ వ్యాఖ్యలను సహించలేక బూటు విసిరానని రాకేష్ కిషోర్ చెపుతున్నారు. పైగా అలా చేసినందుకు తానేమి పశ్చాత్తాపం చెందడం లేదని కూడా నిర్లజ్జగా ప్రకటించాడు. ఖజురహో ఆలయంలో దెబ్బతిన్న విగ్రహానికి సంబంధించిన కేసు విషయంలో, "ఆ ఆలయం యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించబడిందని, విగ్రహం దెబ్బతిన్న విషయము, మరమ్మత్తులు వగైరాలు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి పరిధిలోకి వస్తాయి తప్ప, దానిని ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించలేమని" గవాయ్ వ్యాఖ్యానించారు. న్యాయమూర్తి చెపుతున్నా ఆగకుండా వాదనలు చేస్తున్న పరిస్థితుల్లో.. "ఇది పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్లా లేదు, పబ్లిసిటీ ఇంట్రెస్ట్ లిటిగేషన్లా ఉంది" అని అన్న గవాయ్‌పై బుస కొట్టే మనువాదం చిమ్మిన విషం ఎగజిమ్ముతూ బూటు విసిరేయించింది. జరిగిన సంఘటనను ఖండిస్తూ దేశమంతా అనేకమంది ప్రజాస్వామికవాదులు ప్రకటనలు చేశారు. బార్ కౌన్సిళ్ళు నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ రాకేష్ కిషోర్‌ను సుప్రీంకోర్టు ఆవరణలోకి అడుగుపెట్టనీయకుండా నిషేధం విధించింది. కానీ ఇంతవరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ నుండి, జరిగిన సంఘటనను ఖండిస్తూ ఒక్క ప్రకటన కూడా వెలువడక పోవడం గమనార్హం.

ఈ సంఘటనను 2018 సెప్టెంబర్ నాటి శబరిమలై ఆలయంలో మహిళల ప్రవేశం కేసును గుర్తు చేస్తుంది. నాడు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్ జస్టిస్ రోహింటన్ నారీమన్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్ మరియు జస్టిస్ ఏ.ఎం.ఖాన్ విల్కర్‌లు నలుగురూ ఆర్టికల్ 14 (సమానత్వం), ఆర్టికల్ 15 (లింగ వివక్ష), ఆర్టికల్ 25 (మత స్వేచ్ఛ) అనే అంశాల ప్రాతిపదికగా 10 నుండి 50 ఏళ్ల వయసున్న స్త్రీలు కూడా శబరిమలై ఆలయ ప్రవేశం చేయవచ్చునని ప్రగతిశీల తీర్పునిచ్చారు. జస్టిస్ ఇంద్ర మల్హోత్రా అనే మహిళా న్యాయమూర్తి మాత్రం ఆశ్రమ సంప్రదాయాన్ని కాపాడాలని తన తీర్పును ప్రకటించారు. 4:1 ఒకటి తేడాతో ఒక ప్రగతిశీల తీర్పు ఆరోజు వెలువడింది. ఆనాడు కేరళలో తప్ప ఎక్కడా నిరసనలు పెద్దగా కానరాలేదు. తీర్పునిచ్చిన జడ్జిలపై ఎటువంటి దాడుల సంఘటనలు జరగలేదు. కానీ ఈనాడు చీఫ్ జస్టిస్ పైనే చెప్పు విసిరేంత తీవ్రస్థాయికి మతోన్మాదం ఎగసింది.

రెండవ సంఘటన... దళితుడైన కారణంగా తనపై జరుగుతున్న వివక్షను సహించలేక హర్యానాకు చెందిన పోలీసు ఉన్నతాధికారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన. ఎనిమిది పేజీల సూసైడ్ నోట్ రాసి, సాక్షాత్తూ హర్యానా రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ Y.పూరన్ కుమార్, చండీగఢ్‌లోని సెక్టార్ 11లో తన బావమరిది ఇంట జీవితాన్ని అంతం చేసుకున్నారు. ఆయన 2001 బ్యాచ్ హర్యానా క్యాడర్ ఐపీఎస్ అధికారి. ఉద్యోగ కాలమంతా కులతత్వ భల్లూకపు పట్టును సడలించే సంఘర్షణలో ఆయన అనేక ఆటుపోట్లను చవిచూశారు. 2008లో తన సీనియర్ ఐపీఎస్ అధికారిపై ఆయన ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే ఎన్నికల సమయంలో దళిత అధికారులపై వివక్షను ప్రశ్నిస్తూ ఎలక్షన్ కమిషన్ను కూడా గతంలో ఆశ్రయించారు. ఆయా సంఘర్షణలలో ఆయన పొందిన ఓటములూ, ఎదుర్కొన్న అవమానాలు వ్యక్తిగతం ఏమీ కాదు. వ్యవస్థీకృతమైన కులోన్మాదం, దానికి వెన్నుదన్నుగా నిలిచిన మతోన్మాదం, దాన్ని పెంచి పోషిస్తున్న ఆధిపత్య శక్తులతో ఆయన తలపడ్డారు. పూరన్ కుమార్ భార్య అమనీత్ కుమార్ కూడా ఉన్నతాధికారిణే. ఆమె 2001 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి. భర్త మరణానికి కారణమైన వారికి శిక్ష పడేవరకు

తాను పోరాటాన్ని వదిలిపెట్టనని అన్నారు. తన భర్త మరణానంతరం పోలీసులు ఎఫ్ఐఆర్‌ను కూడా సరిగా నమోదు చేయలేదని, ఎఫ్ఐఆర్లో కాలమ్ నెంబర్ 7 సరిగా నింపనేలేదని, 8 పేజీల తన భర్త సూసైడ్ నోట్‌లో ఉన్న 11 మంది పోలీసుల పేర్లను నమోదు చేయనేలేదని ఆరోపించారు. ఈ కేసులో నిందితులకు యావజ్జీవ శిక్షను జరిమానాలను నిర్ధారించే సెక్షన్ 3(2)(V) SC/ST (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్)ను చేర్చకుండా కేసును నీరుగార్చే కుట్ర జరుగుతోందని ఆమె ఆరోపిస్తున్నారు. మరణం సమయంలో తన భర్త జేబులోను, ల్యాప్‌టాప్ బ్యాగులోను ఉన్న సూసైడ్ కాపీలను ఇంతవరకు తనకు పోలీసులు అందించనేలేదని ఆమె తీవ్ర ఆవేదనను వెలిబుచ్చారు.

ఒకరేమో సాక్షాత్తు దేశ ప్రధాన న్యాయమూర్తి. మరొకరు ఒక రాష్ట్ర ద్వితీయ అత్యున్నత పోలీసు అధికారి. దేశంలో తీవ్రంగా వ్యాపింపజేస్తూన్న అసహన, విద్వేష విషసంస్కృతి తీవ్రతని ఈ దాడులు తెలియచేస్తున్నాయి. పసరము కన్న / హీనుడభాగ్యుడైన / యైదవ కులస్తుడెవరమ్మా... సవిత్రీ.. అని జాషువా ఆనాడే ప్రశ్నించారు.

ఇటీవల నేషనల్ క్రైమ్ రీసెర్చ్ బ్యూరో వారు 2023 సంవత్సరపు నేరగణాంక వివరాలు వెల్లడించారు. 2023వ సంవత్సరంలో దళితులపై ఎట్రాసిటీ కేసులు 57,789 నమోదయ్యాయట. అవి అంతకు ముందరి సంవత్సరం కంటే పెరుగుదలను సూచిస్తున్నాయట. ఆదివాసీలపై ఎట్రాసిటీ కేసులు 2022లో 10064గా ఉంటే, ఒక సంవత్సరంలోనే అమాంతంగా 28.8% పెరిగి 12,960 నమోదయ్యాయట. ఇవి ఆదివాసీలపైన జరుగుతున్న హింసాకాండ తీవ్రతను సూచిస్తున్నాయి. NCRB 2022 రిపోర్టులో యోగి ఆదిత్యనాథ్ పరిపాలిస్తున్న ఉత్తరప్రదేశ్‌లో దళితులపై అట్రాసిటీ కేసులు 12,287 గా నమోదయి, ఆ సంవత్సరం దేశం మొత్తం దళిత అట్రాసిటీ కేసుల్లో అత్యధిక వాటాను కలిగి ఉన్నాయి. 2023లో అవి మరెంతో పెరిగి 15,130 కేసులు అయ్యాయి. నరేంద్ర మోడీకి అసలు సిసలు వారసుడనని, బుల్డోజర్ బాబాగా పేరుగాంచిన యోగి ఆదిత్యనాథ్ గారి పాలనా కౌశలమంతా దళితులను అణిచి ఉంచడమేనని ఈ గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. 2023 రిపోర్టులో అత్యధిక సంఖ్యలో దళితులపై అట్రాసిటీస్ విషయంలో నమోదవుతున్న కేసులు బిజెపి పాలిత ప్రాంతాల్లోనే ఉండటం గమనార్హం. ఉత్తరప్రదేశ్ తర్వాత వరుసగా రాజస్థాన్ 8651, మధ్యప్రదేశ్ 7732,. ఇంకా బిజెపితో కలిసి అధికారం పంచుకున్న నితీష్ కుమార్ ఏలుబడిలోనున్న బీహార్లో కూడా 7064. కేసులు నమోదయ్యాయి.

ఉత్తరప్రదేశ్లోని ఎటావా జిల్లా బేకవార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దాద్రాపూర్ గ్రామంలో జూన్ 22న ముకుత్మణి సింగ్ యాదవ్ అనే బ్రాహ్మణేతర కులానికి చెందిన వ్యక్తి భాగవత కథను చెప్తున్నాడని ఆరోపిస్తూ.. కొందరు బ్రాహ్మణులు అతనిపై, అతని సహాయకునిపై దాడి చేసి తీవ్రంగా కొట్టడమే కాక, గుండు గీయించి, బట్టలు చింపివేసి, అతని వద్ద ఉన్న బంగారు గొలుసును లాగేసుకుని తీవ్రంగా అవమానించారు.

మతోన్మాద కులోన్మాద భావజాలాన్ని పథకం ప్రకారమే వ్యాపింప చేస్తున్న రాజ్యం మహిళల పట్ల మరింత దారుణమైన అరాచకాలు ప్రబలేందుకు కారణం అవుతున్నది. 2023 NCRB రిపోర్టు ప్రకారం మహిళలపై ఆ సంవత్సరం నమోదైన అట్రాసిటీ కేసుల సంఖ్య 4 లక్షల, 48 వేల, 211.. కాగా ఈ సంఖ్యలు 2022లో 4 లక్షల, 45 వేల, 256 గాను 2021లో 4 లక్షల 28 వేల, 278గాను నమోదయ్యాయి. మహిళలపై అధిక సంఖ్యలో అట్రాసిటీ కేసులు నమోదు అవుతున్న ఘనత వహించిన తొలి ఐదు రాష్ట్రాలలో పశ్చిమ బెంగాల్ తప్ప మిగిలిన నాలుగు రాష్ట్రాలూ.. కమలం పువ్వు పార్టీ చేతిలోనివే. ఉత్తరప్రదేశ్లో మహిళలపై 66381 అట్రాసిటీ కేసులు, మహారాష్ట్రలో 47101, రాజస్థాన్లో 45450, పశ్చిమ బెంగాల్లో 34,691 గాను,. మధ్యప్రదేశ్లో 32,342 నమోదు అయ్యాయట. నమోదైనవే ఈ సంఖ్యలో ఉంటే నమోదు కాని, నోరులేని అమాయక అబలల ఆక్రందనల సంఘటనలు ఈ దేశంలో ఎన్ని లక్షలలో ఉంటాయో ఊహించుకోవచ్చు..

తమకు శత్రు తెగలనుకున్న వారిని సమూలంగా కిరాతకంగా చంపి, వారి సమూహాన్ని నాశనం చేయకుండా.. వారిని లొంగదీసి బానిసలుగా మార్చి, దోపిడీ చేసి ఆర్థిక లాభం పొందే.. సంస్కృతి మధ్యయుగాలలో ఉండేది. నేటి రాజ్యం మన వ్యవస్థను ఆ మధ్యయుగాలకన్నా హీనస్థితికి దిగజార్చుతున్నది. వందల ఏళ్ల సామాజిక సంఘర్షణలో రూపొందిన సామాజిక సర్దుబాట్లు, మానవీయ విలువలను ఈ దుర్మార్గమైన రాజ్య ప్రేరిత హింసాప్రవృత్తి కుల, మత, ప్రాంత, లింగ, భాషాపరమైన అనేక సున్నితాంశాలను మహా విషకుడ్యాలుగా, మనిషి మనిషికీ మధ్య మొలిపించే దుర్మార్గ విషసంస్కృతిని రాజ్యం పెంచి పోషిస్తోంది. మామూలు మనుష్యులను తమ కడుపు కాలుతున్నా, తమ మతమే గొప్పదనే ఉన్మాద రోబోలను సాటి మనుషులపైకి ఎగదోసే సంస్కృతిని వ్యాపింప చేస్తూంది. లక్షల కోట్ల ప్రజల శ్రమసంపదను యథేచ్ఛగా సామ్రాజ్యవాదులకు కట్టబెట్టేందుకు శ్రమజీవులపై ఉక్కుపాదాన్ని మోపుతున్నది. “ఒక మనిషిని వేరొక మనిషి / ఒక జాతిని వేరొక జాతి / పీడించే సాంఘిక ధర్మం / ఇంకానా?!.. ఇకపై సాగదు..” అని నినదిస్తూ పిడికిళ్ళు బిగించాల్సిన శ్రమజీవులను, వారికి అండగా నిలుస్తూ ఐక్యం కావలసిన బుద్ధి జీవులను, మేధావులను ప్రలోభాలకు గురిచేస్తూ విడగొట్టే పన్నాగం రాజ్యం నిరంతరాయంగా పన్నుతూనే ఉన్నది. ఎవడి విముక్తి వాడిదేనంటూ విడదీసి ఉంచే పోస్టు మోడ్రన్ సిద్ధాంతాలను వ్యాపింప జేస్తున్నది. పీడిత ప్రజలందరినీ, శ్రమజీవులను వర్గ పోరాటం మాత్రమే ఐక్యం చేయగలుగుతుంది. అందుకు ప్రజాకళాసాహిత్యోద్యమాలు కలసి కృషి చేయవలసిన అవసరం నేడున్నది.

కథ

# సంఘర్షణ

శ్రీదేవి

**ఊరి** చివర వుండే కార్మికుల కాలనీకి వెళ్లే తారు రోడ్డు, అక్కడి శ్రమజీవుల మాటల్లా ముక్కుసూటిగా.... కనిపించినంత దూరం సన్నని గీత లాగా ఉంది. దూరాన ఉన్న వంతెన దాటి ఫర్లాంగు దూరం నడిస్తే రోడ్డుకు ఒకవైపు కార్మికుల ఇళ్ళు, మరోపక్క వారి పని ప్రదేశం ఉన్నాయి. విశాలమైన ఆ ప్రాంతమంతా ఎత్తైన సున్నం బట్టీలు.... సున్నం తయారీ కోసం క్వారీల నుండి తోలుకు వచ్చిన పెద్ద పెద్ద సున్నపురాళ్ల గుట్టలు వాటి పక్కనే రాక్షసి బొగ్గు గుట్టలు....బట్టీల నుండి రాళ్లు బొగ్గు కలగలిసి కాలి వెలువడే ఘాటైన వాసనలు.... బట్టీల పై భాగం నుండి అలలు అలలుగా ఆకాశానికెగసే దట్టమైన తెల్లని పొగలు, సెగలతో ఆ ప్రాంతమంతా స్మశానవాటికను తలపిస్తోంది. ఆగి ఆగి బట్టీలలో రగులుకొనే జ్వాలలు, కార్మికుల బతుకుల్లా మండుతూ ఆరుతూ వున్నాయి. రాత్రంతా రాయిని, బొగ్గును చేరవేసే ట్రాక్టర్లు రొద పెడుతున్నాయి. తెల్లవారుజాము గంట మూడు కొట్టిందేమో ఆ వాడంతా గాఢ నిద్ర నుండి మేల్కొంది. బిగబట్టిన వాతావరణం తేలిక పడి, కార్మికుల జీవితాల్లోకి అప్పుడప్పుడు తొంగిచూసే అల్పానందంలాగా చల్లని పిల్లగాలులు వీస్తున్నాయి.

నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ మోటార్ బైక్ శబ్దం ప్రవేశించింది.

"అరేయ్! ఇశ్రాయేలు, సులోచన, రాణమ్మ, కుమారి, వెంకటేశు లెగండి, లెగండి టైం అయింది, మూడు దాటింది. తొందరగా రాండి !" అరుస్తూ బజార్లోకి వెళ్ళాడు బట్టీ మేస్త్రి.

ఆ గుడిసెల్లో నిద్రపోతున్న వాళ్లంతా ఒకసారి సర్దుకొని మళ్ళీ నిద్రలోకి జారుకున్నారు.

సువర్ణ నిద్రలో అటు ఇటు మెసలుతూనే ఉంది. మధ్య మధ్యలో

"అమ్మ చీకటీగలు కుడతా ఉండయ్యే" అంటూ పరపరా గీక్కోని పక్కకి తిరిగి పడుకుంది.

"దుప్పటి కప్పుకోమ్మా" అంటూ చిరుగుల దుప్పటి పిల్లకి కప్పింది పెంచలమ్మ. చంటోడికి పాలిచ్చేందుకు దగ్గరికి లాక్కొని పైట చెంగుతో విసురుతూ నిద్రలోకి జారింది.

"ప్రమీలా!.. లెగే.... తొందరగా లే!' మేస్త్రి రెండు రౌండ్లు తిరిగేసి పోయినాడు." గట్టిగా కేకేసింది ఎంకటమ్మ

"అబ్బా!... ఉండు అత్తమ్మ! "అంటూ పక్కకి వత్తిగిల్లి పడుకుంది ప్రమీల

పెంచలమ్మ ఎంకటమ్మవి పక్క పక్కన ఇళ్ళు. ఇద్దరూ సున్నం బట్టిలో పనిచేస్తున్నారు. పెంచలమ్మ కుటుంబం నెల్లూరు జిల్లా నుంచి వలస వచ్చి నాలుగేళ్లయింది. ఏడాది కొడుకుని ఏడేళ్ల కూతురు దగ్గర వదిలిపెట్టి పెంచలమ్మ పనికి వెళ్తుంది. మధ్యలో మేస్త్రి కనుగప్పి పరుగు పరుగున ఇంటికొచ్చి బిడ్డకు పాలిచ్చి వెళుతూంటుంది.

పొయ్యి వెలిగించి మూకుడులో నూనె వేసి పొయ్యిమీద పెట్టింది ఎంకటమ్మ. రాత్రి తెచ్చిన టమోటాలు రెండు మూడు ఉంటే రెండు గుప్పెళ్ళు పచ్చిమిరపకాయలుతో కలిపి ఆ పొయ్యి మీద దోరగా వేయించి పక్కన పెట్టింది. బయటికి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకొని మొహం కడుక్కొని పిల్ల దగ్గరికి వచ్చింది.

"ప్రమీలా లేస్తవా లేదా" అని గద్దించింది ఎంకటమ్మ

ఇంగ లాభం లేదు అనుకుని ప్రమీల పక్క మీద నుండి లేచి గబగబా పక్కబట్టలు ఉండ జుట్టి, మంచం పైకెత్తి, బయటికి వచ్చింది. ఉడుకుడుకు అన్నం – టమాటా పచ్చడితో బాక్సులు నింపి ఆదరాబాదరా తయారై బయలుదేరారు ఇద్దరూ. ఎంకటమ్మ, ప్రమీల రోడ్డు మీదకు చేరుకున్నారు. ఈలోపు ఇజ్రాయిల్, సుబ్బమ్మ, జ్ఞానమ్మ కూడా టీ బంకు దగ్గర కలిశారు. అందరూ టీ నీళ్లు గొంతులో పోసుకుని వేగుచుక్క దాటి వెళ్ళిపోతుందనంగా బట్టిలోకి అడుగు పెట్టారు.

షుమారు డెబ్బయ్ అడుగుల ఎత్తు, ఇరవై అడుగుల వెడల్పు ఉండే సున్నం బట్టీలకు నాలుగు వైపులా నాలుగు పెద్దపెద్ద గాడి పొయ్యిలు, కాలిన సున్నపురాయిని బయటకు తియ్యడానికి వీలుగా ఉన్నాయి. మగ కార్మికులు పెద్దపెద్ద పారలతో కాలిన రాయిని బయటకు లాగుతుంటే, ఆడ కార్మికులు మంచి సున్నపురాయిని – తాలురాయిని (చిట్యాలు) వేరు చేసే పని చేస్తున్నారు.

సూర్యుడు తూర్పు కొండల్లో తొంగి చూస్తుండగా.... మరోపక్క కొంచెం దూరంలో మరికొందరు మహిళలు గుట్టలుగా పోసి ఉన్న సున్నపురాయి ముక్కల్ని ప్లాస్టిక్ బొచ్చెలతో తీసుకొచ్చి బెల్ట్ మీద పెడుతున్నారు. ఆ బెల్ట్ బట్టీ పైవరకు ఏటవాలుగా వెళుతుంది. బట్టీ పై మెట్టు మీద ముగ్గురు కార్మికులు ఒకరి తర్వాత ఒకరు రాయితో నిండిన బొచ్చలను

అందుకొని, కాలుతున్న బట్టీలో వేసి, ఖాళీ బొచ్చలను కింద పడేస్తున్నారు. మహిళలు వాటిని తీసుకుని మళ్లీ ముడి రాయితో నింపి బెల్ట్ పైకి చేరుస్తున్నారు.

ఇది ప్రతిరోజు జరిగే నిరంతర ప్రక్రియ. ఇలా మూడు వందల అరవై ఐదు రోజులు ఆ సున్నంబట్టీలు కాలుతూనే ఉంటాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాకుండా, వ్యవసాయపు పనులు లేకపోవడంతో రాష్ట్రంలోని అనేక జిల్లాల నుండి, ఇతర రాష్ట్రాల నుండి, వలస వచ్చిన శ్రమజీవులతో ఈ బట్టీలున్న ప్రాంతం నిండిపోయింది. బట్టీలను అనుకొని ఉన్న క్వారీ స్థలంలో కూడా ఆకులను కప్పుకుని, తడికెలను అడ్డుపెట్టుకున్న గుడిసెలు వంటి నీడలో వారంతా రోజులు వెళ్ళమారుస్తున్నారు.

అలా చిత్తూరు జిల్లా నుండి వచ్చిన కుటుంబంలో ఎంకటమ్మది ఒకటి. పెళ్ళైన నాటినుండి భర్తతోపాటు ఈ పనిలోనే కష్ట పడుతోంది. పాతిక సంవత్సరాల నుండి ఇక్కడే ఉంటోంది. పిల్లల పెళ్లిళ్లయి ఊరు దాటినా, చేసిన అప్పులను తీర్చటానికి కష్టపడుతూనే వుంది. ఇటీవల వేరుశనగ పంట దెబ్బతిని, అప్పుల పాలై, తమ్ముడు ఆత్మహత్య చేసుకుంటే – మేనకోడలు ప్రమీలను తెచ్చుకుని బట్టీల పనిలో పెట్టింది. ఐదో తరగతి దాకా చదువుకున్న ప్రమీల చదువు మానేసి తల్లితో పొలం పనులకు వెళ్ళేది. పదిహేను ఏళ్ళ ప్రమీల చురుకుగా, చలాకీగా పనులు చేస్తూ ఎంకటమ్మకు చేదోడు వాదోడుగా ఉంటుంది.

"ఏందిమాయ్ నీటకంగా జేత్తన్నారు. గభాల్న కానీయండి, ఎనిమిది కావస్తుంది". అని మేస్త్రీ అదిలిస్తా తిరుగుతున్నాడు.

రాత్రంతా కాలిన సున్నపు రాయిని ఆరడుగులున్న పెద్ద పెద్ద ఇనుప పారలతో (దోటీలతో) మగవాళ్ళు బయటకి లాగుతుంటే వాళ్లపని పూర్తి అవ్వగానే ఆడవాళ్లు వాటిని వేరు పరిచే పనిలోకి దిగుతున్నారు. రాళ్ళ గుట్టల దగ్గర నుండి మరి కొందరు మహిళలు సున్నపురాయితో నింపిన బొచ్చెలు ఒకరి నుండి ఒకరు అందుకోవడం – బెల్ట్ పైకి చేర్చడం – కింద పడ్డ ఖాళీ బొచ్చని ముడి రాయితో నింపటం చేస్తున్నారు చక చక సాగుతోంది పని.

ముగ్గుబుట్ట లాంటి తల – ముడతలు పడ్డ దేహంతో పాతికేళ్ళ నుండి కష్టపడటమే గాని సుఖమంటూ ఎరగని ఎంకటమ్మ బట్టీ ముందు కూర్చొని చిట్యాలేరుతుంది. కాలే కాలే రాళ్లు పట్టుకోగానే వేళ్ళు చురుకు పోట్లు పెడుతుంటే ఉఫ్ ఉఫ్మని ఊదుకుంటూంది. రాత్రంతా కాలి తయారైన సున్నపురాయిలో మంచిరాయిని – తాలురాయిని ఒడుపుగా రెండు వైపులకు విసురుతూ వేరు చేస్తున్నారు ఎంకటమ్మ తోపాటు ఇతర కార్మికులు.

కాలిన రాళ్లను ఏరి ఏరి పచ్చి రాయిని చుట్టలతో పగుల కొట్టి కొట్టి వారి అరచేతులు కాయలు కట్టి కరకు రాళ్లతో పోటీ పడుతున్నాయి. సున్నపురాళ్లను బెల్టు పైకి చేర్చే బొచ్చలనే బోర్లా వేసుకుని వాటిపైనే కూర్చుని పనిచేస్తున్నారు. పొద్దు పెరిగే కొద్దీ నెత్తిమీద సూర్యుడు ప్రతాపంతో చెమట దారలు కడుతోంది. గుట్టలుగా పోసి ఉన్న సున్నం నెత్తిమీదకు చేరుతున్న సూర్యుడి కిరణాలు పడి ప్రకాశిస్తోంది. గాలివాటుకు రేగుతున్న సున్నం రేణువులు చెమట బిందువులతో తడిసిన ఒంటిపై బడి అంటుకుపోయి మంట పెడుతోంది. ఈ పనిలోకి వచ్చిన కొత్తల్లో వెంకటమ్మకి పనికి రావాలంటే ప్రాణం పోయినంత పనయ్యేది. తన ఊళ్లో పచ్చని పొలాల్లో వ్యవసాయం పనులే సుఖమని తలపోసేది క్రమంగా ఈ కష్టానికీ అలవాటు పడక తప్పలేదు.

ఇంతలో...." వామ్మో!.. సచ్చానురో దేవుడా!" అంటూ పెద్ద కేక...

"అత్తా ఏమైంది" అంటూ పక్కనున్న ప్రమీల పరుగు పరుగున వచ్చింది. "ఏమైంది ఎంకటమ్మా....." అంటూ అవతలపక్క నుంచి వచ్చింది పెంచెలమ్మ.

అటుపక్క ఇటుపక్కనున్న మహిళా కార్మికులు గుమిగూడారు.

ఎంకటమ్మ తల నుండి రక్తం కారుతోంది బట్టీ పైన చిట్టచివరి మెట్టు మీద ఉండి రాళ్ల బేసిన్లు అందుకుని బట్టీలో వేసే కార్మికుల చేతి నుండి రాళ్లు జారి ఎంకటమ్మ తలమీద పడ్డాయి. ఎంకటమ్మ తల పగిలిందనే విషయం కాసేపటికి గాని అర్థం కాలేదు అక్కడున్న అందరికీ.

"నెత్తురుగారతా వుంది. సచ్చినోడా బొచ్చెలు అందుకునేటప్పుడు జాగర్తగా వుండొద్దా...." అంటూ బట్టీ పైభాగంలో వున్న ముగ్గురుని తిట్టిపోస్తంది పెంచలమ్మ.

"ఆసుపత్రికి తీసుకెళ్దాం పదండి" జ్ఞానమ్మ

"ఇప్పుడు ఎవరు ఉంటారమ్మ" ఎవరో అన్నారు

"ఎవరో ఒకరు ముందు ఐతే బయటికి పదండి"

"అత్తా!...ఎంత పని అయింది.. నాకు మా అత్తే దిక్కు. తొందరగా మా అత్తని ఆసుపత్రికి తీసుకెళ్లండి" ఏడుస్తూంది ప్రమీల.

అక్కడికి ఒక ఫర్లాంగ్ దూరంలో చిన్న బడ్డీ కొట్టు లాంటి ఆసుపత్రికి చేరారంతా. ఒకరు వెళ్లి కాఫీ పొడి కొనుక్కొచ్చి తలమీద అద్దారు. అప్పటికే ఎంకటమ్మ తల మీద నుండి రక్తం గారి ముఖం, జాకెట్టు, పైటకొంగు తడిసాయి. ప్రమీల మరి బెంబేలెత్తిపోతుంది. ఎంకటమ్మ సొమ్మసిల్లి పడిపోయింది. నాగమ్మ మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది. ముఖానికి గాలి తగిలేలా పైట చెంగుతో విసురుతోంది. పెంచలమ్మ ఆందోళన పడుతూనే చేతనైన సపర్యలు చేస్తోంది.

"డాక్టర్‌కు ఫోన్ చేయండి" అన్నారు ఎవరో

"పదినిమిషాల్లో వస్తాడంట" అన్నారు ఇంకెవరో

అక్కడున్న బట్టీలలోని కార్మికులందరికీ ఆ ఆర్ఎంపి డాక్టరే దిక్కు.

అంతలోనే డాక్టర్ వచ్చాడు.

"ఎలా జరిగింద"ని అడుగుతూనే ఎంకటమ్మని కూర్చోబెట్టి తలమీద వెంట్రుకలు కత్తిరించి – గాయాన్ని శుభ్రం చేసి –

"గాయం పెద్దగా ఉంది నాలుగైదు కుట్లు పడతాయి "అని చెప్పి పనికి ఉపక్రమించాడు. కుట్లు వేసి కట్టు కట్టాడు. డాక్టర్

"అసలు ఎలా జరిగింది" దగ్గర మొదలై "ఇంకొద్దిగా ఉంటే ప్రాణాలు గాలిలో కలిసిపోయేవే" అని ఒక్కొక్కరు ఒక్కో మాట అంటున్నారు.

"మేస్త్రీ ఏమయ్యాడు! ఆయన్నే కట్టమను డబ్బులు" అని ఒకరంటే

"పైనున్నోడు (బట్టి చివరి భాగంలో) వల్లే ప్రమాదం జరిగింది" అని మరొకరు

"కూలి డబ్బులు కాదు నష్టపరిహారం కట్టించుకోవాల్సిందే" అని ఒకరు

"బెల్ట్ స్పీడ్ పెంచడం వల్లనే ప్రమాదం జరిగింది అసలు ఏం జరిగినా పట్టించుకునే నాథుడే లేడు" అని మరొకరు

"పదండి పదండి బట్టీ దగ్గరే తేల్చుకుందాం" అనుకుంటూ బట్టీ దగ్గరికి చేరారు.

"కనికరం లేని కసాయోళ్లు ఈ బట్టీల యజమానులు" అంటూ జ్ఞానమ్మ తిట్లకి లంకించుకుంది

"అన్నీ ఇత్తన్నట్టు సంతకాలు జేపిచ్చుకుంటారు గాని తలకి హెల్మెట్, కాల్లకి చేతులకి సాక్స్‌లు, గ్లౌజులు వంటికి కొబ్బరినూనె ఏమీ ఇవ్వరు" అన్నది రాంబాయి

బట్టీ చుట్టూ కూర్చుని రాయి వేరు చేసే వారికి తలకు హెల్మెట్ తప్పనిసరి అవసరం, అది లేకపోవడం వల్లనే ఎంకటమ్మ తల పగిలింది.

మిట్ట మధ్యాహ్నం గావస్తోంది, కార్మికులందరూ హెల్త్ సెంటర్ నుండి బట్టి దగ్గరికి వచ్చారు. యూనియన్ నాయకులు వస్తున్నారని తెలిసి ఎదురు చూస్తున్నారందరూ. కార్మికుల్లో ఆవేశాలు పెరిగాయి. అటుపక్క ఇటుపక్క ఉన్న బట్టీల కార్మికులు కూడా ఇళ్లకు పోయే వాళ్ళల్లా ఆగి దగ్గరికి చేరారు. వచ్చిన కార్మిక నాయకులు ముగ్గురిలో ఒక మహిళ కూడా ఉంది. గతంలో అక్కడ జరిగిన ఇళ్ల స్థలాలు గుడిసెల పోరాటాలలో ఒక సాధారణ కార్మికురాలుగా పరిచయమై నాయకురాలుగా ఎదిగిన మహిళ ఆమె. నెత్తుటితో తడిసిన ఎంకటమ్మను చూసి ఆవేశంతో మాట్లాడింది.

"అక్కలారా! అన్నలారా! సున్నం బట్టీలు పెట్టిన యజమానులు కోట్లకు పడగలెత్తారు.. ప్రమాదాల మయంగా ఉండే ఈ పనిలో రాత్రి పగలు కష్టపడి పని చేసినా బతుకుకి భరోసా లేదు, తలకి హెల్మెట్, చేతులకి కాళ్ళకి గ్లౌజు లాంటి వాటి ఊసే లేదు. ప్రతిరోజు మన కడుపులో పేరుకుంటున్న సున్నానికి విరుగుడుగా కార్మికులందరికీ అందివ్వాల్సిన బెల్లం ముక్కక్కూడా దిక్కులేదు. ప్రభుత్వ తనిఖీ అధికారులు సూట్‌కేసు ముడుపులతో ఊరి సెంటరు నుండే తిరిగిపోతున్నారు. అందరూ కలిసి కార్మికుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు" అంటూ సాగింది ఉపన్యాసం.

'కార్మికుల బతుకులు గాలిలో దీపాల కంటే హీనంగా ఉన్నాయని, యజమానులు దిగివచ్చి నష్ట పరిహారం చెల్లించి, కనీస సౌకర్యాలు కల్పించే వరకు సమ్మె చేసి తీరాలని' గతంలో జరిగిన సంఘటనలను – కార్మికుల ఆందోళనలను గుర్తు చేసి కార్మికులకు కర్తవ్యం బోధించారు మిగిలిన యూనియన్ నాయకులు. కార్మిక నాయకులతో వచ్చిన మరికొందరు పాటలు పాడారు.

రెండు రోజులు గడిచాయి కార్మికులు సమ్మె చేస్తూనే ఉన్నారు. యూనియన్ నాయకులు కూడా అంటిపెట్టుకొని ఉన్నారు. కూలి రేట్ల పెంపుదల, కనీస సౌకర్యాలు, ప్రమాద భీమా వంటి వాటి గురించి వివరిస్తున్నారు.

ఇతర రంగాలలోని కార్మికులూ వారికి సంఘీభావం తెలుపుతూ ఊరేగింపులు చేస్తున్నారు. గోడలమీద పోస్టర్లు అతికిస్తున్నారు. చిన్న చిన్న గ్రూపు మీటింగులు పెట్టి కార్మికుల హక్కుల గురించి వివరిస్తున్నారు.

మరుసటిరోజు కార్మికులందరూ గుమిగూడారు యజమాని, మేస్త్రీలు కొత్త కార్మికులను పనిలోకి తీసుకొచ్చే ప్రయత్నాల్లో వున్నారని, వారితో పని కొనసాగనిచ్చేది లేదని ఒకరికొకరు చెప్పుకోసాగారు. యూనియన్ నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది వీళ్ళతోపాటు రాయి గొట్టే కార్మికులు బేటా పనివాళ్ళు (వేరు చేసిన సున్నపురాళ్లను బస్తాల కెత్తి లారీకి లోడ్ చేసేవాళ్ళు) కూడా సంఘీభావంగా సమ్మెలోకి వచ్చారు.

కార్మికులందరూ కదిలారు. గత సంవత్సర కాలంగా బట్టీలలో జరుగుతున్న వరుస ప్రమాదాలు, యజమానుల నిర్లక్ష్య వైఖరి ప్రభుత్వాల పట్టనితనం మొదలైన అంశాలు వివరిస్తూ కరపత్రాలు పంచారు యూనియన్ నాయకులు. కార్మికులంతా పట్టుదలతో సమ్మె సాగిస్తున్నారు.

తరువాత రోజు తెల్లవారుజాము మూడు గంటలకే బట్టీల దగ్గర అందరూ జమయ్యారు. మేస్త్రీలు జోగారావు, కృష్ణారావు మనుషుల్ని తెస్తారని తెలిసింది. కొంత సమయం గడవగానే దూరం నుంచి మేస్త్రి కొత్త పని వాళ్లు బట్టీకేసి రావడం కనిపించింది కూడా.

వారిని అడ్డుకుంటూ "మీరు మా పనిలోకి వస్తారా, మాకు జరిగింది రేపు మీకు జరగదా' అంటూ ఎంకటమ్మతో వున్నవాళ్ళందరూ వచ్చిన వాళ్ళకు నచ్చచెప్పారు. యూనియన్ నాయకులు అడ్డుకొని సమ్మె ఎందుకు చేయవలసి వచ్చిందో చెప్పి మీరంతా కలిసి సమ్మె చేస్తేనే ప్రాణాపాయాల నుండి బయట పడగలిగేది అంటూ వివరించారు. కొంత సమయం గడిచాక వచ్చిన ఆ కొత్త కార్మికులు కూడా సమాధాన పడి వెళ్లిపోయారు.

మరుసటిరోజు సాయంత్రం బట్టీల దగ్గర నుండి ఇంటికి వెళుతోంది ఎంకటమ్మ. తోడుగా పెంచలమ్మ కూడా నడుస్తోంది.

'పెంచలమ్మా!... మనం సమ్మె చేతన్నాం గాని ఆ ఓనరోడు ఆసుపత్రి ఖర్చులకన్నా ఇదిలిత్తాడంటావా' సందేహంగా అడిగింది ఎంకటమ్మ.

"ఎవరికోసం ఇత్తారు ఎంకటమ్మా! న్యాయంగా అయితే తలకి హెల్మెట్, చేతులకి గ్లౌజులు అందరికీ ఇయ్యాలంట. ఆ మాటకొస్తే అసలు ఆసుపత్రి కూడా ఇక్కడే కట్టించాలంట." నిన్న యూనియన్ నాయకులు చెబుతున్నారు కదా'

'చెప్పారులే గాని అయ్యన్నీ కాగితాల మీదే ఉంటాయి జరిగేది కాదు అన్నాడుగా వీరయ్య'

"ఆడి మొఖం పోయినేదు సులోచనకి ముక్కకొడతా ఉంటే రాయి కంట్లో గుచ్చుకుపోయి కన్నే పోయిందిగా... అప్పుడు కూడా సమ్మె చేస్తేనే కదా ఆల్లు దిగొచ్చింది.... ఎప్పుడైనా మనం అందరం ఒక మాట మీద ఉండి, ఒక కట్టుగా ఉంటేనే ఏమైనా సాధించుకో గలుగుతాం".

యూనియన్ నాయకుల ద్వారా సున్నం తయారు చేసే మిల్లుల కార్మికులు బట్టి కార్మికులకు మద్దతుగా నిలిచారు. ఒకరోజున అందరూ ఊరేగింపుగా ప్రభుత్వ కార్మిక శాఖ కార్యాలయానికి వెళ్లి తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. కొన్ని పత్రికల్లో ఆ వార్తలు కూడా వచ్చాయి.

వారం రోజులు గడిచాయి యజమానుల ఎత్తుగడలు ఏవీ సాగలేదు. మేస్త్రీలు చేసిన రాజీ మార్గాలు ఏవీ ఫలించలేదు. బట్టీ పూర్తిగా చల్లారిపోతోంది, అంటే తిరిగి రగులుకొనాలంటే సమయంతో పాటు బోలెడంత ఖర్చుతో కూడుకున్న పని. మొత్తం ఇతర బట్టీలకు కూడా సమ్మె పాకితే కోట్ల రూపాయలు నష్టం చవిచూడాల్సి వస్తుంది.

మరుసటి రోజు మేస్త్రీలిద్దరూ గుమస్తాని వెంటపెట్టుకొని కార్మికుల దగ్గరకు వచ్చారు ఎంకటమ్మకు నష్టపరిహారం ఇవ్వడానికి ఓనరు ఒప్పుకున్నాడని అందరూ పనిలోకి రావాల్సిందని కోరారు. వైద్యం ఖర్చులు కూడా చెల్లిస్తామని చెప్పారు.

మరి మిగతా డిమాండ్ల సంగతేమిటి అని నిలవేశారు కార్మికులు. ప్రమాదాలు జరగకుండా చూసే ఏర్పాట్లు చేస్తేనే పనిలోకి వస్తామన్నారు.

యజమానులు, పని మొదలుపెట్టకపోతే జరిగే నష్టాన్ని తలుచుకుంటూ కార్మికులతో అవన్నీ ఏర్పాట్లు చేస్తామని వాగ్దానం చేశారు. ఐక్యంగా పోరాడితే దేనినైనా సాధించుకోగలమనే నమ్మకంతో కార్మికులు పనిలోకి దిగారు, ఇప్పటికి ఇవి సాధించుకున్నా, సాధించుకోవాల్సిన విషయాలను చర్చించుకుంటూ....

పాట

# ఇజ్రాయెల్ ఇనుప డేగ! పాలస్తీనా తల్లి కోడి!!

- ఉప్పెన

అమెరికోడి అండతోని ఇజ్రాయెల్ ఇనుప డేగ
ఎగురుతున్నాదో ఎగిరి దుంకుతున్నాదో
స్వాతంత్ర సాధనకు పాలస్తీనా తల్లి కోడై
తన్నుతున్నాదో ఎదలో తన్నుతున్నాదో ॥ ఇజ్రాయెల్ ॥

తరతరాల ఆంక్షలను నిరంతరం ఎదుర్కొంటు
ఎదిరించి నిల్చినాది అదురు బెదురు లేకుండా
త్యాగాలకు సిద్ధపడి తెగువతోని తలపడుతు
నేల కోసం నెత్తుటి తర్పణను చేస్తూ వుంది ॥ ఇజ్రాయెల్ ॥

అధర్మయుద్ధముతోఅన్యాయంగా దాడి చేస్తూ
వేల మందిని చంపుకుంటు రక్తాలను తాగుతున్నా
లొంగకుండా వంగకుండా వణకకుండా బెణకకుండా
ఆంక్షలను లెక్కచేయక ఉక్కు సంకల్పముతో ॥ ఇజ్రాయెల్ ॥

ఆయుధాల వ్యాపారి అమెరికోడి వ్యూహమిది
యుద్ధాలను సృష్టించి ఆయుధాలను అమ్ముకోను
అంతరంగిక విషయాల్లో వేలు పెట్టి కాలు పెట్టే
అమెరికా ఆగడాలపై కాగడాలై మండుకుంటు ॥ ఇజ్రాయెల్ ॥

బాంబులా దాడులతో గాజాను గాయపరిచి
భూతల యుద్ధంతో చుట్టుముట్టి వస్తున్న
చెక్కుచెదరని గుండె ధైర్యం మొక్కవోని దేశభక్తి
చావుకు సిద్ధమయ్యి ఆత్మరక్షణ చేసుకుంటు ॥ ఇజ్రాయెల్ ॥

పాలస్తీనా పోరాట పతాకాన్ని ఎత్తి పడుతు
గాజా గాయాలను గేయాలుగ మలిచి రాసి
అమెరికోడి ఆగడాల ఇజ్రాయెల్ దాడులాను
ఎదిరించగ కలం ఎత్తు ఖండించగ గళం విప్పు ॥ ఇజ్రాయెల్ ॥

# పూర్వ కళింగుల జీవన అద్భుతం "కారువాకి" నవల

శీలా సుభద్రాదేవి

**"ఛాయరాజ్** విశిష్ట కవిత్వవ్యక్తిత్వానికి అద్దంపట్టే రచన 'కారువాకి' నవల. పూర్వ కళింగుల మహత్తర జీవన ప్రస్థానం మనకు అద్భుతంగా సాక్షాత్కారమై అనుభూతి కావడమే 'కారువాకి' నవల సాధించిన విజయానికి సాక్ష్యం. కావ్య ఇతివృత్తం ఒక చారిత్రక వాస్తవం" అంటారు బి.సూర్యసాగర్ 'కారువాకి' ముందు మాటలో.

ఒక చారిత్రక నవలని పరిచయం చేయడం కష్ట సాధ్యమైన పని. ఎందుకంటే కథాకాలం నాటి చరిత్రతో మమేకమైతే గాని ఆ నవలని ఆస్వాదించలేము.

కళింగ యుద్ధకాలం నాటి పూర్వ కళింగుల జీవన అద్భుతాన్ని ఒక ప్రవాహసదృశ్యంగా చిత్రించిన "కారువాకి" నవలని చదివిన తర్వాత దాని గురించి కొంతైనా చెప్పాలనిపించింది.




నవల ఆసాంతం కవితాత్మకంగా సాగుతుంది. అనేక చోట్ల గొప్ప ప్రకృతి వర్ణనలు పాఠకులను ఆకట్టుకుంటాయి .

క్రీపూ నాటి శిలాశాసనాల నుండి సేకరించిన సమాచారాన్ని, స్కంద పురాణం, మత్స్యపురాణం మొదలైన ఐతిహాసిక గ్రంధాల నుండి సేకరించిన ఉపకథలతో, ఉటంకింపులతో ఈ నవల సాగుతుంది

వంశధార, నాగావళి, జంఝావతీ నదులు, సరయూ, తమసా, గోమతీ ఇలా అనేక నదుల పరీవాహక ప్రదేశాల గురించి నదుల నడకలతో గలగలా జలజలా ప్రవాహస దృశ్యంగా నవల ఆసాంతం నడుస్తుంది.

'మహాభారతం'లోని భీష్మపర్వం ఆధారంగా కురుక్షేత్రంలో కళింగులు అర్జుననితో, కృష్ణునితో పోరాడి క్షత్రియులయ్యారనే ఉటంకింపును తెల్పారు. జాతక కథల నుండి, మహావంశము నుండి ఉపోద్ఘాతము, కళింగ బోధి, ఎఫ్.కొరోవ్కిన్ 'ప్రాచీన ప్రపంచ చరిత్ర' నుండి, రాహుల్ సాంకృత్యాయన్ రచనలే కాక 'రామాయణం' సందర్భాలను ఆయా గ్రంధాలనుండి అవసరమైనంత మేరకు రచయిత ప్రస్థావన చేసారు.

ప్రధానంగా 'కారువాకి' నవలలో ఇతివృత్తం పూర్వకళింగుల జీవితచిత్రణ.

సూర్యసాగర్ నవలకు ముందుమాటలో అనేక విషయాలు ప్రస్తావించారు. "గురజాడ 'కళింగదేశ చరిత్ర'ను రాయటానికి సంకల్పించగా దాన్ని ప్రచురించబోతున్నట్లు కొమర్రాజు లక్ష్మణరావు ప్రకటించారనీ, అయితే గ్రాంధికభాషలో రాయాలనే కొమర్రాజు షరతుని గురజాడ నిరాకరించి, కళింగ చరిత్ర రాయటమే విరమించుకున్నారని" తెలియజేసారు.

తర్వాత రాళ్ళబండి సుబ్బారావు రచించిన 'కళింగదేశ చరిత్ర' ఆధారంగా 'కారువాకి' నవలను రాసినట్లు ఛాయరాజ్ చెప్పుకున్నారు.

'కళింగ దేశ చరిత్ర' ఆధారంగా కళింగ (కలిగంగ) ప్రజలలో ఎన్ని రకాల జాతులున్నాయి, వారి జీవన విధానం ఏమిటి అనే అంశాలను అది నవలకు అవసరమైనంతవరకు ఛాయారాజ్ గ్రహించి నవలలో పొందుపరిచారు. కళింగులు అనేది సార్వజనీనంగా వూహించుకుంటాం. కానీ అందులోనే అనేక గిరిజనజాతులే కాక కోమట్లు, బ్రాహ్మలు కూడా వుంటారనేది తెలిసింది. బహుశా వివిధ వృత్తులను అనుసరించి విభిన్న జాతులుగా గుర్తించేవారేమో.

అనార్యజాతిగా పరిగణించబడిన కళింగ ప్రజలు ఆర్యులపై తిరుగుబాటులు చేసి, ఆర్యసంస్కృతిని వ్యతిరేకించి, ఆదిమవాసుల జీవనవిధానాన్ని, సంస్కృతిని అనుసరించే స్వతంత్ర ప్రజలుగా రచయిత కథనం చేసేటప్పుడు పలుమార్లు అక్షరీకరిస్తారు.

హిమాలయాల పుట్టుకంత ప్రాచీనచరిత్ర గల ప్రజలనీ, భూమి మీదేకాక జల సంపదలతో పెనవేసుకున్నవారైన కళింగ ప్రజలు అమిత సాహసికులనీ పాఠకులకు తెలుస్తుంది.

కళింగ స్త్రీలు (కారువాకులు) కూడా ధైర్యసాహసులు. పురుషులతో సమానంగా ప్రతీ పనిలోనూ, పోరాటాలలోను యుద్ధాలలోను పాల్గొంటారు. స్త్రీలపై దుర్మార్గాలను సహించరు. స్వాతంత్ర్యప్రియులైన కళింగులు అధికారాన్ని కోరుకోరు. అధిపత్యాన్ని అంగీకరించక

పోవటమేకాక రక్తతర్పణలు చేయడానికైనా సిద్ధపడతారంటారు రచయిత.

క్రీ.పూ.268 నాటికి అశోకుడు విజయకాంక్షతో. సోదరులను అడ్డు తొలగించుకొని కారునలుపుతోనున్న స్వచ్ఛమైన కళింగంగానది నీళ్ళలో కాళ్ళు కడుక్కుంటూ కారువాకి అనే మత్స్య కన్యని చూసి ఆమె సౌందర్యానికి విస్మయుడై ఆమెని ఎత్తుకుని వెళ్తాడు. మొదట అతనిని ప్రతిఘటించినా తుదకు అతని సౌందర్యానికి, ప్రేమకి లొంగిపోతుంది ఆ నదీకన్య.. అనటంలో కారువాకి ప్రసక్తి వచ్చినప్పుడల్లా నవలలో నదీప్రవాహ సౌందర్యంతో రచయిత పోల్చుతూ రాయటం వలన నవల ఆసాంతం పాఠకులకు ప్రవాహ అలల సవ్వడి వినిపిస్తుంటాయి.

నిజానికి పచ్చని ప్రకృతి, నదీప్రవాహం మీదుగా వీచే స్వచ్ఛమైన మందపవనాలూ, అలల గలగలలూ నవల చదువుతున్నంతసేపూ పాఠకుల హృదయాన్ని తాకుతూనే వుంటాయి. కళింగయుద్ధ దండయాత్ర నుండి నవలలో కళింగుల ఆత్మవిశ్వాసం, పోరాటపటిమ, ఆ నాటి యుద్ధ తంత్రాలు ఆశ్చర్యం గొలుపుతాయి.

బ్రాహ్మణుడి వద్ద విద్యనభ్యసించి, గ్రంథాలను అధ్యయనం చేసిన కారువాకికి ప్రేమతత్వాన్ని మాత్రం అశోకునితో అనుబంధం వల్లనే తెలుసుకోగలిగింది.

ప్రకృతికి, సమాజానికి మనిషి అవసరమేమిటో అశోకుడు చెప్పినప్పుడే అర్థమైంది. అటువంటి అశోకుడు సామ్రాజ్య కాంక్షతో సోదరులను చంపటం, కళింగులపై దండయాత్రలు ఎందుకు చేస్తున్నాడో మాత్రం ఆమెకు అర్థం కాలేదు.

కారువాకి రాణివాసం నుండి బయలుదేరి రాజభవనాల్ని చూస్తుంది. చక్రవర్తి ఖజానాని ఇతర గిడ్డంగులనూ దర్శిస్తుంది. రాజ్యసంబంధిత విషయాలను రక్షణ సిబ్బందినడిగి తెలుసుకుంటుంది. కళింగులపై దండ యాత్ర గురించిన సమాచారం తెలుసుకుంటున్న సమయంలో అశోకుడు వస్తాడు. "నాపై ప్రేమ బహుజన ప్రయోజనకారి కావాలి కదా ఈ దండయాత్రలు ఏమిట"ని ప్రశ్నిస్తుంది

చక్రవర్తి సామ్రాజ్యకాంక్షకు, కళింగుల స్వేచ్ఛకు వైరుధ్యం వుందని తెలుసుకున్న కారువాకి తన శరీరానికి ఆలోచనలకూ మధ్య సంఘర్షణలో నలిగిపోయి అశోకుని సామ్రాజ్యకాంక్షని కళింగులు తుదముట్టించగలరా అనే ఆవేదనతో అశోకుని వక్షస్థలంపై సొమ్మసిల్లి పడిపోతుంది.

"కళింగ దేశానికి ఉత్తరాన మహానది, లేక వైతరణి, దక్షిణమున నాగావళి, తూర్పున సముద్రం, పశ్చిమాన తూర్పుకనుమలు ఎల్లలుగా ఉంటాయి. కళింగదేశం పశ్చిమం నుండి తూర్పునకు ఏటవాలుగా వుండటం వలన సువర్ణరేఖ, వైతరణి, బ్రాహ్మణీ, తెలివాహ, మహానది, ఋషికుల్య, వంశధార, నాగావళి నదులు తూర్పు సముద్రం వైపు ప్రవహిస్తాయి" అన్నది చదివాక ఆనాడు ఆ ప్రాంతం ఇన్ని నదీప్రవాహాలతో ఎంత సస్యశ్యామలంగా వుండేదో అనిపించింది.

అదికూడా నవలలో చెప్పారు రచయిత.

ధాన్యము, మెట్టపంటలు, పత్తి పంటలు, తీయని పండ్లు, సన్న నూలు ఎగుమతి చేసేవారని రచయిత చెప్తూ ఈజిప్టు, గ్రీసు, రోము దేశాలతో వాణిజ్య సంబంధాలు ఉండేవనేది పాఠకులకు అబ్బురం కలిగిస్తుంది..

ఇక కళింగ యుద్ధసన్నాహం చూద్దాం,

కళింగ దేశానికి గల సైనిక బలాన్ని, యుద్ధానికి తగు సమయాన్ని అంచనా వేసి శీతాకాలం అనుకూలమని అశోకుడు నిర్ణయించుకున్నాడు.

మౌర్యసైన్యాలన్నీ దండయాత్రలో నలువైపుల నుండి కళింగ వైపు మోహరిస్తున్నాయి. వాటిని ప్రతిఘటించేందుకు ప్రజా సమూహాలు దూసుకు వెళ్తుంటాయి.

"రంకెలు వేసి సైన్యాన్ని కొమ్ములతో కుమ్మేందుకు ఎద్దులకు కళింగ ప్రజలు తర్ఫీదు ఇచ్చారు. బొంగులతో పిచికారు యంత్రాలు తయారు చేస్తున్నారు, కారంతో నింపిన కర్ర గొట్టాలను, దురద గొండ నుసిని మూటలు కడుతూ ఆయుధాలుగా తయారు చేస్తున్నారు కళింగ మహిళలు .. రెల్లుదూది పింజలను కళ్ళలోనికే కొట్టే ఈటల్ని బాల కాళింగులు...." అంటూ ప్రజాసమూహాలు యుద్ధానికి సన్నద్ధమయ్యే తీరును రచయిత వివరిస్తారు.

కళింగదేశం దిశగా యుద్ధసన్నద్ధమై సామ్రాజ్యకాంక్షతో తరలి వెళ్తున్న అశోకుడు మార్గమధ్యంలో ఒక బౌద్ధ భిక్షువుని సందర్శిస్తాడు.

భిక్షువుకి ప్రణమిల్లి తిరిగి లేచి అశ్వాన్ని అధిరోహించి, ముఖాన్ని తాకుతున్న సూర్యకిరణాల్ని తుడుచుకుంటూ, సైన్యం వెంటరాగా, తూర్పుదిక్కుగా బయలుదేరుతాడు అశోక చక్రవర్తి.

కళింగ ప్రజలు ఆత్మాహుతికైనా సిద్ధపడుతున్నారుకానీ యుద్ధ భూమిని వదలకపోవటం చక్రవర్తికి విస్తుగొలుపుతుంది. మౌర్య సైన్యాలపై కళింగులకంత ద్వేషమెందుకో చక్రవర్తికి అర్థం కాలేదు. తన సైన్యం చేసే అకృత్యాలు గమనించినప్పుడే కదా అటువంటివి అర్థమయ్యేది.

కళింగదేశం నేలంతా నెత్తురు బురదగా మారిపోయింది. కళింగ, మౌర్యసైనికుల నెత్తురుతో కళింగ దేశమంతా రక్తపు మరకలతో నిండిపోయింది.

కళింగ తీర ఇసుకదిబ్బలలో తుపాను రేగి కళింగతీర ప్రజల కళేబరాలను భూమిలో కప్పివేసింది.

కళింగ శరీరనాదులను గాలి శ్రుతిచేసి విప్లవగీతాలాలపించింది.

తుళ్ళిన నెత్తురుతో తడిసిన కళింగ ఆకాశంలో మేఘం తాటికాయలంత ఎర్రని చినుకులను కురిసిమెరిసి నేలపై రక్తాన్ని ముద్దాడింది.

కళింగ రక్తం ఎదుట తలదించుకుని, కళింగ దేశానికి చక్రవర్తిగా

ప్రకటించబడి, అశోకుడు అన్యమనస్కుడై నయనాలను బలంగా మూసుకున్నాడు.

సూర్యుడు మధ్యభారత కళింగనేలనే అస్తమిస్తున్నట్టు భావించాడు అశోకుడు. చీకట్లు కమ్ముతున్నాయి, మూర్ఛిల్లిన అశోకుడి శరీరాన్ని శ్వేతాశ్వం జాగ్రత్తగా మోసుకుపోతోంది.

రచయిత ఈ విధంగా కళింగయుద్ధ విధ్వంసాన్ని వర్ణించటం ఎలా వుందంటే సూర్యసాగర్ అన్నట్లుగా "విశాల ప్రదేశంలో జరిగిన కళింగయుద్ధ బీభత్సాన్ని పరిమిత పేజీల ఆవరణలో దృశ్యమానం చేశాడు ఛాయరాజ్. వెండితెరపై కూడా యిమడలేని దృశ్యాలను అక్షరాలలో బంధించాడు." అనేది నవల చదువుతున్నంతసేపూ పాఠకులు కూడా అనుభూతి చెందుతారు.

నవల ముగింపులో "ప్రజలే నిజవీరులు. ప్రజలే నిర్మాతలు. ప్రజలు ఎన్నడూ దుర్మార్గులు కారు. వ్యవస్థలలోని ప్రజల పక్షం, వారి శ్రమ పక్షంగా రచయిత చూడాలి. 'కళింగుల' పాత్రను అలా చూసాను నేను." అని ఛాయరాజ్ గొప్ప ఆశావహ దృక్పథాన్ని వ్యక్తం చేశాడు.

ఛాయరాజ్ యుద్ధంతో కేవలం కథాంశాన్ని ముగించి వూరుకోలేదు. తర్వాత వారసులు ఎంతకాలం పరిపాలించారో తదితర విషయాలన్నీ వెల్లడించారు.

చివరగా "ఈ నవల రాస్తున్నప్పుడు ఒక్కొక్కసారి భావం ప్రధానమైపోయి భాష ముద్దకట్టుకు పోయింది. ఒక సామాజిక చరిత్రను రాయటానికి భాషతో చిత్రలేఖనం చేయవలసి వచ్చింది" అని ఆయన చెప్పుకున్నమాట అక్షరాలా నిజం. ✣

## గుర్తుంచుకుందాం

## 'ఎక్స్ రే' కొల్లూరి



**మినీ** కవితాప్రచారకుడు, 'ఎక్స్ రే' పత్రిక సంపాదకుడు కొల్లూరి సూర్యనారాయణమూర్తి తన 69వ యేట 2025 అక్టోబరు 16న విజయవాడలో మరణించారు. ఆయన అమలాపురంలో 1956లో పుట్టి పెరిగారు.

బి.కామ్ చదివిన కొల్లూరి కొన్నాళ్లు ఆంధ్ర బ్యాంకులో పనిచేశారు. అమలాపురం నుండి 'ఎక్స్ రే' అనే లఘు కవిత్వ సాహిత్య పత్రికను ఒక దశాబ్దంపాటు నడిపారు. ఆ కాలంలోనే మినీకవితా రూపాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన మినీకవితలతో పాటు వచన కవితలూ, దీర్ఘ కవితలూ రచించారు. ప్రప్రథమంగా 'మినీ కవితా విప్లవం' అనే లఘు కవితల సంకలనం ప్రచురించారు. మహిళల సమస్యలు వస్తువుగా 'స్త్రీ' అనే దీర్ఘ కావ్యాన్ని రచించారు. గత 40 ఏళ్ళకు పైగా ఏటేటా ఎక్స్ రే కవితా పోటీలు నిర్వహించి ప్రతి ఏడూ 11 మంది కవితలకు బహుమతులు అందచేస్తూ వచ్చారు. విజయవాడలో యువకవులను ప్రోత్సహిస్తూ 'నెలనెలా వెన్నెల' కార్యక్రమాన్ని ప్రతినెలా మొదటి ఆదివారం కొన్ని దశాబ్దాలుగా ఎక్స్ రే సాహిత్య సేవా సంస్థ ద్వారా నిర్వహిస్తున్నారు. కరోనా కాలంలో గూడా జూమ్ ద్వారా దీనిని నడిపారు. గత పదేళ్లనుంచీ శ్రీశ్రీ అవార్డ్‌తో రచయితలను సత్కరించే బృహత్కార్యక్రమాన్ని జరుపుతున్నారు. శ్రీశ్రీ శతజయంతి సందర్భంగా విజయవాడలో శ్రీశ్రీ విగ్రహ స్థాపనకు అవిరామంగా కృషి చేశారు. సేవా సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ గవర్నర్‌గా పని చేశారు. 1993లో విజయవాడ నుంచి 'అంజలి' అనే పేరుతో ఒక వార పత్రికను కొద్దికాలం తానే సంపాదకునిగా ప్రచురించారు. అంతకు ముందు మదరాసులో 'చిరంజీవి'అనే సినీ పత్రికకు సంపాదకులుగా పనిచేశారు. వారి శరీరాన్ని చిన్న అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధర్థ వైద్య కళాశాలకు దానమిచ్చారు. ✣

## లలిత సంగీత కళాకారిణి రావు బాలసరస్వతీ దేవి



లలిత సంగీత కళాకారిణి, సినీ నేపథ్య గాయని, నటి, ఆకాశవాణి సంగీత కళాకారిణి రావు బాలసరస్వతీదేవి 15 అక్టోబరు 2025న హైదరాబాదులో తన 97వ ఏట మరణించారు. ఆమె 29 ఆగస్టు 1928లో వెంకటగిరిలో జన్మించారు.

కర్ణాటక, హిందుస్తానీ సంగీతాలని, వీణ, పియానో సంగీత వాయిద్యాలను నేర్చుకున్న బాల సరస్వతిదేవి తన ఆరవ ఏట నుండే పాటలు పాడటం ప్రారంభించారు. 2000లకు పైగా పాటలను పాడారు. పది వరకు సినిమాలలో నటించారు. 15వ సంవత్సరంలో ఈమెకు కోలంకి జమిందారీతో వివాహం జరిగింది. వివాహం తర్వాత పాటలు పాడటం, నటించటంపై భర్త ఆంక్షలు విధించటంతో ఎదిరించలేక ఆపేశారు. ఆమె భర్త చనిపోయిన తర్వాత కొన్ని సినిమాలలో పాటలు పాడారు. ✣

గల్పిక

# పెన్సిల్ + పేపర్ + ఎరైజర్ @జీ ఎస్ టీ 2.0

సౌరవ్

**హెడ్‌మాస్టర్** స్టాఫ్ మీటింగ్ అని సర్క్యులర్ పంపించారు.

ఇంత హఠాత్తుగా, అదీ పొద్దుట పూట సమావేశం ఎందుకు పెట్టారో అర్థం కాలేదు స్టాఫ్‌కి.

అందరూ ఆఫీసు రూంకి వచ్చి కుర్చీలలో సర్దుకున్నారు. హెచ్.ఎం గారు ఎందుకో చాలా ఆందోళనగా ఉన్నారు. ఎదురుగా ఏవో పేపర్లు, పుస్తకాలు వేసుకొని సీరియస్‌గా చూస్తున్నారు.

"సడన్ గా డీఈవో గారు విజిట్ కి వస్తున్నానని ఫోన్ చేశారు"

ఈ మాట చెప్పగానే ఆయన ఆందోళన స్టాఫ్‌కి కూడా ట్రాన్స్ఫర్ అయిపోయింది. ఇంత హఠాత్తుగా వస్తున్నారంటే కారణమేమై ఉంటుందా అని స్టాఫ్ అంతా బుర్రలు గోక్కోవడం ప్రారంభించారు.

"నేను గత మీటింగ్‌లో చెప్పినట్టు కొత్త పాటర్న్‌లో డైరీలు రాశారా లేదా?" హెచ్ఎం గారు గొంతు బలహీనంగా నూతిలోనుంచి వచ్చినట్టుంది.

ఒకరిద్దరు రాశామని సమాధానం ఇచ్చారు. కానీ చాలామంది మొహాల్లో కాంతి క్షీణించింది.

మిగిలిన వాళ్ళతో పోలిస్తే కాస్త ధీమాగా కన్పించే తెలుగు సార్ "ఎందుకండీ అలా కంగారు పడిపోతుంటారు! ఇప్పుడేమయ్యింది.. డీఈవో గారొచ్చారనుకోండి.. కొంపలేమయినా మునిగిపోతాయా ఏంటి.. ఒకవేళ ఏదైనా రికార్డ్ చూపించమని అడిగారనుకుందాము.. వెంటనే ఏం చేస్తాం.. ఒక నమస్కారం పడేసి 'సార్! ప్రస్తుతానికైతే రికార్డ్ అప్‌డేట్ చెయ్యడానికి ఇంటికి పట్టుకెళ్లానండీ.. తమరు నెక్స్ట్ టైం వచ్చినప్పుడు చూపిస్తాను సార్' అంటాం. అలా అన్న తర్వాత 'సరే' అనక ఏం చేస్తారు, పీకల్తీసేరు కదా!".

ఆయన అందరికీ ధైర్యం చెప్తున్నాడో లేక తనకు తాను ధైర్యం చెప్పుకుంటున్నాడో అర్థం కాలేదు హెచ్ ఎం గారికి.

ఆయన మేకపోతు గాంభీర్యం స్టాఫ్‌కి తెలియనిది కాదు. అధికారులొచ్చే ముందు వరకూ బీరాలు పలుకుతాడు. తీరా అధికారులొచ్చే సమయానికి ఏ బాత్రూంలోనో నక్కిపోతాడు.

"మీ రికార్డులన్నీ రెడీగా పెట్టుకోండి. ప్రస్తుతానికి క్లాసులకు వెళ్ళండి. డీఈవో గారు ఏ క్షణాన్నైనా రావచ్చు" అని టీచర్స్ అందరినీ క్లాసులకు పంపేశారు హెచ్ ఎం గారు.

అన్నట్టుగానే ఒక పావుగంటలోనే డీఈవో గారి కారు స్కూల్ ముందాగింది.

డీఈఓ గారు డైరెక్ట్‌గా క్లాస్ రూమ్‌లోకి ఎంటర్ అయిపోయారు. టైం బాగాలేని తెలుగు సార్ ఆ టైముకి అక్కడ ఉండడం తటస్థించింది.

భయమెందుకని అందరికీ ధైర్యం చెప్పిన తెలుగు సార్‌కి కాళ్ళూ చేతులూ ఆడటం లేదు.

"మాస్టారూ! ఏమి చెబుతున్నారు?", అని ప్రశ్నించారు డిఈఓ గారు.

"అదీ…అదీ…",

"సరే! నేను పిల్లల్ని కొన్ని ప్రశ్నలడుగుతాను.. పిల్లలూ.. రెడీగా ఉన్నారా"

"ఎస్ సార్"

"అయితే మీ దగ్గర పెన్సిల్స్ ఉన్నాయి కదా"

"ఉన్నాయి సార్"

"కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 తెచ్చాక ఒక పెన్సిల్ మీద కాస్ట్ ఎంత తగ్గింది", అని అడిగారు.

పిల్లలు ముఖ ముఖాలు చూసుకున్నారు. డీఈఓ గారు తెలుగు మాస్టారి వైపు చూసారు. తెలుగు మాస్టారు పిల్లల వైపు చూసారు. పిల్లలు డీఈఓ గారి వైపు చూస్తున్నారు.

"ఏమండీ.. జీఎస్టీ గురించి విద్యార్థులకు మీరేమీ చెప్పలేదా?", తీవ్రంగా అడిగారు డీఈఓ గారు.

"కేంద్రం జీఎస్టీ 2.0 ప్రకటించగానే ప్రతీ స్కూల్లో జీఎస్టీ గురించి విద్యార్థులకు చెప్పమని సర్క్యులర్ పంపించామా లేదా.. హెడ్మాస్టర్ ఎక్కడ",అని తిరిగారు.

ఆ పక్కనే ఉన్న హెడ్మాస్టర్ గారు గజగజ వణుకుతూ "సార్", అని ముందుకొచ్చి నిలుచున్నారు.

"ఏమండీ! మీకు సర్క్యులర్ అందిందా లేదా",

"అందింది సార్", అన్నాడు హెడ్ మాస్టర్ తడబడుతూ.

"మరి పిల్లలు ఏమీ తెలీదంటున్నారు"

"సార్! అదీ..మరీ.. సిలబస్.. అవటం లేదనీ.. టీచర్లు అంటేనూ", డీఈఓ గారి కోపం తారాస్థాయికి వెళ్ళిపోయింది.

"ఏమయ్యా! అసలు మిమ్మల్ని సిలబస్ ఎవరు చెప్పమన్నారు"

"పేరెంట్స్..."

"పేరెంట్స్ ఎవరండీ.. పేరెంట్స్.. నువ్వు గవర్నమెంట్ మాట వింటావా.. పేరెంట్స్ మాట వింటావా"

సోషల్ స్టడీస్ చదువుకొని, స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం తెచ్చుకొని, డెమోక్రసీ గురించి పాఠాలు చెప్పి.. చెప్పి ఆ తర్వాత హెచ్ ఎం ప్రమోషన్ తెచ్చుకున్న హెడ్ మాస్టర్ గారు డిఈఓ గారి మాట విని తీవ్రమైన షాక్ కి గురయ్యారు.

"అవున్సార్!", అన్నారు షాక్ నుంచి తేరుకొని.

"మేము ఇచ్చిన ఆర్డర్ కన్నా పేరెంట్స్ మాటలు ఎక్కువన్న మాట", అని సూర్యారావు, అని క్యాంప్ క్లర్క్‌ని పిలిచారు.

"సార్.." అని క్యాంప్ క్లర్క్ ముందుకొచ్చాడు.

"వీరికి మన మాటకన్నా పేరెంట్స్ మాటే ఎక్కువట.. మరి మన మాట గుర్తించాలంటే షో కాజ్ నోటీస్ ఇవ్వక తప్పదు. ఒక షోకాజ్ నోటీస్ ఇవ్వు. అప్పటికీ అర్థం కాకపోతే చార్జి మెమో ఇద్దాం"

"అన్నట్టు నీకు ఇప్పుడు షోకాజ్ నోటీసు ఇవ్వాలంటే ఒక పేపర్, అందులో సంతకం పెట్టడానికి ఒక పెన్ను ఉపయోగించాలి. ఆ రెండింటి మీద జీఎస్టీ ఎంత తగ్గిందో చెప్పగలవా"

"అదీ.. సార్... అదీ", అంటూ హెడ్మాస్టర్ గారు నీళ్ళు నములుతున్నారు.

"నో! నువ్వు చెప్పలేవు..మన ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయాన్ని పట్ల నువ్వు ఏమాత్రం బాధ్యత లేకుండా ఉన్నావు. నీకు శాలరీ ఎందుకు ఆపకూడదు",

"ఇదిగో సూర్యారావు షోకాజ్‌లో ఈ విషయం ఇంక్లూడ్ చెయ్యి. ఈయనకు జీఎస్టీ రేట్లు మీద కనీస అవగాహన లేదు"

సూర్యారావు హెడ్మాస్టర్‌తో "ఆఫీసు రూమ్‌లోకి పదండి.. కంప్యూటరు, ప్రింటరు ఎక్కడున్నాయో చూపించండి", అని ఆఫీస్ వైపు దారి తీసాడు. అతని వెనుకే అప్పుడే స్నానం చేయించి, బొట్టు పెట్టి అమ్మోరి గుడికి తీసుకెళ్తున్న బలి మేకలా ఒణుకుతూ ఫాలో అయ్యారు హెడ్మాస్టర్ గారు.

ఈలోగా డీఈవో గారొచ్చారని తెలుసుకున్న మ్యాథ్స్ మేడమ్ తను అప్ టు డేట్‌గా ఉన్న విషయం డీఈఓ గారి దృష్టిలో పడాలని, సంచులతో రికార్డులన్నీ వారి ముందుగా మోసుకొచ్చారు. ఆవిడ మోసింది చాలక మరో ఇద్దరు పిల్లలతో కూడా మోయించారు.

"ఏంటమ్మా ఇవన్నీ?",

"సార్! ఇవి లెసన్ ప్లాన్‌లు సార్, ఇవీ టీచింగ్ నోట్స్ సార్.. ఇవీ....",

"స్టాప్ ఇట్", అన్నారు డీఈఓ గారు అరిచినంత కోపంగా.

"ఇందులో జీఎస్టీ కి సంబంధించినవి ఏమైనా ఉన్నాయా? జీఎస్టీ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేటట్టు మీరు ఇన్నోవేటివ్‌గా చేసిన ఎయిడ్స్ ఏమైనా ఉంటే తీసుకురండి"

"సార్! అదీ..అదీ.."

ఆయన ఒక్కసారిగా ఊగిపోతూ తల పట్టుకొని జుట్టు పీక్కోవడం మొదలు పెట్టారు.

ఆయనకు ఏమైందో అర్థంకాక స్టాఫ్ అంతా కంగారు పడిపోయారు. ఈ గోలకి ఆఫీసు రూమ్‌లో షోకాజ్ నోటీస్ టైప్ చేస్తున్న క్యాంప్ క్లర్క్ సూర్యారావు, బయట కార్లో ఉన్న డ్రైవర్ గబగబా పరిగెత్తుకొచ్చారు.

అప్పటికి ఆయన మరింతగా జుత్తు పీక్కుంటూ హిస్టీరియా రోగిలా అరుస్తున్నారు.

సూర్యారావు స్టాఫ్ వైపు చూసి "కొంపదీసి మీలో ఎవ్వరైనా ఆయనకి రికార్డ్‌ల వంటివేమైనా చూపించారా?", అని అడిగాడు.

మ్యాథ్స్ మేడమ్ వైపు చూపించారంతా.

"ఏంటి మేడమ్ ఇలా చేశారు",

"నేనేం చేశానండీ!", అన్నారావిడ భయం భయంగా.

"ఏం చేశారా.. ఆయన్ని ఒక్కసారి చూడండి.. ఏం చేశారో తెలుస్తుంది.. ఆయనకి, ఎవరైనా చదువు చెబుతున్నారన్నా.. చదువుకు సంబంధించిన రికార్డులు వంటివి మెయింటైన్ చేస్తూన్నారన్నా.. ఇదిగో ఇలా మూర్ఛ రోగిలా అయిపోతారు"

"నన్ను క్షమించండి..ఇప్పుడు ఆయనను ఆ మూర్ఛలోనుంచి బయటకు తీసుకు రావాలంటే ఏం చెయ్యాలో చెప్పండి.. దయచేసి", అంటూ ప్రాధేయ పడ్డారావిడ.

"అది నాక్కూడా తెలీదండీ.. కాకపోతే ఆయనకి స్కూళ్ళలో టీచర్‌లు పాఠాలు, సిలబస్‌లు చెబితే విపరీతమైన కోపం. అస్సలు తట్టుకోలేరు.. ఆ టైముకి గవర్నమెంట్ నుంచి ఏ ప్రోగ్రామ్ వస్తే అది అమలు చెయ్యడమే టీచర్ల పని అని తరచుగా మాతో అంటుంటారు".

"సార్! డాక్టర్‌ని పిలుద్దామా అన్నారు" సోషల్ సార్.

"అబ్బే! ఇది డాక్టర్‌తో తగ్గేది కాదు" అని పెదవి విరిచాడు సూర్యారావు.

"పోనీ తాళం చెవుల గుత్తి చేతిలో పెడదామా", అన్నారింకెవరో.

"ఇది మామూలు మూర్ఛ అయితే మీరన్నట్టు చేయొచ్చు. కానీ ఇది జీఎస్టీ మూర్ఛ...తాళాలు, ఇనుప ముక్కలతో తగ్గేది కాదు"

ఇలాంటి విషయాల్లో చురుగ్గా ఆలోచించే హిందీ మాస్టారు మరింత చురుగ్గా బయటికి పరిగెత్తి బండి తీసి స్టార్ట్ చేసుకొని బయటకు వెళ్ళిపోయారు. ఆయన ఎక్కడికి వెళ్తున్నారో ఎవరికీ అర్థం కాలేదు. డీఈఓ గారు జుత్తు పీక్కోవడం ఎక్కువైపోయింది. ఆఫీసు రూంలో హెచ్ ఎం గారు ఇంకా వొణుకుతూనే ఉన్నారు.

ఒక పది నిముషాల్లో హిందీ మాస్టారు ఒక పొడవాటి చార్ట్‌తో వచ్చారు.

గబగబా జుట్టు పీక్కుంటున్న డీఈవో గారి దగ్గరకు వచ్చారు. చార్ట్ ఓపెన్ చేశారు. అందులో వేరు వేరు సరుకులకు జీఎస్టీ రేట్లు జెరాక్స్ షీట్లు అంటించి ఉన్నాయి.

జీఎస్టీ 2.0 లో ఏఏ వస్తువులకు రేట్లు ఏ విధంగా తగ్గాయో బిగ్గరగా చదవడం మొదలు పెట్టారు.

“ఎరేజర్ మీద జీఎస్టీ జీరో పర్సెంట్..పెన్సిల్ మీద జీఎస్టీ జీరో పర్సెంట్..”, అలా చదువుతూ చివరికి కార్లు వంటి లగ్జరీ సరుకుల దగ్గరికి వచ్చేసరికి డీఈఓ గారికి మూర్ఛ ఇంచు మించు వదిలేసింది. హిందీ మాస్టర్ గారు ఆ చార్ట్‌ని రౌండ్‌గా చుట్టి దాన్ని డీఈఓ గారి చేతిలో పెట్టారు. దాంతో ఆయన పూర్తిగా తేరుకున్నారు.

ఆ తర్వాత వారు స్టాఫ్ మీటింగ్ పెట్టారు. ఎవరైనా చదువు చెబితే ఖబడ్దార్! అని హెచ్చరించారు. ప్రతి క్లాసురూంలో జీఎస్టీ రేట్లు హ్యాంగ్ చెయ్యమన్నారు. పిల్లలకు జీఎస్టీ గురించి నూరి పొయ్యమన్నారు. గవర్నమెంట్ ఈ ప్రోగ్రామ్ చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, మూడేళ్ల పిల్లలున్న అంగన్వాడీల నుంచి మొదలుకొని టెన్త్ ఇంటర్ డిగ్రీ విద్యార్థుల్లో కూడా తగ్గిన జీఎస్టీ గురించి విస్తృతంగా ప్రచారం చేయడం అందరి బాధ్యత అన్నారు.

ఈలోగా టీ సర్వ్ చెయ్యడానికి పక్కనున్న టీస్టాల్ అతన్ని పిలిపించారు. అతను మొదటిగా డీఈఓ గారికి టీ గ్లాసులో పోసి ఇచ్చాడు.

డీఈఓ గారు యమ ఉత్సాహంగా

“ఏమోయి..టీ రేట్ ఇప్పుడు ఎంత?”

“ఇప్పుడైనా..ఎప్పుడైనా పది రూపాయలేనండీ”, అన్నాడతను తన ధోరణిలో.

“అదేంటి కొత్త జీఎస్టీ ప్రకారం రేట్లు తగ్గాయి కదా!”,అడిగారు ఆశ్చర్యంగా.

ఎందుకైనా మంచిదని హిందీ మాస్టారు జీఎస్టీ రేట్లున్న చార్ట్‌ని రెడీగా పెట్టుకున్నారు.

“జీఎస్టీ పన్నులు తగ్గాయని న్యూస్ పేపర్లోనూ టీవీల్లోనూ ఊదరగొట్టేత్తున్నారండీ...కానీ మీరు ఏ కిరాణా కొట్టుకెళ్లినా.. షాపింగ్ మాల్ కెళ్ళినా,పాత రేట్ల మీదే అమ్ముతున్నారండి. వస్తువుల రేట్లు తగ్గాయంటున్నారుగానీ, ఏమీ తగ్గలేదండి. నాయకుల మీటింగుల్లోనే చెబుతున్నారండి. మరి నేను తగ్గించటానికి గిట్టుబాటు కాదు కదండీ”, అన్నాడు.

ఈ సారి డిఈవో గారు జుట్టు పీక్కోలేదు. ఎందుకంటే ఆయన మోస్తున్న జీఎస్టీ 2.0 భేతాళ భూతం ఆయన్ని వదిలి మరలా చెట్టెక్కి పోయింది. వెనుక జేబులో ఉన్న దువ్వెన తీసుకొని క్రాఫ్ దువ్వుకుని సైలెంట్‌గా కారు దగ్గరికి నడిచి వెళ్ళిపోయారు. క్యాంప్ క్లర్క్, డ్రైవర్ ఆయన్ని అనుసరించారు.

## గుర్తుంచుకుందాం

# ప్రముఖ ఆంగ్ల పత్రికా రచయిత టి.జె.ఎస్. జార్జి



**ప్రముఖ** ఆంగ్ల పాత్రికేయుడు థాయల్ జాకబ్ సోనీ జార్జి తన 97వ యేట బెంగళూరులో 2025 అక్టోబరు 3న మరణించారు. ఆయన 1928 మే 7న కేరళలోని తుంపమాన్‌లో జన్మించారు. వీరి తండ్రి మేజిస్ట్రేటు. జార్జి మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో ఇంగ్లీషు సాహిత్యంలో ఆనర్సు చదివారు.

1950లో 22వ యేట ‘ఫ్రీ ప్రెస్ జర్నల్’లో చేరారు. ‘సర్చ్ లైట్’, ‘ఫార్ ఈస్టర్న్ ఎకనామిక్ రివ్యూ’ పత్రికలలో పని చేశారు. హాంగ్ కాంగ్‌లో ‘ఆసియా వీక్’ అనే పత్రిక ప్రారంభించి నడిపారు. బీహార్‌లో ‘సర్చ్ లైట్’ పత్రిక సంపాదకునిగా ఆనాటి ముఖ్యమంత్రి కె.బి.సహాయ్‌పై వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై దేశద్రోహ కేసు పెట్టారు. ఆ కేసులో వి.కె.కృష్ణ మీనన్ వీరి తరపున వాదించారు. వీరికి 2011లో పద్మభూషణ్ ను ఇచ్చారు.

ఆయన పాత్రికేయజీవితంలో చెప్పుకోదగిన మరో విశేషం ఏమిటంటే పాతిక సంవత్సరాలపాటు ‘ఇండియన్ ఎక్స్ ప్రెస్’ (ఆ తర్వాత పేరు మార్చుకున్న ‘న్యూ ఇండియన్ ఎక్స్ ప్రెస్’)లో ప్రతి ఆదివారం ‘Point of View’ (‘దృక్పథం’) శీర్షికను నిర్వహించడం. 1997లో ప్రారంభించి 2022 జూన్ 12 వరకు అవిరామంగా దీనిని నిర్వహించారు. అంటే 13 వేల వ్యాసాలు రాశారు. ఈ శీర్షిక ద్వారా ఆయన సమకాలీన రాజకీయ, సామాజిక అంశాలపై శాస్త్రీయమైన దృక్పథాన్ని సూటిగా, నిర్భీతితో వెల్లడించేవారు.

గ్రంథకర్తగా ఆయన యం.ఎస్. సుబ్బులక్ష్మి జీవితంపై రాసిన ‘A Life in Music’ అనే గ్రంథంలో ‘దక్షిణాది అగ్రవర్ణ బ్రాహ్మణుల సనాతన సంప్రదాయ గోడలు బద్దలు కొడుతూ కర్ణాటక సంగీతంలో పురుషాధిపత్యపు కోటను ఆమె కూర్చివేయగలిగారు’ అన్నారు. సినీ నటి నర్గీస్ పైనా, కృష్ణ మీనన్ పైనా పుస్తకాలు రచించారు. యువ పాత్రికేయుల కోసం ‘Lessons in Journalism’ అనే పుస్తకాన్ని రాశారు. ‘పాలకులు తమను ఎవరూ తప్పు పట్టరాదనీ, వ్యతిరేకంగా విమర్శించరాదనీ ఆంక్షలు విధించారంటే ఆ దేశం సక్రమ మార్గంలో పయనించడం లేదు’ అని ఆయన నిర్ద్వందంగా ప్రకటించారు.

# దేశ విభజన నేపథ్యంలో సినిమాలు, నాటకాలు-3

కొత్తపల్లి రవిబాబు

(గత సంచిక తరువాయి)

**'కర్తార్ సింగ్' (పాకిస్తాన్ సినిమా-1959) ఉర్దూ**

పాకిస్తాన్‌లో నిర్మించిన ఈ సినిమా రచయిత, నిర్మాత, దర్శకుడు సైఫుద్దీన్ సైఫ్ (1922–1993). అమృత్‌సర్‌లో జన్మించిన సైఫ్ విభజన తర్వాత పాకిస్తాన్ వెళ్ళారు. అక్కడ చలనచిత్ర పరిశ్రమలో ప్రసిద్ధవ్యక్తిగా ఎదిగారు. 1950లలో అభ్యుదయ రచయితల సంఘంలో పని చేశారు. ప్రగతిశీల మేధావిగా గౌరవాన్ని అందుకున్నారు.

కర్తార్ సింగ్ సినిమాలో సుధీర్, ముసారత్ నాజర్, బహర్ బెగమ్, లైలా, జరీఫ్, ఇనాయక్ హుస్సైన్ భట్టి, అల్లావుద్దీన్ మొదలగువారు నటించారు. సంగీతం సలీం సమకూర్చారు. ఇక్బాల్ రాసిన పాటకు, అమృతా ప్రీతం కవితకు చక్కని బాణీలు కట్టి దీనిలో సందర్భాను కూలంగా వాడారు. ఈద్ ఉల్ అధా సందర్భంగా 1959 జూన్ 18న విడుదల చేశారు.

పంజాబ్‌లో సిక్కులు, హిందువులు, ముస్లిములు సామరస్యంగా నివసిస్తున్న ఒక ప్రశాంతమైన గ్రామం కథ ఇది. ఆ వూరిలో వైద్యుడు ప్రేమనాథ్. అందరూ ఆయన్ను గౌరవిస్తారు. ఉమర్ దీన్, రెండవ ప్రపంచయుద్ధంలో బర్మాయుద్ధరంగం లో పాల్గొన్న విశ్రాంత సైనికుడు. కర్తార్ సింగ్ ఒక చిల్లర నేరస్థుడు. తంపులమారి. విభజన సమయంలో ఉమర్ దీన్, అతని ప్రియురాలు పాకిస్తాన్‌కు వెళ్తారు. ఉమర్ దీన్ చెల్లెలను సిక్కులు ఎత్తుకుపోతే ఒక ముస్లిం పెద్దాయన ఆమెను వారి నుంచి రక్షించి తన ఇంటిలో రక్షణ కల్పిస్తాడు. ఆమె బాగోగులు చూస్తుంటాడు. అతడి కొడుకు ఆమెపై అత్యాచారం చేస్తుంటే ఆ కొడుకును కాల్చి చంపేస్తాడు. అతని చెల్లెలు గూండాలబారిన పడకుండా క్షేమంగా తన ఇంటిలో వుందని ఉమర్ దీన్‌కు తెలియచేస్తూ ఒక వుత్తరం రాస్తాడు. ఆమెను క్షేమంగా పాకిస్తాన్ కు పంపిస్తాడు.

సరిహద్దు ప్రాంతంలో కర్తార్ సింగ్‌ను కేవలం గాయపరిచి అతను పారిపోడానికి అవకాశం ఇచ్చి ఉమర్ దీన్ అతని ప్రాణాన్ని రక్షిస్తాడు. తనకు ఆ విధంగా ఉపకారం చేసినందుకు కర్తార్ సింగ్ మనసు మార్చుకుని పశ్చాత్తాపంతో కుమిలిపోతుంటాడు. ప్రేమనాథ్ రక్షణలో వున్న ఉమర్ తమ్ముడిని తీసుకుని ఉమర్‌కు చేర్చడానికి పాకిస్తాన్ వెళ్తుంటే సరిహద్దు వద్ద తనపై దాడి చేయడానికి వస్తున్నాడనుకుని ఉమర్ కర్తార్‌సింగ్‌ను కాల్చి చంపేస్తాడు.

మతం పేరుతో మానవుడు ఎంత తెలివితక్కువతనంతో ప్రవర్తిస్తాడో చెబుతూ మానవతా సందేశాన్ని ఈ చిత్రం ఇస్తుంది. సిక్కులలోనే అల్లర్లు చేసినవారినీ, మానవత్వం ప్రదర్శించిన వారినీ ఈ సినిమాలో చూస్తాం. కర్తార్ సింగ్ రౌడీయే కానీ విభజన నాటి హింసాయుత కార్యక్రమాలలో పాల్గొనడానికి్కారణం అతని సోదరుడు లాహోర్‌లో జరిగిన హింసాకాండలో మరణించడం. ప్రేమనాథ్ గ్రామం రెండుగా చీలిపోవడం చూసి దుఃఖిస్తాడు. ఉమర్ దీన్ తమ్ముడిని తన ఇంట్లో వుంచుకుని రక్షిస్తాడు. దీనిలో ముస్లిములు ఎవరినీ చెడ్డవారిగా చిత్రించలేదు. వారు బాధితులు. ఒక కొత్త ప్రాంతానికి శరణార్థులుగా వెళ్ళి అక్కడ జీవితాన్ని కొత్తగా ప్రారంభించాల్సిన దుస్థితి లో వున్న వారిగా వారిని చిత్రించారు.

**కళంక్ (2019) హిందీ**

2019 ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా 5300 థియేటర్లలో విడుదలైన ఈ చలనచిత్రాన్ని కరణ్ జోహార్ నిర్మించాడు. దీనికి దర్శకుడు అభిషేక్ వర్మ. ఇది భావోద్రేకాలతో నిండిన సినిమా (melo drama). దీనిలో వరుణ్ ధావన్, అలియా భట్, సోనాక్షి సిన్హా, మాధురీ దీక్షిత్, సంజయ్ దత్ మొదలగు వారు నటించారు. పాటలు అమితాబ్ భట్టాచార్య రాయగా, ప్రీతమ్ సంగీతం సమకూర్చారు.

లాహోర్ సమీపాన గల హుస్నాబాద్‌లో విభజనకు కొద్ది సంవత్సరాల ముందు జరిగిన కథ ఇది. ఆ నాటి అల్లకల్లోల పరిస్థితుల్లో ఆరుగురి గురించిన కథ ఇది. బాలరాజ్ చౌధరి కొడుకు దేవ్. సంపన్న కుటుంబానికి చెందిన అతనికి ఒక ప్రచురణ సంస్థ, ఒక పత్రిక వుంది. అతని భార్య సత్యకు క్యాన్సర్ ముదిరిన దశలో వుంది. ఒక సంవత్సరం మాత్రమే బతుకుతుంది అని డాక్టర్లు చెబుతారు. ఆమె తన బాల్య స్నేహితురాలు రూపను తన భర్తకు సహచరిగా ఒక ఏడాదిపాటు వుండమని కోరుతుంది. సత్య అడిగిన అసంబద్ధమైన కోర్కెను రూప తిరస్కరిస్తూ వుంటుంది. సత్య తండ్రి రూప కుటుంబానికి ఎంతో సహాయం చేశాడు. కనుక రూప సంగీతం మాస్టరైన తన తండ్రి ధర్మపాల్ చెప్పిన మీదట దేవ్‌తో కలిసి వుండటానికి అంగీకరిస్తుంది. రూప ఇద్దరు చెల్లెళ్ల బాధ్యత కూడా సత్య తీసుకుంటుంది.

దేవ్,రూపల సాహచర్యం మేధాపరమైనదేగాని లైంగికమైనది కాదు. పెళ్లి అయినతరువాత దేవ్ తాను ఇంకా సత్యనే ప్రేమిస్తున్నాననీ, రూపతో సంబంధం అమలినమైనదనీ చెబుతాడు. రూపకు సంగీతం అంటే ఇష్టం. ఒకరోజు కిటికీలో నుంచి బహార్ బేగమ్ అనే కళాకారిణి సంగీతాన్ని విని ఆమెను కలుసుకోవాలనుకుంటుంది. అయితే బహార్ బేగమ్ వ్యభిచారప్రాంతమైన హీరా మండిలో వుండే వ్యభిచారిణి. అక్కడకు రూప వెళ్లడానికి ఆంక్షలు వున్నాయి. బహార్ ను కలవడానికి అనుమతించకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటుంది. సత్య తన మామ బాలరాజ్‌కు చెప్పి అనుమతి సంపాదిస్తుంది. హీరా మండిలోని స్త్రీల జీవితాల గురించి వ్యాసాలు రాయాలనే అభిరుచి వున్న రూప, జాఫర్ అనే కమ్మరి ద్వారా సమాచారం సేకరిస్తుంది. తాను రాసిన వాటిని భర్త ప్రచురిస్తున్న పత్రికలో ప్రచురించాలని అనుకుంటుంది. ఈ జాఫర్ అనే అతను బాలరాజ్ చౌధురికి బహార్ బేగమ్‌కి వివాహేతర సంబంధం ద్వారా పుట్టినవాడు. బాలరాజ్ జాఫర్ బాధ్యతను తీసుకోడు. కనుక జాఫర్ అతనిపై ప్రతీకారం రూపను చెరచడం ద్వారా తీర్చుకోవాలనుకుంటాడు. రూపకు జాఫర్ కున్న నీచపు ఆలోచనలు తెలియక అతనితో ప్రేమలో పడుతుంది. అదే సమయంలో దేవ్‌తో స్నేహంగా వుండి సత్య మరణించేవరకు ఆమెను సంతోషపెడుతూ వుంటుంది.

బాలరాజ్‌ను అవమానించడానికి జాఫర్, బాలరాజ్ మిత్రుడైన అబ్దుల్‌లో మత ద్వేషాన్ని రెచ్చగొడతాడు. మతపరంగా దేశం విభజింపపడాలని అబ్దుల్ కోరుతాడు. దేవ్ దానిని సమర్ధించడు. బ్రిటన్‌లో చదివిన దేవ్ తన పత్రికలో దేశ విభజన వ్యతిరేకిస్తూ వ్యాసాలు రాస్తాడు. వాటిని చూపించి జాఫర్, అబ్దుల్‌ను మరింత రెచ్చగొడతాడు. బాలరాజ్ కొడుకు దేవ్‌తో హిందువులైన తాము లాహోర్‌లో మైనారిటీలమని హెచ్చరిస్తాడు. ముస్లిం లీగ్ క్రమంగా బలాన్ని పుంజుకుంటూ వున్నదని చెప్తాడు. స్థానికులైన మెజారిటీ మతస్తులకు దేవ్ రాసే వ్యాసాలు రుచించవు అని సలహా ఇస్తాడు. బ్రిటీషు వాడు దేశాన్ని మతపరంగా ముక్కలు చేయడానికి కుట్ర చేస్తున్నాడనీ, దేశం ఐక్యంగా వుంటే త్వరితంగా పురోగతి సాధించవచ్చనీ వ్యాసాలు రాస్తూ వుంటాడు.

బాలరాజ్, దేవ్‌లు తమ పరిశ్రమలో విదేశీ యంత్రాలను వాడబోతున్నాడనీ, అలా జరిగితే జాఫర్, అబ్దుల్లాల తోపాటు వేలాదిమంది నిరుద్యోగులౌతారనీ, అది వారి వ్యాపార ప్రయోజనాలకనీ, కనుక విభజన వద్దు అంటున్నారనీ జాఫర్ ప్రచారం చేస్తాడు. దేశాన్ని విభజిస్తే, ముస్లిములు కొత్తగా వచ్చే టెక్నాలజీని వుపయోగించుకోవచ్చనీ చెప్తాడు. ఉక్కు ఫ్యాక్టరీ పెట్ట వద్దనీ, అది పెడితే చాలామంది కమ్మరి పనివారు తమ జీవనోపాధి పోగొట్టుకుంటారని దేవ్‌తో చెబుతారు. దేవ్ దీనిని తిరస్కరిస్తాడు. ముస్లిములను హిందువులకు బానిసలుగా మార్చడానికి చేసే దేవ్ ప్రయత్నంగా దీనిని చిత్రిస్తాడు. మత విభేదాలు క్రమంగా తీవ్రమౌతూ వుంటాయి. పారిశ్రామికప్రగతి పేరుతో మతవుద్రిక్తతలు పెరగనీయవద్దని తండ్రి, కొడుకు దేవ్ కు సలహా ఇస్తాడు. కానీ దేవ్ వినడు.

జాఫర్ వ్యక్తిగత, రాజకీయ ప్రతీకార వాంఛ గురించి బహార్ తెలుసుకుని అతన్ని హెచ్చరిస్తుంది. కానీ తనకు అన్యాయం చేసినవారిని వదిలేదే లేదని జాఫర్ అంటాడు. బహార్ రూపను జాగ్రత్తగా వుండమని చెబుతుంది. మొదట్లో రూపకు హాని చేయాలనుకున్నా జాఫర్ ఆమెను ప్రేమించడం మొదలెడతాడు. ప్రతీకార వాంఛ తగ్గిపోతుంది. మత విద్వేషం నిండిన అబ్దుల్ విభజనను వ్యతిరేకిస్తున్న దేవ్‌పై దాడి చేయడానికి ప్రయత్నిస్తాడు. రూప దేవ్‌ను పెళ్లి చేసుకుంటుంది గానీ అతన్ని ప్రేమించలేనని చెబుతుంది. రూప ఇక తనకు దక్కదని తెల్చుకున్న జాఫర్ ఆమెకు హాని చేయాలన్న కోరికను వదలుకుంటాడు. కానీ అబ్దుల్ తన రాజకీయ ఆకాంక్షల కోసం రూపకు హాని చేయాలనుకుంటాడు. ఆమె జోలికి పోవద్దని జాఫర్, అబ్దుల్ని హెచ్చరిస్తాడు.

పట్టణంలో అల్లరులు చెలరేగుతున్న సమయంలో జాఫర్ సహాయంతో అమృత్ సర్ వెళ్లిపోవాలని బాలరాజ్ నిర్ణయించుకుంటాడు. జాఫర్, రూప కలసి దేవ్‌ను అతని ప్రెస్ వద్ద అల్లరి మూకలనుండి రక్షిస్తారు. రైల్వేస్టేషన్‌కు సురక్షితంగా జాఫర్ సహాయంతో చేరి ట్రైన్ ఎక్కుతుండగా అబ్దుల్ జాఫర్‌ను హత్య చేస్తాడు. మిగిలినవారు తప్పించుకుని అమృత్ సర్ చేరతారు.

రూప, దేవ్‌ల అమలిన వివాహ సంబంధం కొనసాగుతూ వుండగా 10 యేళ్ళ తర్వాత విభజన పై పరిశోధన చేస్తున్న ఆదిత్య అనే విద్యార్థి వారిని ఇంటర్వ్యూ చేస్తాడు. ఆ ముఖాముఖీలో వారు పాత జ్ఞాపకాలను చెబుతారు. ఫ్లాష్ బాక్ పద్ధతిలో మనకు కథ తెలుస్తుంది.

## చిత్రా నోదియ పారే
## (చిత్రానది ప్రశాంతంగా ప్రవహిస్తోంది - 1999) బెంగాలీ

బంగ్లాదేశ్ చిత్ర నిర్మాత, రచయిత తన్వీర్ మోకమ్మల్ (08-03-1955) ప్రస్తుతం ఢాకాలోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కు డైరెక్టర్‌గా వున్నారు. ఆయన ఢాకా విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు సాహిత్యంలో ఏం.ఏ. చదివారు. ఆయన తండ్రి మెజిస్ట్రేట్. తల్లి టీచరు. తన్వీర్ వామపక్ష జర్నలిస్టుగా భూమిలేని రైతాంగానికి మద్దతుగా నిలబడ్డాడు. ఆయన కవితలు, కథలు, సినిమా మరియు సాంస్కృతిక అంశాలపై వ్యాసాలు, పుస్తకాలు రాశారు. మొత్తం 6 సినిమాలు నిర్మించారు. 15 డాక్యుమెంటరీలు, లఘుచిత్రాలు తీశారు. బంగ్లాదేశ్ ఫిల్మ్ సెంటర్‌ను స్థాపించాడు. 'స్వప్నభూమి', 'సీమాంతరేఖ' కూడా ఈయన చిత్రాలే.

16 ఎంఎంలో 114 నిమిషాల నిడివిగల చిత్రం ఇది. తూర్పు బెంగాల్‌లో చిత్రా నది ఒడ్డున వున్న నరైల్ అనే ఒక చిన్న పట్టణంలో కథ జరుగుతుంది. విభజన అనంతరం అక్కడి ఒక హిందూ కుటుంబం

వలస పోకుండా అక్కడే తమ జన్మభూమిలోనే గడపిన అనుభవాలను దీనిలో చిత్రించారు. ఆ వూరిలో శశికాంత సేన్ గుప్తా ఒక లాయరు. విధురుడు. ఆయన కూతురు మనోతి, కొడుకు విద్యుత్. శశికాంత్ వితంతు సోదరి అనుప్రభాదేవి కూడా ఆ ఇంటిలో వుంటారు. దేశ విభజన అనంతరం హిందువులు, శశికాంత్ బంధువులు నరైల్ వదలి వెళ్లిపోతారు కానీ శశికాంత్ అలా ఆ వూరు వదలి వెళ్ళటానికి ఇష్టపడడు. పిల్లలు మనోతి, విద్యుత్‌లను పొరుగున వున్న ముస్లిం కుటుంబం వారు పెంచుతారు.

క్షౌరం చేయించుకుంటున్నప్పుడు మంగలి బిజయ్ శశికాంత్‌ను వలస పోవడం గురించి అడిగితే, శశికాంత్ 'నేను ఎక్కడికీ పోను. నీవు ముస్లిం రైతులు పండించే ఆహార ధాన్యాలు తింటావు. కానీ వారిని అంటరానివారిగా చూస్తావు,' అని మందలిస్తాడు. అనుప్రాభాదేవి ఒక రోజు మంగలి బిజయ్‌ను దేశం విడిచి వెళ్తున్నావా అని అడిగితే అతను 'ఎందుకమ్మా! మాకు ఏ దేశమైనా ఒకటే. ఎక్కడ వున్నా మా పని క్రాపులు చేయడం, గడ్డాలు గీయడమే గదా' అంటాడు.

మనోతి సాల్మాతో కలిసి స్కూల్‌కు వెళ్తుంటే మీజాన్ అనే అమ్మాయి మనోతితో 'నీవు కూడా నాగేంబాబు లాగా కలకత్తా వెళ్తావా? నీవు హిందువు కదా' అన్నప్పుడు మనోతి దానిని తీవ్రంగా ప్రతిఘటిస్తూ 'ఎందుకు వెళ్ళాలి? నరైల్ విడిచి మేము ఎక్కడికీ పోము' అని జవాబు చెప్తుంది. విభజన గాయం పిల్లలను కూడా ఎంతగా గాయపర్చిందో ఇక్కడ మనం గమనిస్తాం.

మతతత్వం అనేది మానవుడిలో సహజాతం కాదు. అది రాజకీయ చదరంగపు క్రీడ. దానిలో పావులు వేలాదిమంది ప్రజలు. రాజకీయ ప్రయోజనాలకోసం నాయకులు వారిని బలి చేస్తారు. కోర్టు ఆవరణలో శశికాంత్ కు, షంషుద్దీను కు మధ్య స్నేహపూర్వక సంభాషణ వారు చిరకాలమిత్రులని తెలియచేస్తుంది.

శశికాంత్ తన జన్మస్థలమైన నరైల్‌ను వదిలిపెట్టి వెళ్లడానికి ఇరుగూ పొరుగూ, మిత్రులూ, బంధువులూ చెప్పినా ఒప్పుకోడు. చిత్రా నది ఒడ్డునే వుంటానంటాడు. తన ఇల్లు కొనడానికి కాంట్రాక్టరు హమీద్ రావడం ఒక రకమైన బెదిరింపుగానే చూస్తాడు. అప్పుడు కొంత సంశయం ప్రకటిస్తాడు వెళ్లాలా వద్దా అని. తన కొడుకు విద్యుత్ కలకత్తాకు వెళ్లిపోతానన్నప్పుడు మాత్రం అదరిపోతాడు. అతని అన్న నిధుకాంత్ కూడా తన భార్యా, వితంతువైన కూతురు బసంతితో ఆ వూరిలోనే వున్నాడు. వారికి గతంలో లభించిన గౌరవం క్రమంగా తగ్గుతూ వుంటుంది. భూమి కౌలుకు తీసుకున్న ముస్లిం కౌలు సక్రమంగా ఇవ్వడానికి నిరాకరిస్తున్నాడు. ఇరుగు పొరుగు వారు కొత్తవారిగా ప్రవర్తిస్తున్నారు. యువతులు వున్న హిందూ కుటుంబాలవారు అభద్రతా భావంతో జీవిస్తున్నారు. వారి రేకు ఇంటి కప్పులపై రాత్రిపూట అల్లరి మూక రాళ్ళు విసురుతున్నారు.

మినోతి పెద్ద చదువులు చదవటానికి ఢాకా వెళ్ళిన బాదల్‌ను ప్రేమించింది. కానీ 1960లలో ఢాకా అల్లకల్లోల నగరం గా మారింది. ముజబర్ రహ్మాన్ నాయకత్వాన నియంత ఆయూబ్ ఖాన్‌కు వ్యతిరేకంగా పోరాటం సాగుతోంది. విద్యార్థులు పాల్గొన్న ఒక పెద్ద ప్రదర్శన కర్జన్ హాల్ నుంచి మెడికల్ కాలేజీ వైపు వెళ్తుంటే పోలీసులు అడ్డుకొని ముందు లాఠీ చార్జ్ తరువాత కాల్పులు జరుపుతారు. ప్రదర్శనలో ముందు వరుసలో వున్న బాదల్ ఆ కాల్పులలో మరణిస్తాడు.

ఆ తరువాత జమ్ము కాశ్మీర్‌లోని హజరత్ బల్ పుణ్య క్షేత్రంలో వుంచబడిన మహమ్మద్ ప్రవక్త నల్లటి గడ్డంలోని పవిత్ర కేశం దొంగలించిన సంఘటన సందర్భంగా 1964 ప్రారంభంలో తూర్పు పాకిస్తాన్లో కొన్ని ప్రాంతాలలో ఆందోళనలు చెలరేగాయి. హిందువులపై వారి ఆస్తులపై దారుణమైన దాడులు, హత్యలు జరిగాయి. ఈ పరిస్థితిలో కూడా శశికాంత్ తన గ్రామం విడిచిపెట్టాలనుకోలేదు. దుర్గాపూజ సందర్భంగా జరిగిన అల్లరులు అతనిని బాగా క్రుంగదీస్తాయి. కూతురు మినోతిని రక్షణ కోసం షంషుద్దీన్ ఇంటికి పంపిస్తాడు. కానీ ఆమె వితంతు సోదరి బసంతి పై అల్లరి మూకలు లైంగిక దాడి చేసి ఆమెను చంపేస్తాయి. ఈ సంఘటనతో శశికాంత్ అన్న నిధుకాంత్ భార్యతో కలిసి దేశం వదిలి వెళ్తాడు. అయినా శశికాంత్ తన వూరిని వదలలేదు. ఒకరోజు మధ్యాహ్నం నది ఒడ్డున నడుస్తూ గుండెపోటుతో మరణిస్తాడు. మినోతి, అనుప్రభాదేవిలను పట్టించుకునేవారెవరూ లేకపోవడంతో అభద్రత కారణంగా వారు దేశం వదిలి వెళ్తారు. **(ఇంకావుంది)** ✣

## గుర్తుంచుకుందాం

## కొంపల్లి వెంకట గౌడ్



**రచయిత,** ప్రత్యేక తెలంగాణావాది, చరిత్ర పరిశోధకుడు కొంపల్లి వెంకట గౌడ్ తన 48వ యేట 2025 సెప్టెంబరు 25 న మరణించారు. ఆయన 1973 మార్చ్ 5న మునగాల మండలం కలుకోవ గ్రామంలో జన్మించారు.

జయశంకర్ జీవిత విశేషాలతో 'పొడవని ముచ్చట', ఇంజనీరు విద్యాసాగరరావు గురించి 'నీళ్ల ముచ్చట', 'సర్వాయి పాపన్న చరిత్ర' మొదలగు పుస్తకాలు ప్రచురించారు. బడుగు, బలహీన వర్గాలను చైతన్య పరిచే కవితలు రాశారు. 1997 నాటి గోసంగి ప్రచురణల కవిత్వ సంకలనం 'మేమే' లో బహుజన కవిత్వం రాశారు. ✣

వ్యాసం

# బహుళజాతి కంపెనీల డేటా సెంటర్లు - భవిష్యత్తు తరాలకు వరాలా? శాపాలు??

ప్రశ్న

**నిరుద్యోగ** సమస్యకు పరిష్కారంగా, ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా, అభివృద్ధి పథంలో దూసుకెళ్ళటానికి కృత్రిమ మేధస్సు సాంకేతిక కేంద్రం (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్)ను విశాఖలో ఏర్పాటు చేస్తున్నామని ఎన్‌డిఏ ప్రభుత్వం చెప్పుకుంటుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 10 బిలియన్ డాలర్ల (8 లక్షల 75 వేల కోట్ల రూ॥లు) పెట్టుబడిని, 1,88,000 ఉద్యోగాల కల్పనను ఆశిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించగా, రాబోయే ఐదు సంవత్సరాలలో ఒక లక్షా 30 వేల కోట్ల రూ॥ల (15 బిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు ఈ అక్టోబర్ 14న గూగుల్ ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన మన దేశంలో ఇప్పటివరకు ఇదే అతిపెద్ద ఏకమొత్తం పెట్టుబడి. కృత్రిమ మేధస్సు సేవలకు పెరుగుతున్న డిమాండ్ నుండి లబ్ది పొందేందుకు గాను, కొత్త మౌలిక సదుపాయాలను నిర్మించడానికి బహుళజాతి కంపెనీలన్నీ భారీగా పెట్టుబడులు పెడుతున్న క్రమంలో తమ డేటా సెంటర్ల సామర్థ్యాన్ని పెంచడానికి ఈ సంవత్సరం సుమారు 85 బిలియన్ డాలర్లను (7 లక్షల 50 వేల కోట్ల రూ॥లు) పెట్టుబడి పెట్టడానికి గూగుల్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. 1 గిగావాట్ ప్రారంభ సామర్థ్యం కలిగిన విశాఖపట్నంలోని ఈ డేటా సెంటర్ అమెరికా వెలుపల తమ కంపెనీకి "అతిపెద్ద AI హబ్" అవుతుందని గూగుల్ క్లౌడ్ CEO థామస్ కురియన్ ప్రకటించారు. "భారతదేశం యొక్క స్వంత AI మిషన్‌ను వేగవంతం చేయడమే మా దీర్ఘకాలిక దృష్టి" అని కూడా ఆయన సెలవిచ్చారు.

భారత్-అమెరికాల మధ్య సుంకాలకు సంబంధించిన ఉద్రిక్తత/ దౌత్యపరమైన ప్రతిష్టంభన / వాణిజ్య ఒప్పందం నిలిచిపోయినట్లు/ అమెరికా వస్తువులను బహిష్కరించాలని మోడీ పిలుపునిచ్చినట్లుగా ప్రచారం జరుగుతుండగానే గూగుల్ యొక్క ఈ ప్రణాళిక బయటకు రావడం గమనార్హం. అమెరికా సుంకాలపై అసంతృప్తి ఉన్నప్పటికీ, సులభమైన వ్యాపార వాతావరణాన్ని అందించడానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పడానికి భారత అధికారులు అమెరికా కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లను ప్రైవేట్‌గా కలిశారని రాయిటర్స్ ఈ సందర్భంగా నివేదించింది.

వంద కోట్ల మంది వినియోగదారులు ఇంటర్నెట్‌ను ఉపయోగించే కీలక మార్కెట్ ఐన భారతదేశంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్ మరియు అమెజాన్ ఇప్పటికే బిలియన్ల కొద్దీ డాలర్లు ఖర్చు చేశాయి. అంతేకాక మోషా (మోడీ-అమిత్ షా)లకు ప్రాణాధిక స్నేహితులూ, భారత దళారీ బూర్జువావర్గపు అత్యున్నత ప్రతినిధులు ఐన అందానీలకు (అదానీ-అంబానీ) కూడా వీటిలో వాటాలు ఇచ్చారు. అదానీ గ్రూప్ మరియు భారతీ ఎయిర్‌టెల్ ఈ కొత్త ప్రాజెక్ట్ కోసం మౌలిక సదుపాయాలను నిర్మించడానికి గూగుల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఇందులో కొత్త అంతర్జాతీయ సబ్‌సీ గేట్‌వే నిర్మాణం కూడా ఉంది. ఇక్కడ దాని YouTube వీడియో సేవలు ఎక్కువ మంది వినియోగదారులను కలిగి ఉండటమే కాక స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో తమ యాండ్రాయిడ్ ఫోన్లే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి.

కృత్రిమ మేధస్సుకి విపరీతమైన కంప్యూటింగ్ శక్తి అవసరం. ఐటీ కంపెనీలు వేలాది చిప్‌లను అనుసంధానించడానికి వీలు కల్పించే ప్రత్యేక డేటా సెంటర్‌లకు డిమాండ్‌ను ఈ అవసరమే పెంచుతుంది. AI డెవలపర్లు చౌకైన భూమి మరియు పన్ను రాయితీల కోసం విస్తృతంగా వెతుకుతున్న ప్రారంభ దశలో గ్రామీణ అమెరికా డేటా సెంటర్ల దుష్ప్రభావాన్ని మొదట రుచి చూసింది. ప్రమాదాన్ని గ్రహించిన స్థానిక సంఘాలు డేటా సెంటర్లపై తిరుగుబాటు చేశాయి. సైన్స్ 4.0 డేటా సెంటర్‌తో సంబంధం ఉన్న అవినీతి ఆరోపణల నేపథ్యంలో పోర్చుగల్‌లో, ఆంటోనియో కోస్టా గత సంవత్సరం ప్రధాన మంత్రి పదవి నుండి వైదొలగాల్సి వచ్చింది. నెదర్లాండ్స్, మెక్సికో, ఉరుగ్వే మరియు UK కూడా డేటా సెంటర్‌లపై వ్యతిరేకతతో తీవ్ర ఉద్రిక్తతలను ఎదుర్కొన్నాయి. చిలీలో, నీటి వినియోగ సమస్యలపై ఆందోళనలతో గూగుల్ డేటా సెంటర్ కోసం తన ప్రణాళికలను నిలిపివేసింది.

డేటా సెంటర్లు అనేవి వెబ్‌సైట్‌లు, కంపెనీలు మరియు ప్రభుత్వాలు ఉపయోగించే డేటాను నిల్వ చేసే మరియు ప్రాసెస్ చేసే కంప్యూటర్ల స్టాక్‌లను ఉంచే విస్తారమైన గిడ్డంగులు. "డేటా సెంటర్స్ ఔట్‌లుక్ – గ్లోబల్" పేరుతో వ్యాపార విశ్లేషణ సంస్థ మూడీస్ ప్రచురించిన నివేదిక ప్రకారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ మరియు డేటా నిల్వ సేవలకు మద్దతు ఇవ్వడానికి డేటా సెంటర్ సామర్థ్యం పెంపు కోసం 2025లో డిమాండ్ తీవ్రమవుతుంది" అని పేర్కొంటూ "డేటా సెంటర్లకు భారీ మొత్తంలో విద్యుత్ అవసరం గురించి ప్రజల ఆందోళనలు మరింతగా తెరపైకి వస్తాయి. జాతీయ మరియు స్థానిక

ప్రభుత్వాలు కొత్త డేటా సెంటర్లను ఆకర్షించడానికి పన్ను ప్రోత్సాహకాలను అందిస్తున్నప్పటికీ, పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత వీటి ఏర్పాటును పరిమితం చేసే అవకాశాలు ఉన్నాయి" అని నివేదించింది. AI డేటా సెంటర్లకు గణనీయంగా విద్యుత్ అవసరం, అవి తీవ్రమైన వేడిని ఉత్పత్తి చేస్తాయి, సర్వర్లు వేడెక్కకుండా నిరోధించడానికి టన్నుల లీటర్ల నీరు అవసరం. స్కాట్లాండ్‌లో AIకి శక్తినిచ్చే డేటా సెంటర్లు సంవత్సరానికి 27 మిలియన్ హాఫ్-లీటర్ బాటిళ్లను నింపడానికి తగినంత కుళాయి నీటిని ఉపయోగిస్తున్నాయని BBC నివేదించింది. ప్రపంచవ్యాప్తంగా శీతలీకరణ మరియు నిర్వహణ కోసం ఏటా బిలియన్ల లీటర్లను వినియోగిస్తాయి. భూగర్భజల క్షీణత, క్రమరహిత వర్షపాతం మరియు వాతావరణ వైవిధ్యాలతో ఇప్పటికే తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్న విశాఖపట్నంలో ఈ ప్రాజెక్టు సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుంది, స్థానికుల వినియోగం నుండి విలువైన నీటిని దారి మళ్లిస్తుంది. ఉరుగ్వేలోని గూగుల్ డేటా సెంటర్ అనుభవాలు, ఈ డేటా సెంటర్లు తరచుగా విషపూరిత వ్యర్థాలను ఉత్పత్తి చేస్తాయని, గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తాయని మరియు స్థానికులకు ప్రయోజనం తక్కువేనని తెలియజేస్తున్నాయి. విశాఖపట్నం యొక్క వేడి వాతావరణం దృష్ట్యా, ప్రతిపాదిత కాంప్లెక్స్‌కు మరింత నీటి వినియోగ శీతలీకరణ వ్యవస్థలు అవసరమవుతాయి, భూగర్భ జలాలను మరింత తగ్గిస్తాయి మరియు రసాయన వ్యర్థాల ద్వారా స్థానిక నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

అంతేకాదు, మరో ప్రధాన సమస్య విపరీతమైన విద్యుత్ వినియోగం. డేటా సెంటర్ల సామర్థ్యాన్ని విద్యుత్‌కి ప్రమాణమైన గిగావాట్‌లలో సూచిస్తారు. డేటాకి ప్రమాణమైన గిగాబైట్‌లలో కాదు. దీనిలో విద్యుత్ వినియోగం అంత భారీగా ఉంటుంది. ఇది లక్షలాది ఇళ్ళు కలిగిన ఒక మధ్యస్థాయి నగరానికి అవసరమైన విద్యుత్తుకు సమానం. ఈ భారీ ప్రాజెక్టు 100 శాతం పునరుత్పాదక విద్యుత్‌తో నడుస్తుందని చెబుతున్న గూగుల్ మాటలు సాంకేతికంగా నమ్మదగినవి కాదు. బ్యాకప్‌లో శిలాజ-ఇంధన విద్యుత్ లేకుండా రాష్ట్ర విద్యుత్ గ్రిడ్ పునరుత్పాదక విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయలేదు. ఈ స్థాయి డేటా సెంటర్లు పీక్ డిమాండ్ సమయంలో శిలాజ ఇంధనాలపై ఆధారపడక తప్పదు. తద్వారా భారీ స్థాయిలో కార్బన్ ఉద్గారాలను ఉత్పత్తి చేసి ప్రపంచ వాతావరణ సమతుల్యత లక్ష్యాలను దెబ్బతీస్తాయి.

ప్రపంచ పెట్టుబడిదారుల బాకా ఐన 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' మ్యాగజైన్ సైతం 25 ఫిబ్రవరి 2025న, తన "ది AI డేటా-సెంటర్ బూమ్ ఈజ్ ఎ జాబ్-క్రియేషన్ బస్ట్" అనే కథనంలో "పరిశ్రమ మరియు రాజకీయ నాయకులు డేటా సెంటర్‌లను ఉపాధి వరంలాగా ప్రచారం చేస్తారు, కానీ డేటా సెంటర్‌లకు చాలా తక్కువ మంది కార్మికులే అవసరం" అని చెప్పక తప్పలేదు. ఆంధ్రప్రదేశ్‌లోని డేటా సెంటర్‌లకు నిర్మాణ సమయంలో నిర్మాణ కార్మికులు మాత్రమే పెద్ద సంఖ్యలో అవసరం. నిర్మాణం పూర్తయిన తర్వాత చాలా తక్కువ మంది ఉద్యోగులు మాత్రమే అవసరం. "భారీ" ఉద్యోగ అవకాశాలు డేటా సెంటర్ వల్ల రావు, దానికి అవసరమైన మౌలిక సదుపాయాలను నిర్మించడం కోసం, తాత్కాలికంగా మాత్రమే వస్తాయి. "డేటా సెంటర్‌లు ఉద్యోగ కల్పన విషయంలో అత్యల్ప సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయనే చెడ్డపేరు పొందాయని" డేటా-సెంటర్ ఆపరేటర్ 'పాట్మోస్ హోస్టింగ్' యొక్క చీఫ్ ఎగ్జిక్యూటివ్ జాన్ జాన్సన్‌ను 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' ఉటంకించింది.

డేటా సెంటర్లలో తీవ్ర స్థాయిలో యాంత్రీకరణ ఉంటుంది. ఒకసారి ప్రారంభమైన తర్వాత, అవి కొన్ని వందల దీర్ఘకాలిక ఉద్యోగాలను మాత్రమే సృష్టిస్తాయి, అది కూడా ఎక్కువ భాగం అవుట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేయబడే అత్యంత ప్రత్యేక సాంకేతిక ఉద్యోగాలు. స్థానికులకు అందించే ఉపాధి తాత్కాలికమైనది మరియు తక్కువ నైపుణ్యం/వేతనాలు కలిగినది. నిర్మాణానికి, సాధారణ నిర్వహణ పనులకే పరిమితం అవుతుంది. ఈ కంప్యూటర్ల గిడ్డంగి స్థానిక ఆర్థిక వ్యవస్థతో అతితక్కువ సంబంధాలను కలిగి ఉంటుంది కాబట్టి పాలకులు చెబుతున్న పరోక్ష ఉపాధిలోని భారీ తనం కూడా మోసపూరితమే. ప్రపంచవ్యాప్తంగానూ, భారత దేశంలోనూ ఇప్పటికే నడుస్తున్న డేటా సెంటర్ల వల్ల పెరిగిన ఉపాధిని ఎవరైనా ఇప్పుడు చెక్ చేసుకోవచ్చు. కానీ మన పాలకులు ఈ నిజాలు మాట్లాడే వాళ్ళను దేశద్రోహులుగా చిత్రించడం యథావిధిగా మొదలుపెట్టేశారు. మన రాష్ట్రంలోని ప్రస్తుత ప్రతిపక్ష పార్టీ ఐతే, ఈ ప్రాజెక్టును తమ పాలనా కాలంలోనే తెచ్చామని ఆ ఘనత తమకే దక్కాలని మాట్లాడుతుంది.

మరి మన అధికార, ప్రతిపక్ష పార్టీలు క్రెడిట్ కోసం పోటాపోటీగా పోరాడుతున్న ఇంత భారీ ప్రాజెక్టు వల్ల ఆర్థిక ప్రయోజనం ఏమీ లేదా? తప్పకుండా ఉంది. కాకపోతే ఆ ప్రయోజనం విదేశీ స్వదేశీ కార్పొరేట్ కంపెనీలకు మాత్రమే. ఎక్కడో సప్త సముద్రాల ఆవల ప్రధాన కార్యాలయాలు కలిగిన కార్పొరేట్ సప్లై చైన్‌కి ఈ ప్రయోజనం సముద్రగర్భ పైప్ లైన్ ద్వారా ప్రవహిస్తుంది. ఏది ఏమైనప్పటికీ, కార్పొరేట్ల పట్ల అత్యంత స్వామి భక్తి గల మన రాష్ట్ర ప్రభుత్వం రాబోయే 20 సంవత్సరాలలో సుమారు 22,000 కోట్ల విలువైన పన్ను మినహాయింపులు, భూమి కేటాయింపు, నీరు, విద్యుత్ మరియు మౌలిక సదుపాయాల కోసం గూగుల్‌కు ఉదారమైన ఆర్థిక మరియు ఆర్థికేతర ప్రోత్సాహకాల ప్యాకేజీలను హామీ ఇచ్చింది.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో, 113 ప్రాజెక్టులలో 10 లక్షల కోట్ల రూ॥ల విలువైన పెట్టుబడికి, 4.1 లక్షలకు పైగా ఉద్యోగాలకు హామీలను పొందింది. ఉద్యోగాల సంగతి పక్కన పెడితే, పెట్టుబడులు మాత్రం నిజమే కావచ్చు. ఈ పెట్టుబడులన్నీ కూడా ఉపాధి కల్పన ముసుగులో రాష్ట్ర సహజ వనరులను, మానవ వనరులను, బడ్జెట్ వనరులను కొల్లగొట్టడానికి వస్తున్నవే

అనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. అంతే కాదు. తమ కమీషన్ల కోసం, వాటాల కోసం మన రాజకీయ నాయకులు, దేశీ కార్పొరేట్లు వీటికి స్వాగతం పలుకుతున్నారనడంలో కూడా ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇలాంటి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడం కోసం "టెక్నాలజీ, ట్రస్ట్, అండ్ ట్రేడ్" మరియు "నూతన భౌగోళిక ఆర్థిక క్రమాన్ని అందుకోవడం" అనే థీమ్‌తో నవంబర్ 14 మరియు 15 తేదీల్లో 30వ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (CII) భాగస్వామ్య సదస్సు విశాఖపట్నంలో జరగనుండటంతో అమెరికా, సింగపూర్, దావోస్ మరియు సిడ్నీలలో లోకేష్ తన సుడిగాలి పర్యటనలలో వారి స్వర్ణాంధ్ర విజన్ 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగానూ, విశాఖపట్నంను ట్రిలియన్ డాలర్ల (87 లక్షల కోట్ల రూ॥ల) ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చేస్తామని చిత్రిస్తున్నారు.

యూరోప్‌లోని ఐర్లాండ్, నెదర్లాండ్స్, డెన్మార్క్ ఇవన్నీ అభివృద్ధి చెందిన దేశాలు. ఐర్లాండ్‌లో డేటా సెంటర్ పెట్టాలని గూగుల్ ప్రయత్నం చేయగా, మా దేశ ప్రజలంతా కలిసి వాడేంత విద్యుత్తు ఒక్క మీ డేటా సెంటర్ కే ఇవ్వాలి, మా దేశంలో డేటా సెంటర్ వద్దు అని ఐర్లాండ్ ప్రభుత్వం తిరస్కరించింది. నెదర్లాండ్స్‌లో డేటా సెంటర్ పెట్టాలని మెటా ప్రయత్నం చేయగా, ఆక్కడి ప్రజలు వ్యతిరేకించటంతో నెదర్లాండ్స్ ప్రభుత్వం కూడా తిరస్కరించడమే కాక, దేశంలో పెద్ద డేటా సెంటర్లు పెట్టటానికి వీలు లేదు అని ఏకంగా చట్టమే చేసింది. పెద్ద డేటా సెంటర్లు పెట్టటం వలన పవర్ గ్రిడ్లు దెబ్బతినటం తప్ప ఉపయోగం తక్కువ అని డెన్మార్క్ కూడా అనుమతులు ఇవ్వటం లేదు. ఇక లాటిన్ అమెరికా దేశాలైన చిలీ, ఉరుగ్వే, మెక్సికో దేశాల్లో డేటా సెంటర్ పెట్టాలని గూగుల్ ప్రయత్నించింది. అక్కడి ప్రజలు, పర్యావరణవేత్తలు నిరసన వ్యక్తం చేయటంతో ముందుకు కదలలేకపోయింది. ఇక అమెరికాలో డేటా సెంటర్ హబ్‌గా పేరొందిన రాష్ట్రం వర్జీనియా. పవర్ గ్రిడ్ మీద పడే లోడు, పెరిగిన కరెంట్ బిల్లులు, వాటి నుంచి నిరంతరం వచ్చే ఎమిషన్స్, శబ్దాలు, విపరీతమైన నీటి వినియోగం, అవి తీసుకునే వందల ఎకరాల భూమి, ఇవన్నీ గమనించాక వాటిలో వచ్చే ఉద్యోగాల కన్నా నష్టపోయేది ఎక్కువ అని గ్రహించిన అక్కడి ప్రజలు "మా దగ్గర వద్దు" NIMBY (Not In My BackYard) అంటూ వాటిని వ్యతిరేకిస్తున్నారు. ఏ రాజకీయ నాయకుడు అయినా వాటికి మద్దతుగా మాట్లాడితే అక్కడి ప్రజలు ఎన్నికల్లో ఓడిస్తున్నారు. ఇప్పుడు అక్కడ అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ కూడా వాటిని వ్యతిరేకిస్తున్నారు. గుండుసూది కూడా ఇక్కడే తయారు చేయాలని, విదేశాల్లో వీలు లేదని రోజూ గొడవ చేసే పెట్టుబడి పెట్టడానికి కూడా వీటి విషయంలో మాత్రం ఏమీ అనటం లేదు. ఆ దేశాల్లో అవసరాన్ని మించి కరెంట్ ఉత్పత్తి అవుతుంది. మన కంటే నీటి వనరులు కూడా ఎక్కువే. అయినా సరే డేటా సెంటర్లు పెట్టటానికి ఒప్పుకోక పోవటంతో ఈ పెద్ద కంపెనీలు సముద్రం ఒడ్డున ఉండే మూడవ ప్రపంచ దేశాల వైపు చూస్తున్నాయి. ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలు తమ e-wasteను ఆఫ్రికా, ఆసియాలోని కొన్ని దేశాల్లో డంప్ చేస్తూ ఉంటాయి. కొంచెం అటుఇటుగా ఈ డేటా సెంటర్లు కూడా అటువంటివే! ఇక్కడ విషాదం ఏమిటంటే తన వ్యాపార పద్ధతులపై భారతదేశంలో అనేక అపనమ్మకాలను మూటగట్టుకుని YouTube యొక్క AI విధానాన్ని సవాలు చేస్తూ యువ బచ్చన్ జంట నుండి కేసును కూడా ఎదుర్కొంటోంది. అంతేకాదు, కార్బన్ న్యూట్రాలిటీకి తన మద్దతును ఉపసంహరించుకుని 2030 నాటికి నెట్ జీరో లక్ష్యాలను సాధించడం సాధ్యం కాకపోవచ్చునని అంగీకరించిన గూగుల్‌కు మన ప్రభుత్వాలు, వారు అడగని రాయితీలు కూడా ఇచ్చి, లాభనష్టాలు బేరీజు వేసే అవకాశం ప్రజలకు ఇవ్వకుండా వాటికి ఎర్ర తివాచీ పరవటం!!

కులాల కంపులో మత మారణహోమాల్లో మాదకద్రవ్యాల మత్తులోకి యువతరాన్ని దింపి తమ ప్రజావ్యతిరేక విధానాలను కొనసాగిస్తున్న పాలకుల వైఖరిని గుర్తించేలా యువతను, ప్రజలను చైతన్యపరచాలి. ఉద్యోగ కల్పనకు, మన ఆర్థిక అభివృద్ధికి దోహదపడకపోగా నీటిని, విద్యుత్‌ను అధికంగా వినియోగిస్తూ కాలుష్యాన్ని పెంచే ఈ డేటా సెంటర్లు ప్రజలకు ఉపయోగపడకపోగా అవి చేసే విధ్వంసమే ఎక్కువన్న నిజాన్ని తెలియచేయాలి. ఒకప్రక్క పర్యావరణ విధ్వంసం, మరోప్రక్క వనరులను ప్రజలకు అందకుండా చేస్తున్న కుట్రలను బహిర్గతం చెయ్యాలి. ✣

## గుర్తుంచుకుందాం



# ఆచార్య పావనమూర్తి

**ఆంధ్ర** విశ్వకళా పరిషత్తులో రాజకీయ శాస్త్ర విభాగపు అధిపతిగా పనిచేసిన చింతకాయల పావనమూర్తి తన 89వ యేట 2025 అక్టోబరు 27న విశాఖలో మరణించారు. ఆయన స్వస్థలం యానాం.

అంబేద్కర్ భావజాల వ్యాప్తికి పావనమూర్తి విశేష కృషి చేశారు. విశాఖ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీకి అధ్యక్షులుగా, కార్యదర్శిగా చేశారు. 'అంబేద్కర్ ఆశయాలు–బౌద్ధధర్మం'; 'సామాజిక న్యాయం–రాజకీయ భావజాలం'; 'బాబాసాహెబ్ అంబేద్కర్–తెలుగు ప్రజలకు ఒక చరిత్ర' మొదలగు పుస్తకాలు రాశారు. ✣

# అసురుడు

## పరాజితుల గాథ

## రావణుడూ, అతని ప్రజల కథ

ఆంగ్లం : **ఆనంద్ నీలకంఠన్** | అనువాదం : **ఆర్. శాంతసుందరి** | పరిచయకర్త : **జి.వి. భద్రం**

(గత సంచిక తరువాయి)

### భద్రుడు చెప్పిన కథ

తర్వాత రావణుడు సరయూ నదీతీరాన అతిచిన్న రాజ్యమైన అయోధ్యను సైనికులతో చేరుకొని, ఆ అయోధ్యను పాలించే రాజైన అనరణ్యుడ్ని లొంగిపొమ్మని సందేశం పంపినట్లూ అతడు తాను బ్రాహ్మణరాజుననీ, సంకరజాతికి చెందిన అసురుడికి లొంగనని చెప్పగా, అతడి తలను నరికేసినట్లూ, అతడి సైనికులు అనరణ్యుడి భవనాన్ని దోచుకొన్నట్లూ, ఆ సందర్భంగా రావణుడు ఒక అందగత్తె అయిన బ్రాహ్మణ విధవను చూసి, మోహపడి బంధించినట్లూ, బలాత్కారం చేయబోగా ఆమె అతడ్ని ముఖం మీద కొట్టినట్లూ, ఆమె తన భర్త చనిపోవటం వల్ల బ్రాహ్మణ ఆచారం ప్రకారం విధవగా జీవిస్తున్నట్లు తన దీనగాధను రావణునికి తెలియజేసినట్లూ, దాంతో రావణుడు కరిగిపోయి మరుక్షణం నుంచీ ఆమె ప్రేమలో పడినట్లూ – ఆమె పేరు వేదవతి అనీ, భద్రుడు తెలియజేస్తాడు.

రావణుడు పూర్తిగా ఆ బ్రాహ్మణ యువతిని వశపరచుకొనే పనిలో మునిగిపోయాడనీ, ఆయన ఈదటంలో తనకి వున్న సామర్థ్యాన్ని చూపి వేదవతిని ఆకట్టుకోవాలనే ప్రయత్నంలో నర్మదానదిలోకి దూకటంతో తల నీళ్ళలో వున్న బండరాయికి కొట్టుకోవటంతో, ప్రవాహవేగంలో కొట్టుకుపోయాడనీ, కొన్నాళ్ళకి కార్యవీర్యార్జునుడు తాను అసుర మహారాజును బంధించినట్లు కబురు పంపాడనీ, విద్యుజ్జిహ్వుడి అనుచరులు రావణుడు చనిపోయాడని ప్రచారం చేసారని భద్రుడు తెలిపాడు. తనకు ప్రధానమంత్రి ప్రహస్తుడు కబురు పంపించాడనీ, తాను వెళ్ళగా అక్కడే వున్న విద్యుజ్జిహ్వుడు "మనం ఆ వేదవతిని వదిలించుకోవాలి. అలాగే ఆ అదృష్టహీనురాలైన చిన్న రాజకుమార్తె (రావణుడి కూతురు) విషయం కూడా; ఆ విషయం చూడు!" అంటూ వారిద్దరినీ అంతం చెయ్యమని తనను ఆజ్ఞాపించాడనీ, మంత్రులు రావణున్ని విడిపించే పథకం ఆలోచిస్తున్నారనీ భద్రుడు తెలియజేశాడు.




వాళ్ళు వేదవతి చేత మత్తుమందు తినిపించి, తన బండిలో పడవేశారనీ, మారీచుడు, రావణుని కూతురిని ఆ బండిలో వేదవతి ప్రక్కన పడుకోబెట్టాడనీ, తాను వారిని అంతం చేయటం కోసం బండిలో ప్రయాణం మొదలుపెట్టాననీ, అడవిబాటలో సాగుతూండగా చీకటిపడగా, తాను బండిలో నూనె దీపం పెట్టాననీ, బండి కుదుపుకు నూనె దీపం ఒరిగిపోయి, వేదవతిమీద పడటంతో, ఆమె బట్టలకు నిప్పంటుకొని, ఆమె శరీరం కాలి, చనిపోయిందనీ భద్రుడు వివరించాడు.

తాను పసిపిల్లను ఒళ్ళో పెట్టుకొని, నిద్రలోకి జారుకోగా, వేట ఆడుతూ ఒక పెద్ద గుంపు గుర్రాల మీద, ఆయుధాలు పట్టుకొని తమవేపే వస్తూండటం గమనించి, భయంతో పారిపోయేందుకు వెనుకకు తిరిగి, కాలుజారి పొదల్లో పడ్డాననీ, తన చేతుల్లో వున్న పసిపాప పట్టు తప్పి బంకమట్టితో నిండిన గుంటలో పడిపోయిందనీ, అది ఊబి అనీ, అందువలన పాప లోపలికి కూరుకు పోతుండగా, ముఖ్యమైన వ్యక్తిలా కనిపించే ఒకాయన, తన అనుచరుల్లో ఒకరిని నాగలి తీసుకురమ్మని, తెచ్చిన నాగలి సాయంతో పాపను అతి జాగ్రత్తగా బయటికి తీశాడనీ, ఆయన మిధిలకు రాజనీ, ఆయన పేరు జనకుడని, తనకు తెలిసిందనీ, ఆయన ఆ పాపను తన భవనానికి తీసుకుపోయి, పురోహితులు (బ్రాహ్మణ) మంత్రాలు చదువుతుండగా, ఆ పాపకు సీత అనే పేరు పెట్టాడనీ భద్రుడు చెప్పాడు.

దండయాత్ర చేసి తాము సంపాదించినదంతా చెల్లించి తనవాళ్ళు తన్ను వెనక్కి తెచ్చారనీ, ఒక్క దెబ్బతో కార్త వీర్యార్జునుడు తన సేనను నిర్వీర్యం చేశాడనీ, మళ్ళీ తాను తన శిబిరానికి వెళ్ళాననీ, తన ప్రియురాలు వేదవతి కోసం, తన కుమార్తె కోసం అంతటా వెతికాననీ, ఇళ్ళకు తిరుగుముఖం పడ్తున్నప్పుడు మారీచుడు తనకు వేదవతీ, నా కుమార్తె విషజ్వరంతో వ్యాధిగ్రస్తురాలై చనిపోయారని తెలియజేశాడనీ రావణుడు చెప్పాడు.

తాను భద్రుణ్ణి పిలిచి అడిగాననీ, అతడు వేదవతికి జరిగిన ప్రమాదం గురించీ, తన కూతురు గురించీ చెప్పాడనీ, తన కుమార్తెను

దయాళువైన ఒక దేవతల రాజు దత్తత చేసుకొన్నాడనీ, ఆమె దేవతల రాకుమారిలాగా పెరిగి పెద్దదవుతోందని, తాను అర్థం చేసుకొన్నాననీ రావణుడు వివరించాడు.

రావణుడు బందిఖానా నుండి విడుదలకావటానికి ఎంతోకాలం ముందే విద్యుజ్జిహ్వుడు కొందరు మంత్రులతో కలసి వెళ్ళిపోయాడనీ, లంకకు తిరిగి వస్తుండగా రావణుడి సైన్యం, దక్షిణ వింధ్య పర్వతాల పాదాల దగ్గర వానర రాజైన వాలిపై దండెత్తి ఘోరంగా ఓడిపోయిందనీ, అయితే వానర రాజు ఎవరో దారి దోపిడీగాళ్ళు తమపై దాడి చేశారనుకొని, మమ్మల్ని ఓడించానని చెప్పాడనీ, వానరులూ, అసురులూ మైత్రిని నిల్పుకుందామని, తమతో సంధి చేసుకొన్నారనీ భద్రుడు తెలియజేశాడు.

తాము కావేరీ నదీ ముఖం దగ్గరికి వస్తూన్న కొన్ని నౌకలను చూశామనీ, రావణుడూ, మారీచుడూ, తమని వదలి విద్యుజ్జిహ్వుడి వెంట వెళ్ళిన ప్రహస్తుడితో తిరిగి వచ్చారు. విద్యుజ్జిహ్వుడు లంక రాజ్యాధిపత్యాన్ని చేపట్టి, సముద్రపు దొంగల రాజుతో కలసి ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించినట్లూ, యిప్పుడు సముద్రపు దొంగల రాజు వరుణుడికీ చెడిందనీ, అతడు మహారాజు రావణుడు వచ్చి తన నౌకాదళాన్ని ఆయన చేతుల్లోకి తీసుకోవాలని అనుకొంటున్నాడని ప్రహస్తుడు చెప్పినట్లు భద్రుడు తెలియజేశాడు. అంతేకాక విద్యుజ్జిహ్వుని గురువైన యముడు అనే దారి దోపిడీ దొంగ కుంభకర్ణుడ్ని తన వశం చేసుకొన్న విషయం ప్రహస్తుడు తెలియజేశాడనీ, కుంభకర్ణుణ్ణి విడిపించటం కోసం, వాలి సాయాన్ని తీసుకొని రావణుడు యముడి దుర్గాన్ని స్వాధీనం చేసుకొన్నాడని భద్రుడు చెప్పాడు.

విద్యుజ్జిహ్వుడు లంకారాజ్యపు దక్షిణ ప్రాంతం తనకి యిమ్మనీ, మిగిలిన ప్రాంతమంతటినీ రావణుడే వుంచుకోమని కోరుతూ సంధి ప్రయత్నం చేశాడనీ, రావణుడు మొత్తం రాజ్యం అంతా తనకే కావాలని అన్నాడనీ, మండలి సభ జరిపి తనను పిలిచారనీ, తాను అక్కడికి వెళ్ళగా, మారీచుడు తనకు విద్యుజ్జిహ్వుడిని తుదముట్టించమని ఆజ్ఞాపించాడనీ, తాను ఆ ప్రకారం విద్యుజ్జిహ్వుడి శయనాగారంలోకి దొంగతనంగా ప్రవేశించి విద్యుజ్జిహ్వుడిని చంపివేశాననీ భద్రుడు చెప్పాడు. అనంతరం రావణుడు గొప్ప ఊరేగింపు జరిపి చక్రవర్తిగా రాజ్యాభిషేకం చేసుకొన్నాడని భద్రుడు తెలియజేశాడు.

తాను తాగిన మత్తులో ఒక అతి సౌందర్యవతి అయిన రాజమందిర సేవకురాలిని బలవంతంగా అనుభవించాననీ, ఫలితంగా తనకు నల్లటి, లావాటి అనాకారి పుత్రుడు, అతికాయుడు జన్మించాడని రావణుడు చెప్పాడు.

ఆ అనాకారి, అతికాయుడు పుట్టినది భద్రుడి భార్యకేననీ, రావణుడికి ఈ అక్రమ సంతానం పుట్టిన దాదాపు నెలరోజులకు రాణి మండోదరి, అందమైన మగశిశువును కన్నదనీ, అతడే మేఘనాధుడనీ భద్రుడు తెలిపాడు.

మండోదరికి అతికాయుడి గురించి తెలిసి, ఆమె తన సేవకురాలిపట్లా ఆమె కుమారుడిపట్ల విపరీతమయిన దయాదాక్షిణ్యాలు చూపించసాగిందనీ, మేఘనాధుడు అతికాయుడితో స్నేహం గరిపాడనీ, అతికాయుడు అనుక్షణం మేఘనాధునికి రక్షణగా వుంటున్నాడనీ రావణుడు చెప్పాడు.

తన కుమార్తె వివాహానికి జనకుడు ఏర్పాట్లు చేస్తున్నట్లు స్వయంవరం జరగబోతున్నట్టూ తెల్పిందనీ, తన కుమార్తె స్వయంవరం జరిగే సమయానికి తాను మిథిలకు చేరుకోవాలని బైలుదేరినట్లు రావణుడు తెలియజేశాడు.

తాము వెళ్ళేటప్పటికి, స్వయంవరం ప్రారంభమయిందనీ, శివుని విల్లు త్రియంబకాన్ని ఎత్తి నారి సారించినవారికి సీతనిచ్చి పెళ్ళి చేస్తానని జనకుడు ప్రకటించాడనీ, కొందరు విఫల ప్రయత్నం చేస్తున్న దానిని తాను చూస్తూండగా, తనను కూడా ప్రయత్నించమని జనకుని మంత్రులు కోరారనీ, అయితే ఆ విల్లుని ఎత్తి నా కుమార్తెనే నేను పెళ్ళాడతానా అని రావణుడు అనుకొంటూండగా రాముడు ముందుకు వచ్చి, ఆ విల్లును పైకెత్తి, నారిని సంధించాడనీ, అప్పుడు సీత ముందుకొచ్చి రాముడి మెడలో వరమాల వేసిందనీ, అనుకోకుండా సాధించిన విజయానికీ, సీత బహుమతిగా లభించినందుకూ రాముడి ముఖంలో తనకు గర్వం కన్పించిందనీ, అది తనను బాధపెట్టిందనీ రావణుడు చెప్పాడు.

లంకకు తిరిగి వచ్చిన తాను సీతను ఒక కంట కనిపెడుతున్నాననీ, రాముడి సవతి తల్లి తన కొడుకుని రాజు చెయ్యాలని కోరిందనీ, రాముడు రాజ్యాన్ని వదులుకొన్నాడని విని తాను నిర్ఘాంతపోయాననీ, రాముడు తమ్ముడు లక్ష్మణుడితో తన (రావణుని) అందమైన కుమార్తెతో అడవులకు వెళ్ళాడని తనకు తెల్పిందనీ, అప్పుడు తాను ఆ ముగ్గురినీ శత్రువుల నుంచి కాపాడుతూ వుండమనీ, ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందిస్తూ వుండమని భటులను ఆదేశించినట్టు రావణుడు తెలియజేశాడు.

తాను రకరకాల సంస్కరణలను ప్రవేశపెట్టి లంకను అభివృద్ధి చేశాననీ, కానీ మనస్సులో తనకు ఎప్పుడూ సీత గురించిన ఆలోచనలతో ఆందోళనగా వుండేదనీ, ఒకనాడు శూర్పణఖ పరిగెత్తుకొంటూ తన రాజసభలోకి వచ్చిందనీ రావణుడు తెలియజేశాడు.

అగస్త్యుడు అనే మహాముని వెంట అతని అనుచరులైన ఒక బ్రాహ్మణ సమూహం అసుర రాజ్యానికి శరణు కోరి వచ్చారనీ, రావణుడు రాజుగా వారికి ఆశ్రయం యిచ్చాడనీ, బ్రాహ్మలు నెమ్మది నెమ్మదిగా తమ సామ్రాజ్యంలోకి ప్రవేశించి, చిన్న ఊళ్ళలోనూ నగరాల్లోనూ

తమకంటూ స్థిరనివాసాలు ఒక సమూహంగా ఏర్పాటుచేసుకొన్నారనీ, ఏం జరిగిందో తాము గ్రహించేలోపలే, ప్రభుత్వోద్యోగాలలో ముఖ్య హోదా చేజిక్కించుకొన్నారనీ, ఆలయాలను కైవసం చేసుకొన్నారనీ, ఆ తర్వాత చాలా సమర్ధవంతంగా మిగతావారిని ముఖ్యమైన పదవుల్లోంచి బయటకు గెంటేశారనీ భద్రుడు తెలియజేశాడు.

అడవిలోని తిరుగుబోతులెవరి చేతలోనో శూర్పణఖ అవమానానికి గురైందనీ, అమె స్థనాలూ, ముక్కూ కోసి ఆమెను బలాత్కరించిన ఆ పురుషులు దేవతలు అన్న వదంతులు పుట్టాయనీ, తన చెల్లికి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకొనేందుకు రావణుడు వాళ్ళమీదకి పెద్దెత్తున దండెత్తి వెళ్ళబోతున్నాడని ప్రజలు చెప్పుకోవటం తాను విన్నాననీ భద్రుడు తెలియజేశాడు.

శూర్పణఖ తనకు జరిగిన అవమానం గురించి రాజసభలో చెప్పిందనీ, అందుకు ప్రతీకరం తీర్చుకోవాలనుకొన్నాడనీ, అంతేకాక ఒక స్త్రీ ముక్కూ, చెవులూ కోసిన పురుషులతో తన కూతుర్ని వదలటం తనకు యిష్టం లేదనీ, అందుకే తాను సీతను ఎత్తుకువచ్చాననీ, అయితే యీ ప్రయత్నంలో మారీచుడు దారుణ హత్యకు గురయ్యాడనీ రావణుడు వివరించాడు.

నరవానరుడొకడు తన రాజభవన ఉద్యానవనంలోకి జొరబడి, పట్టుకోబోయిన ఒక భటుడ్ని చంపి, ఇద్దరు ముగ్గురిని గాయపరచి, చెట్లచాటున మాయమయ్యాడనీ తనకు తన భటులు చెప్పారనీ, మేఘనాధుడు అతడ్ని పట్టుకోవటానికి వెళ్ళినట్లు తనకు తెలియజేశారనీ రావణుడు చెప్పాడు.

మేఘనాధుడు ఒక మహాబలశాలి అయిన యోధుడిలా వున్న నరవానరుణ్ణి బంధించి తన సభలోకి తీసుకువచ్చాడనీ, ఆ నరవానరుడు హనుమంతుడనీ, అతడు తాను రాజదూతగా వచ్చానని చెప్పాడనీ, అయినా రాజదూత అయితే రహస్యంగా రాడుగదా, నీవు గూఢచారివేనని నిరూపించామనీ, పైపెచ్చు అతడి ప్రభువు రాముడు, ఇద్దరు యోధులు ద్వంద్వ యుద్ధం చేస్తూ వున్నపుడు, చెట్టు వెనకాల నక్కి బాణం వేసి ఆపదని ఎదురుచూడని ఒక యోధుడిని వాలిని రాజధర్మ విరుద్ధంగా చంపిన విషయం అతనికి గుర్తుచేసి, అతడికి తోకపై వాతపెట్టి, అతడి తోకకి నిప్పు పెట్టి కాల్చేయమని తాను ఆజ్ఞాపించాననీ, అతడు తన కట్టు త్రాళ్ళు తెంచుకొని, రాజసభకు నిప్పును అంటించాడనీ, అదేవిధంగా రాజమందిరంకు నిప్పుపెట్టి అంటించాడనీ, ఆ మంటలో తన రెండవ కుమారుడు, ఎనిమిదేళ్ళవాడయిన అక్షయుడు సజీవంగా కాలిపోయాడనీ, ఇదంతా చూస్తున్న సీత "రావణా! దుర్మార్గుడైన అసురా! నీకీశాస్తి జరగవలసిందే. నువ్వూ నీవాళ్ళూ అయోధ్య రాముడి చేతుల్లో ఘోరమైన చావు చస్తారు" అంటూ క్రూరంగా నవ్వటం తనకు వినిపించిందనీ రావణుడు తెలియజేశాడు.

నరవానరులూ, దేవతలూ కలసి తమ మీద చేసిన యీ పాశవిక దాడికి ప్రతీకారం తీర్చుకొంటామని తాను ప్రతిజ్ఞ చేశాననీ, మండోదరి తనవద్దకు వచ్చి "సీతను ఆమె భర్త దగ్గర వదలొద్దు. అతను ఆమె పట్ల ఎలా వ్యవహరిస్తాడో మనకి తెలీదు. సీత మన కుమార్తె! ఆమెను మనం రక్షించాలి!" అని చెప్పిందని రావణుడు తెలియపరిచాడు.

అసురులకీ దేవతలకీ మధ్య జరగబోయే అంతిమ యుద్ధానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయనీ, రెండు నాగరికతలకు మధ్య జరిగే ఆఖరిపోరు అంటే ఒక జీవన విధానం, సమానత్వం, స్వేచ్ఛ అనేవాటికి ప్రాధాన్యం యిచ్చే అసుర సమాజంపై, వేరొక సంస్కృతి తమ మీద చెయ్యబోయే దాడిని ఎదుర్కొనేందుకు తనని తాను సిద్ధం చేసుకొంటోందనీ, చాలాకాలం క్రితమే ఇది రావణునికీ రాముడికీ మధ్య జరిగే యుద్ధం అన్నమాటని అధిగమించిందనీ భద్రుడు వివరించాడు.

అంతేకాక "ఇది ఎంత మాత్రం దయలేని కులవ్యవస్థమీదా, అస్పృశ్యత మీదా చెయ్యబోయే యుద్ధం; శూద్రులను అవమానించే బ్రాహ్మణీకానికి వ్యతిరేకంగా జరగబోయే యుద్ధం" అని కూడా భద్రుడు వివరించాడు.

తాను రాజసభలో "ఈ యుద్ధం దేవతల రాకుమారుడు రాముడి భార్య సీత కోసం జరగటల్లేదు. అలాగే పరాయి పురుషుడి భార్యమీద వ్యామోహంతో కాముకుడినైన నేను యీ యుద్ధం చేయబోవటంలేదు. అవమానింపబడ్డ నా సోదరి శూర్పణఖ కోసం ప్రతీకారం తీర్చుకొనేందుకు కూడా ఈ యుద్ధం జరగటల్లేదు.. సీత! నా కుమార్తె!" అని ప్రకటించానని రావణుడు తెలియజేశాడు.

యుద్ధంలో అసుర సేనాధిపతి వజ్రదంష్ట్రుడు మరణించాడనీ, బాణం దెబ్బకి లక్ష్మణుడు గాయపడ్డట్లుగా తనకు తెలిపారనీ రావణుడు చెప్పాడు.

వానరులు రాముణ్ణి విష్ణువు అవతారం అనుకొంటున్నారని తాను విన్నాననీ, రాముడి దైవత్వాన్ని చాలామంది అసుర పౌరులు కూడా నమ్మటం విని తాను నిర్ఘాంతపోయాననీ రావణుడు చెప్పాడు.

అంగదుడు మహారాణి మండోదరిని ఎత్తుకుపోయి, ఆమెపై అత్యాచారం జరిపాడనీ, ముందుగా మండోదరిని సీత అనుకొని ఎత్తుకుపోయాడనీ, ఆమె సీత కాదు అని తెలిశాక అంగదుడు మండోదరిపై అత్యాచారం జరిపాడనీ, యీ విషయం తెల్సినా రావణుడు తన భార్యను తాను ఎప్పటికీ తన భార్యగానే ఆమెకు స్థానం యిస్తానని అన్నాడనీ, ఆయనలోని మానవత్వము చాలా గొప్పదని భద్రుడు తెలియజేశాడు.

ఒక ఆదర్శ అసుర నాయకుడు ప్రహస్తుడు యుద్ధంలో మరణించాడనీ, అతడు ఎప్పుడూ కూడా న్యాయమార్గాన్ని విడవలేదనీ రావణుడు తెలియజేశాడు.

లంకిణి హనుమంతునితో ఒప్పందం చేసుకొందనీ, రాముడి పక్షాన చేరటం వలన లంకిణికి చాలా లాభం వుందనీ, ఆ రకంగా ఆమె తమకు నమ్మకద్రోహం చేసిందనీ రావణుడు చెప్పాడు.

మరణించారు అనుకొన్న రామ, లక్ష్మణుల ప్రాణాలు ఏదో అద్భుతమైన ప్రభావం కల వానరుల ఔషధి వల్ల నిలిచాయనీ, మేఘనాథుడూ, కుంభకర్ణుడూ శత్రువుల మీద దాడి ప్రారంభించారనీ, వానరులు పారిపోవటం మొదలెట్టారనీ, వానర రాకుమారుడు అంగదుడ్ని ఒక ఏనుగు తొండంతో ఎత్తి దూరంగా విసిరివేస్తే, అతడు గుర్రం ఎక్కి తన శిబిరానికి పారిపోయాడనీ, కుంభకర్ణుడు వానరసేనపై చెలరేగాడనీ, ఇంతలో ఒక బాణం వచ్చి కుంభకర్ణుడి మెడలో గుచ్చుకొందనీ, దానితో అతడు చనిపోయాడనీ, మేఘనాథుడు తప్పించుకొని వెళ్ళిపోయాడనీ భద్రుడు తెలియజేశాడు.

మండోదరికీ, తనకూ యుద్ధం విషయంలో వాగ్వివాదం జరిగిందనీ, అసంకల్పితంగా తాను సీత కూర్చొన్న అశోక వృక్షం దగ్గరకు వెళ్ళి "సీతా, నువ్వు నా కూతురివి నువ్వు లంకారాజ్యపు రాకుమారిగా ఇక్కడే వుండిపోగలవా? నీ తండ్రి దగ్గరే వుండిపోతావా? దీనికి నువ్వు ఒప్పుకొంటే నేను సంధి ప్రస్తావన పంపుతాను.... రాముడు నీకు భర్తగా వుండేందుకు తగడు. నువ్వు ఎప్పుడూ నీ తండ్రి దగ్గరే వుండిపో!" అని సీతతో చెప్పాననీ, అయితే ఆమె "నేను ఆయన్ని ప్రేమిస్తున్నాను, ఆయనను వివాహమాడిన భార్యను.... నా తండ్రి జనక మహారాజు. నా భర్త శ్రీరాముడు" అని చెప్పిందనీ రావణుడు చెప్పాడు.

ప్రార్ధనలో వున్న మేఘనాథుడునూ, అతనికి తోడుగా వున్న తన అక్రమ సంతానమైన అతికాయుడునీ లక్ష్మణుడు చంపాడనీ, దుర్గసంరక్షకుడైన జంబుమాలి, కోటద్వారాలు తెరచి, లక్ష్మణుడిని లోనికి పంపాడనీ తెలియటంతో తాను అతడ్ని ముక్కలు ముక్కలుగా నరికి చంపినట్లు రావణుడు తెలియజేశాడు.

పవిత్రుడిగా కనబడే విభీషణుని వంటివారు తనకు ద్రోహం చేశారనీ, ప్రభుత్వోద్యోగులు, లంకిణి లాంటి స్త్రీలు బహిరంగంగా రాజ్యంపట్లా, రాజుపట్లా తమకున్న ప్రేమా, ఆపేక్షలనూ ఎలుగెత్తి చాటుతూనే – తన వెనకాల గోతులు తవ్వారనీ, తాను ఎంతో ప్రేమగా చూసుకొన్న మధ్యతరగతి, ధనికవర్గం ఏమాత్రం సంకోచించకుండా ప్రతిపక్షంలో చేరిపోయారనీ, తనకు ఏమీ మిగలకుండా పోయిందనీ రావణుడు తెలియజేశాడు.

యుద్ధంలో విజయం సాధించినవారికే సమస్తం దక్కుతుందనీ అతనివైపే సత్యం ఉంది అని అందరూ భావించి జయించినవాడే సత్యసంధుడు అని అంటారనీ, విజేత గురించి కవులు కీర్తిగానం చేస్తారనీ, కాలం గడిచినకొద్దీ వాళ్ళ గురించి ప్రసిద్ధ గాధలు పెరిగిపోతాయనీ, విజేత సర్వగుణ సంపన్నుడవుతాడనీ, పురుషోత్తముడని కీర్తిస్తారనీ, ఒకవేళ ప్రస్తుత సామాజిక నీతినియమాల దృష్ట్యా విజేత చేసిన పనులను సమర్ధించలేని పరిస్థితి తలెత్తితే అతడ్ని దేవుడి స్థానానికి తీసుకెళ్ళిపోతారనీ, ఇక దేవుడు చేసే పనులను ఎవరు ప్రశ్నించగలరనీ, ఈ రకంగా తన రాజ్యం చాలామంది దేవుళ్ళని సృష్టించిందనీ రావణుడు వివరించాడు. చాలా నిస్పృహతో తాను యుద్ధభూమికి బైలుదేరాననీ, మండోదరి సీతను రాముడికి అప్పగించి సంధి చేసుకోమని తనను కోరినా, తాను యుద్ధం చేయటానికే పయనమయ్యాననీ, అయినా విభీషణుని ద్రోహంతో రాముడు తనను నేలకూల్చాడనీ రావణుడు తెలియజేశాడు.

రావణుడు అసురులకి ఆత్మగౌరవాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ కలిగించాడనీ, తమ ప్రాచీన సంస్కృతిపట్ల నమ్మకాన్నీ గౌరవాన్ని గర్వాన్నీ తమలో రగిలించాడనీ, తమను మనుషులుగా చూసేవారనీ, ఎంత నిరుపేదలయినప్పటికీ, ఆ పేదరికంలో కూడా తమను గౌరవించారనీ భద్రుడు తెలియజేశాడు.

కొద్దిక్షణాల్లో చనిపోబోయే రావణునితో తాను "మీరు మొదలుపెట్టిన పనిని నేను పూర్తిచేస్తాను ప్రభూ! విచారించకండి!. ప్రశాంతంగా తరలిపొండి. మన జాతి కోసం నేను బాధ్యతగా పనిచేస్తాను" అని చెప్పినట్లు భద్రుడు తెలియచేశాడు.

చనిపోయిన రావణుడి తలను ఒక కర్రకు గుచ్చి, దాన్ని అంగదుడు మోస్తూ పురవీధుల్లో ఊరేగించారనీ, అసురుల మహారాణిని ఒక దేవతల వితంతువుగా – ఆమె తలమీది శిరోజాలను పూర్తిగా తీసేసి, తెల్లటి చీరకట్టి రాముడి రధం వెనుక ఒక పల్లకిలో మండోదరిని మోసుకెళ్ళారనీ భద్రుడు తెలియజేశాడు.

కొన్ని యుగాలుగా ఈ భూభాగంలో నివసించిన అసురులు ప్రపంచానికి ఒక ఆశాజ్యోతిని వెలిగించి ఆదర్శంగా నిలిచారనీ, ఆ ఆశాజ్యోతి దాస్యమూ, కులమూ లేని ప్రపంచాన్ని సృష్టిస్తుందని, ఆ ప్రపంచాన్ని కలలు కనే గొప్ప ఆకాంక్ష వున్నవారెవరైనా సరే తమ భవితవ్యాన్ని తామే నిర్మించుకొంటారన్న సందేశాన్ని ప్రపంచమంతటికీ అందించారనీ, సరస్వతి, సింధూనది తీరాలలో తమ నగరాలు దేవతల ఆక్రమణలకు గురయినప్పుడే ఆ కలలు ధ్వంసమయినాయనీ, అయినప్పటికీ అవి మళ్ళీ బలిచక్రవర్తి, రావణుడు వంటి గొప్ప నాయకుల నోటిమాటల రూపంలో వెలువడ్డాయనీ భద్రుడు వివరించాడు.

రాముడు విభీషణుని అసుర మహారాజుగా ప్రకటించాడనీ, అప్పుడు విభీషణుడు లేచి "ప్రజలందరినీ నాలుగు కులాలుగా విభజించి ఒక్కొక్క కులానికీ ఒక్కొక్క వృత్తిని కేటాయించాడు. దేవుడి ముఖం నుంచి జన్మించిన బ్రాహ్మణులు, నాలుగు కులాలలోకీ ఉన్నతమైన కులానికి చెందుతారు. వాళ్ళు జ్ఞానాన్ని పంచుతారు. ఈ లోకంలో దేవుడి ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. ఇక వాళ్ళమాట విని వాళ్ళు

చెప్పినట్టు చెయ్యటం అందరికీ తప్పనిసరి అవుతుంది. దేవుడు భుజాల నుంచి జన్మించే క్షత్రియులు, బ్రాహ్మణుల సలహాని పాటిస్తూ, సమాజాన్ని పరిపాలిస్తారు. దేవుడి తొడల నుంచి జన్మించిన వైశ్యులు వర్తకం చేసుకొంటారు. దేవుడి పాదాల నుండి జన్మించిన శూద్రులు పనివాళ్ళుగా చిన్న స్థలాల యజమానులుగా, సామాన్య సైనికులుగా మిగతా మూడు కులాలవారికీ సేవలు చేస్తారు. మిగతావాళ్ళు అందరూ, పైన చెప్పిన వర్గాలలో ఇమడని జనం అస్పృశ్యులుగా సంఘం నుంచి బహిష్కరింప బడినవారిగా వుంటారు" అని ప్రకటించాడని భద్రుడు తెలియజేశాడు.

అంతేగాక రాముడి దైవత్వాన్ని అవిధేయులైన తన సోదరులు రావణుడూ, కుంభకర్ణుడూ గుర్తించలేదని, విభీషణుడు వాపోయినట్టుగా కూడా భద్రుడు చెప్పాడు.

కొందరు బ్రాహ్మణులు వేదిక మీదికి వచ్చేసరికి రాముడూ, లక్ష్మణుడూ, విభీషణుడూ, సీతా గౌరవంగా లేచి నిలబడ్డారనీ, వాళ్ళ కాళ్ళమీద పడి ఆశీర్వాదాలు తీసుకొన్నారనీ, కానీ సీత వాళ్ళ పాదాలు తాకబోతే, వాటిని వెనక్కు తీసుకొని ఆమెవైపు అసహ్యంతో చూశారనీ, బ్రాహ్మణులలో ఒకడు రాముడితో రహస్యంగా ఏదో అన్నాడనీ, రాముడు లక్ష్మణునితో మాట్లాడిన మరుక్షణం లక్ష్మణుడి ముఖం పాలిపోయిందనీ, అయినా అతడు సీత చేతిని పట్టుకొని వేదికమీద నుంచి క్రిందకు ఈడ్చి, వేదిక క్రిందికి నెట్టాడనీ, అవమానంతో రగిలిపోతూ, కోపమూ, కలవరమూ చుట్టుముట్టగా ఆమె అక్కడే నిలబడిపోయిందనీ, అప్పుడు విభీషణుడు ముందుకు వచ్చి "సీత రావణుడి చెరలో వుండినందున, ఆమెకు దోషం అంటిందనీ, అందువలన బ్రాహ్మణులు చిరకాలంగా దేవతలు పాటిస్తూ వస్తున్న పద్ధతిలోనే సీతాదేవి తన పవిత్రతని నిరూపించుకోవాలని నిర్దేశించారనీ" భద్రుడు తెలిపాడు.

అప్పుడు సీత ఎదిరిస్తూ, కళ్ళల్లోంచి అగ్నిజ్వాలలు కురిపిస్తూ, రాముడివైపు కళ్ళెర్రజేసి చూచిందనీ, ఆమె కళ్ళలోకి చూడలేక రాముడు ముఖం త్రిప్పుకొని, కృత్రిమమైన చిరునవ్వు ముఖం పెట్టాడనీ భద్రుడు తెలియజేశాడు.

రావణుడి చితి ప్రక్కనే విభీషణుడు మరొక చితి పేర్చమని ఆజ్ఞాపించాడనీ, ఆ చితి వద్దకు ప్రత్యేకంగా ఎంపిక చేసిన అసుర స్త్రీలు సీతను లాక్కొచ్చారనీ, సీతాదేవి అగ్నిప్రవేశం చేయబోతున్నా కూడా రాముడు 'చాలించండి! నాకు నా భార్యమీద నమ్మకముంది' అని అనలేదనీ, ఇంతలో వర్షం పడటం మొదలయిందనీ, సీత అగ్నిలోకి దూకిందనీ, కుంభవృష్టి కురవటంతో, చితి ఆరిపోయిందనీ, సీత జీవించే వుందనీ, ఆ రకంగా ఆమె పవిత్రురాలిగా నిరూపింపబడిందనీ భద్రుడు వివరించాడు.

తానూ, తన భార్యా మరో జంట అరసి – శివలు అక్కడి కులవ్యవస్థలో యిమడలేక లంక నుండి ఒక ఓడలో రహస్యంగా కాళీమాత నగరానికి, తమది రజకుల కులం అని చెప్పుకొని పారిపోయామనీ భద్రుడు తెలిపాడు.

అక్కడనుంచి తాము రాముడు రాజ్యం చేస్తున్న అయోధ్యకు వెళ్ళి రజకులుగా పనిచేసుకొంటున్నామనీ, అక్కడ కులవ్యవస్థ తక్కువ కులానికి చెందినవారిమీద అమానుషమైన, అవమానకరమైన పాశవిక ప్రవర్తన కనబరిచేది అనీ భద్రుడు తెలియజేశాడు.

అరసి ఒక మగశిశువును కన్నదనీ, వాడికి శంబూకుడు అని పేరు పెట్టాం అనీ, శంబూకుడు తెలివైనవాడనీ, రజకుల కులంలో పుట్టిన బాలుడికి ఎవరూ చదువు నేర్పరన్న నమ్మకంతో, తాను నదికి అవతలివైపు ఏకాకిలా, సన్యాసిలా నివసిస్తున్న ఒక గురువును శంబూకునకు కుదిర్చాననీ, ఆ సన్యాసి, యితర సన్యాసుల గుంపులతో దేవతల కులవ్యవస్థలో ఇమడలేక ఏకాంతవాసం ఏర్పాటుచేసుకొన్నాడనీ, ఆ సన్యాసి గతంలో అయోధ్య ఆస్థానంలో మంచి పదవిని చేబట్టినవాడనీ, రాముడితో జాబాలి దైవం, పునర్జన్మ, ఆత్మ లాంటివి ఏమీ లేవని వాదించటం, రాముడు జాబాలి చెప్పినదాన్ని తిరస్కరించటం ఆ సన్యాసి విన్నాడనీ, జాబాలి వలన ప్రభావితుడై ఆయన శిష్యునిగా మారిపోయి జాబాలితో పాటు స్వేచ్ఛగా తిరుగుతూ నగరవీధుల్లో కులవ్యవస్థ ఎంత పనికిమాలినదో అందరికీ చెప్పేవాడని, అందువలన జాబాలినీ, ఆయన శిష్యులనూ సరయూ నది ఆవలి తీరానికి బహిష్కరించారనీ, అప్పటినుంచీ జాబాలి, ఆయన శిష్యులూ కులాలని పట్టించుకోకుండా విద్య నేర్చుకోవాలని అనుకొన్నవారందరికీ విద్య నేర్పటమే పరమావధిగా జీవిస్తున్నారనీ భద్రుడు వివరంగా చెప్పాడు.

శంబూకుడు గురువు దగ్గర విద్య నేర్చుకొంటూనే, గేయాత్మకమైన కవిత్వాన్నీ పాటలూ పాడి ప్రజలను ఆకట్టుకొనేవాడనీ, మనుషుల మనసులో పేరుకొన్న మతం, కులం, సంప్రదాయం అనే కుళ్ళుని ఆ గేయాలు ఛేదించేవనీ, మనసు లోతుల్లో వున్న మంచితనాన్ని తట్టి లేపేవనీ భద్రుడు తెలియజేశాడు.

పద్నాలుగు సంవత్సరాల బాలుడైన శంబూకుడు వేదాలనీ, శాస్త్రాలన్నింటినీ ఔపోసన పట్టాడనీ, ఒకరోజున అతడు యధాప్రకారం రాజమార్గాన జనాన్ని కూడగట్టి పాటలు పాడుతూండగా మతాధికారులు అటుగా వచ్చి ఒక నీచ కులంలో పుట్టిన బాలుడి వల్ల రాజమార్గం అపవిత్రం అవటం భరించలేకపోయారనీ, కానీ ఆ బాలుడు ఎదురుతిరిగాడనీ, అందుకు మండిపడిన ప్రధాన ఆచార్యుడు ఏవేవో వేదమంత్రాలను చదివి అతడి నోరు మూయించబోయాడనీ, కానీ ఆ కుర్రవాడు వాటికి సరైన అర్థం చెప్పటమేకాక తాను కొత్తగా కనుక్కొన్న అర్థం కూడా చెప్పటంతో అక్కడ గుమిగూడిన జనం ఆ బాలుడి మాటలకు హర్షధ్వానాలు చేశారనీ, శంబూకుడు అనర్గళంగా వేదాలలోంచి శ్లోకాలు వల్లిస్తూ వుండగా అక్కడికి రాముడు ఒక

రథంలో వచ్చి, క్రిందికి దిగి చూస్తూండగా, ప్రధాన మతాచార్యుడు "శంబూకుడు ఒక శూద్రుడు అనీ, అతడు వేదాలు చదువుతున్నాడని" ఫిర్యాదు చేశాడనీ, అతనిని శిక్షించమని కోరాడనీ దానితో రాముడు ఆ బాలుడైన శంబూకుడి తలని కత్తితో ఒక్క వేటులో నరికివేశాడనీ, రాముడు తాను అటువంటి పనిచేయవలసి వచ్చినందుకు సిగ్గుపడుతున్నట్లు అతను ముఖం చాటుచేసుకొన్నాడనీ భద్రుడు వివరంగా చెప్పాడు.

శంబూకుని మరణం తర్వాత అయోధ్యలో తమ జీవితం నరకప్రాయం అయిందనీ, తాను త్రాగుడుకు అలవాటు పడ్డాననీ, ఒకనాడు తాను బాగా త్రాగిన మత్తులో వుండగా తన భార్య తనను విసిగించటం మొదలుపెట్టడంతో, అందుకు ప్రతిగా ఆమె లంకలో వేశ్యలా ఎంతమంది విటులతో సంబంధం పెట్టుకొందో, రావణుడు ఆమెను ఎలా బలాత్కరించాడో తమ వాడలో అందరూ వినేటట్టు పెద్దగా అరచి, తాను రాముడిలా పాతివ్రత్యం కోల్పోయిన భార్యను ఏలుకోనని వాగాననీ, అది పూర్తిగా నిజం కాదనీ, అర్ధసత్యం అనీ భద్రుడు తెలియజేశాడు.

తన త్రాగిన వాగుడు రాజపురోహితులకు చేరిందనీ, వాళ్ళు సీత అపవిత్రురాలు అనే నిర్ధారణకు వచ్చి పాతివ్రత్యాన్ని నిరూపించుకొనేందుకు సీతకి జరిగిన అగ్నిపరీక్ష సరిపోదనీ, రాముడు తన మీద పడిన ఈ మచ్చకి తరుణోపాయం ఆలోచించాలని వారు రాముడితో చెప్పారనీ, అందుకే రాముడు గర్భవతి సీతను అడవులకు పంపివేశాడు అని భద్రుడు చెప్పాడు.

రాముడు అశ్వమేధయాగం సందర్భంగా అరణ్యంలో అతడి గుర్రాన్ని ఆపేసిన యిద్దరు బాలకులు, సీతకు జన్మించిన కవలలు అని తెల్సుకొన్న రాముడు, సీతను మళ్ళీ కలుసుకొని, తిరిగి తన భవనానికి తీసుకు వచ్చాడనీ, కానీ రాజసభలోని పండితులు వాల్మీకితో సీత ఒక పర్ణ కుటీరంలో జీవించిందన్న విషయాన్ని చెప్పి ఆమె పవిత్రత సందేహించ దగినదిగా ఎత్తిచూపి, మళ్ళీ సరయూ నది తీరాన సీతకి అగ్ని పరీక్ష సిద్ధం చేశారనీ, సీత ఎటువంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా అగ్నికి ప్రదక్షణం చేసి, అందరినీ ఆశ్చర్యపరుస్తూ నది వైపుకు పరిగెత్తిందనీ, వెంటనే కొండ అవతలివైపు మాయమైపోయిందనీ, సీత శరీరం దొరకలేదనీ సరయూనది బురదలో ఆమె కూరుకుపోయి వుంటుందని అందరూ అనుకొన్నారనీ భద్రుడు తెలియజేశాడు.

దానితో రాముడు పూర్తిగా కుంగిపోయి, పరిపాలన పట్టించుకోక పోవటంతో అతని పేరుతో భట్రాజులు పరిపాలింపసాగారనీ, ఘోర సంప్రదాయవాదులైన మతాధికారులు రాజ్యభారాన్ని తమ చేతుల్లోకి తీసుకొన్నారనీ, కుల నియమాలు మరింత కఠోరంగా తయారయి జనజీవనం అణచివేతకు గురయిందనీ భద్రుడు వివరించాడు.

తాను అయోధ్య నుండి కార్యవీర్యార్జునిడి కుమారుని పాలనలో వున్న రాజధాని అయిన హైహయి నగరానికి వెళ్ళి, అక్కడ కొంతకాలం వుండి, అక్కడ నుండి గోకర్ణ నగరం చేరుకొన్నాననీ, ఆ నగరంలో రావణుడి ఆదేశంతో మయుడు బ్రహ్మాండమైన శివాలయాన్ని నిర్మించాడనీ, గోకర్ణంలో వుండగా తన భార్య మాల చనిపోయిందనీ, అలావుండగా ఒకరోజు రాముడు లక్ష్మణుడికి మరణశిక్ష విధించాడనీ, మతాచార్యులే రాముడిని ఆ పనికి బలవంతపెట్టారని విన్నాననీ, ఎందుకంటే లక్ష్మణుడు మతాచార్యులు నెలకొల్పిన కఠోర నియమాల వల్ల ప్రజలు అష్టకష్టాలు పడుతూండటం గమనించి, ఆ నియమాలను ప్రశ్నించటంతో మతాధికారులు లక్ష్మణుడిపై రాముడితో ఆ రకంగా పగ తీర్చుకొన్నారని తాను విన్నాననీ భద్రుడు తెలియజేశాడు.

తాను పయస్వినీ నదిని దాటుతూండగా ఒక సాధువు చెప్పగా రాముడు మరణించినట్లు తాను విన్నానని భద్రుడు తెలియజేశాడు. ఆ రకంగా రాముడి జీవితం అప్రతిష్టాకరంగా ముగిసిపోయిందని భద్రుడు చెప్పాడు.

తర్వాతి కాలంలో అసురుల ప్రతిఘటనని పరశురాముడు విజయవంతంగా అణచివేశాడనీ, అతడు ఎంతో కఠోరమైన కులవ్యవస్థను స్థాపించాడనీ భద్రుడు తెలియజేశాడు.

★ ★ ★ ★

రావణుడు, భద్రుడుల చేత కథ చెప్పించిన రూపంలో పరాజితుడైన రావణుడూ, అతడి ప్రజల కథను ఆనంద్ నీలకంతన్ ఎంతో ప్రతిభావంతంగా 'అసురుడు' పుస్తకంలో చిత్రీకరించారు.

ఆర్యులు స్థాపించిన 'సనాతనధర్మం' కన్నా అంతకముందు కాలంలో భారతదేశంలో పరిఢవిల్లిన 'ప్రాచీన' ధర్మమే ఉత్తమమైన ధర్మమనీ, అదే భారతీయ ప్రజానీకం అనుసరించాల్సిన ధర్మం అంటూ, యీ ప్రత్యామ్నాయ పరాజితుల కల్పనలో చర్చ చేశారు. వాల్మీకీ, తదనంతరపు ఆర్య ధర్మ సమర్ధకుల కట్టుకథలనీ, అపసవ్యవాదనలనీ అసంబద్ధ ధర్మ సూత్రీకరణలనూ తన హేతుబద్ధ, తార్కిక, చారిత్రక పరిశీలన ఆధారంగా తుత్తునీయలు చేశారు.

ఒక మంచి విమర్శనాయుత కథనం ఎలా వుండాలో తెలుసుకోవాలంటే, ప్రత్యామ్నాయ పరిశీలనా దృష్టి అలవర్చుకోవాలంటే, ఈ 'అసురుడు' తప్పక చదవాల్సిందే!

ఈ సందర్భంగా ఆర్. శాంతసుందరిగారి తెలుగు అనువాదం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇది చదివిన మనకు అనువాదం అనిపించదు. నేరుగా తెలుగులోనే రచించిన పుస్తకంగా మనం భావిస్తాం! తెలుగుభాషపై పట్టు కలిగివుండటం వల్లనే యీ అనువాదం ఇంత చక్కగా వుందని అర్ధమవుతుంది. అనువాదకులు యీ పుస్తకాన్ని చదవటం ద్వారా తమ అనువాద నైపుణ్యాన్ని మరింతగా పెంచుకొనటం నిస్సందేహం!

వ్యంగ్యం

# భారతీయ ఓటరును కావడం నాకు గర్వకారణం

శంకరం

**నేనొక** భారతీయ ఓటరును. ప్రజాస్వామ్యం నా మతం. మా మతంలో ఒకే ఒక్క పండగ చేసుకుంటాం. దాని పేరు 'ఎన్నికలు'. అయితే సంవత్సరమంతా ఈ పండగను జరుపుకుంటాం. ఓటు వేయుటం అనే తంతు ద్వారా ఈ పండగను జరుపుకుంటాం. అందువల్ల ప్రతి దరఖాస్తు ఫారమ్‌లని మతపరమైన గుర్తింపు అన్న కాలమ్‌లో 'ఓటరు' అని రాస్తూ ఉంటాను. ఓటు వేసినపుడు ఏం జరుగుతుంది? నీ వేలికి పవిత్రమైన ఇంకును బొట్టుగా పెడతారు, నీకు బాలట్ ఇస్తారు, నీవు ఓటు వేస్తావు.

చాలా మతాలకు ఉన్నట్లే మా మతానికి కూడా ఒక దేవుడు ఉన్నాడు. ఆయనను ఎన్నికల కమీషన్ అని పిలుస్తాం. మా దైవం మూడు అవతారాల్లో ఉంటాడు. ఒక అవతారం ప్రధాన దైవం. మిగిలిన అవతారాలు రెండూ ఆయనకు కుడి ఎడమల ఉంటూ ఆయన చేసే ధర్మకార్యాలు (ఎన్నికలు)లో ఆయనకు చేదోడు వాదోడుగా ఉంటారు. నాకు శుభం జరగాలనేదే వారి తాపత్రయమంతా. వారు నా జీవితానికి అర్థాన్ని, పరమార్థాన్నీ కల్పిస్తారు.

ఇటీవలే పదవీ విరమణ చేసిన ఒక దేవుడు మాల్టాలో స్థిరనివాసం ఏర్పరచుకున్నందున ఆయన మీది భక్తితో ఉదయం లేచిన వెంటనే మాల్టీస్ టీ తాగుతాను. వెంటనే నా ఫోన్ తీసుకుని నా తాజా చిరునామా, గుర్తింపులను చెక్ చేసుకుంటాను. నా ఫోన్ మోగింది అనుకుందాం. దానిలో వచ్చిన సందేశం ప్రకారం నేను అమరావతికి చెందిన గాలి చందు అన్నమాట. అది చూడగానే నేనొక ఆటో మాట్లాడుకొని ఓటు వేయడానికి అమరావతి వెళ్తాను. నేను చేసే పని ఎలా ఉంటుందంటే ఓలా, ఉబర్ ఆపరేటర్లు మరియు స్విగ్గీ, జొమాటో వర్కర్లు పనిచేసే మాదిరిగానే ఉంటుంది. కాకపోతే రెండు తేడాలు : వాళ్ళు డబ్బుల కోసం చేస్తారు, నేను మా దేవునిపై భక్తితో చేస్తాను. వాళ్ళు ఏదో ఒక పట్టణ పరిధిలో చేస్తారు, నేను దేశవ్యాప్తంగా ఓట్లను చేరవేస్తాను.

అమరావతిలో ఓటు వేసిన తర్వాత, పులివెందుల వెళ్ళి కాటమరెడ్డి జగన్నాథంగా ఓటు వేయమని ఆదేశం వస్తే, ఆ పని చేస్తాను. ముందు నా వేలికి అద్దిన పవిత్రమైన సిరాను తొలగించుకుంటాను. తర్వాత పులివెందుల వెళ్ళడానికి విమానంలో టికెట్ తీసుకొని బయల్దేరుతాను. త్రోవలో నా కొత్త ఎపిక్ కార్డు (ప్రసాదం వంటిది)ను సిద్ధం చేసుకుంటాను.

బుర్ర (ఐక్యూ) తక్కువవాళ్ళు నువ్వు అమరావతి గాలి చందూవా లేక కాటమరెడ్డి జగన్నాధానివా అంటూ పిచ్చి పిచ్చి ప్రశ్నలు వేస్తారు. కొన్ని మతాలలోని దేవుళ్ళకు పలు అవతారాలుంటాయి. అయితే మా మతంలో దేవుడు మూడు అవతారాలుగా ఉంటాడని చెప్పాను కదా కానీ ఆయన అనుచరులు చెప్పలేనన్ని రూపాలలో (అవతారాల్లో) ఉంటారు. వచ్చేవారం నేను రాహుల్‌గాంధీ అవతారంలో రాయ్‌బరేలీ రోటరీ క్లబ్ ఎన్నికల్లో ఓటు వేస్తాను.

నేను వేరే మతంలోకి మారకపోవడానికి ఒక కారణముంది. మా దేవుడు ఆయనకు గల అద్భుత శక్తులలో కొన్నిటిని నాకు ధారపోస్తాడు. అర్థంకాలేదు కదూ! ఒకేసారి అంటే ఒకే సమయంలో నేను నాలుగు వేర్వేరు ప్రదేశాల్లో ఉండగలను, ఉన్నాను కూడా. ఒకసారి, కిందటి సం॥ము మా జాతి అంతా చేసుకునే ఉత్సవంలో నేను ఒకే సమయంలో ఆరు వేర్వేరు ప్రదేశాల్లో ఉన్నాను!

అంతేకాదు నేను నా రూపాన్ని కూడా మార్చుకోగలను. నా శరీరాన్ని బల్లపురుగు పరిమాణానికి కుదించుకొని, నాలాంటివాళ్ళం 180 మందిమి ఒకే చిరునామాలో ఉండగలం. ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఒకే గదిలో ఉండగలం. ఒక్కోసారి మీకు అనిపించవచ్చు నాకంటూ ఒక చిరునామా ఏదీ లేదని. చిరునామా లేదంటే నాకు ఇల్లు లేదని కాదు. నేను మాట్లాడుతున్నకొద్దీ నాకున్న చిత్ర విచిత్రాలైన శక్తులన్నీ (మా దేవుడు ప్రసాదించినవే అనుకోండి) బయటపడుతుంటాయి. నేను నా రూపాన్ని ఎప్పటికప్పుడు మార్చుకోగలను. ఒకసారి కండలు తిరిగిన బాలీవుడ్ కథానాయకుడు సల్మాన్‌ఖాన్‌లా ఉంటాను. వెనువెంటనే టైటానిక్ సినిమాలో కథ చెప్పే ముసలి హీరోయిన్‌లా 124 ఏళ్ళ అమ్మమ్మలా కనిపిస్తాను. గాభరా పడకండి – అది మాయ (నా అవతారాల్లో బాగా పేరు తెచ్చుకున్నది). దయచేసి నాకు ఒక దుప్పటి కప్పండి, బాగా చలివేస్తుంది. ఇప్పుడు నేను ఒక ఎడ్లబండిలో ఓటు వేయడానికి వెళ్తున్నాను.

మానవులు భలే చిత్రంగా ఆలోచిస్తూ ఉంటారు, అమాయకులైతే మరీనూ. అదేంటంటే ఎవరైనా ఒక వ్యక్తి పునర్జన్మ పొందితే మొదటి

జన్మలోని వ్యక్తి వలె ఉండదు అని. అదే మా మతంలో అయితే అలా వేరే ఆకారంలో ఉండాల్సిన అవసరంలేదు. ఒక ఓటరు డజను వేర్వేరు అవతారాల్లో, అన్నీ ఒకే మాదిరిగా ఉంటూ అందరూ దగ్గర దగ్గరగానే, కేవలం 500 మీటర్ల దూరంలో (ఒకరికొకరు) నివసిస్తూ ఉంటారు. అదే ప్రజాస్వామ్యం యొక్క దివ్య స్వరూపం. అందుకే మేమంతా ఎన్నికల కమీషన్‌ను ఆరాధిస్తాం.

ఇదిగో చూడండి, మీరు ఒకేసారి ఆంధ్రప్రదేశ్‌లోని బ్రహ్మానందంలా, బొంబాయిలోని శిల్పాశెట్టిలా ఎలా కనిపించగలుగుతున్నారు? అంటూ తెలివితక్కువ ప్రశ్నలు వేస్తుంటారు కొందరు పనీపాటూ లేని మన జనం. వాళ్ళకేం కావాలంటే, నా ఒంటిమీదున్న బొచ్చు అంతా ఎలా పోయిందీ, నా రంగు ఎలా మారిపోయిందీ, అకస్మాత్తుగా నేను 40 కిలోల బరువు ఎలా తగ్గిపోయాను; తిరిగి నా బొచ్చు, నా అసలు రంగూ, రూపూ, బరువూ నాకు ఎలా వచ్చాయి? ఇదంతా కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే ఎలా జరిగిపోయిందో తెలుసుకోవాలని వాళ్ళ కుతూహలం. పాపం! వాళ్ళని మూర్ఖులుగా చిత్రీకరించకండి. నాకు తెలిసి వాళ్ళెవ్వరూ ఎల్‌కేజీలో సామాజిక మానవశాస్త్రం చదివి ఉండరు. చివరిసారిగా ఈ సందిగ్ధతను స్పష్టం చేస్తాను, వినండి. మామూలు మనుషులకు గుర్తింపు అనేది రెండు విధాలుగా ఉంటుంది. శాఖాహారి లేదా మాంసాహారి; దేశభక్తుడు లేక దేశద్రోహి. కానీ నా వంటి ఓటర్లకు గుర్తింపు ఒక వర్ణమిశ్రమంలా ఉంటుంది. నేను ఎవరిలా కావాలనుకుంటే వాళ్ళలా, ఎక్కడ అవసరమనుకుంటే అక్కడ, ఎప్పుడు అవసరపడితే అప్పుడు ప్రత్యక్షం కాగలను. మీరు నిజం చెప్పండి. ఇంతకంటే స్వేచ్ఛాయుత జీవనాన్ని ఎక్కడైనా, ఎప్పుడైనా చూడగలరా?

కానీ ఈ మధ్య మా దేవుడికి ఊర్ధ్వలోకం నుండి ఏవో ఆదేశాలు వస్తున్నాయట. దేశంలో మాలో కొంతమంది ఓటర్ల అవసరం లేదనుకుంటూ మమ్మల్ని కాగితాలపై చంపేస్తున్నారు. కొంతమందిని ఈ దేశం నుండి వేరే దేశాలకు పంపించేస్తున్నారు. ఇదంతా మా దేవుడి కనుసన్నల్లోనే జరుగుతోంది. బహుశా ఈ విషయంలో ఆయన కూడా ఆశక్తుడేమో! ఆయనకి ఆదేశాలిస్తున్నవారు ఇతనికంటే గొప్ప దైవాంశ సంభూతులేమో!

సరేలెండి, అన్నీ మన చేతుల్లో ఉండవు కదా. ఏమైతేనేం ఈరోజు కేరళ నుండి జోసెఫ్ సిద్ధీగా నా చివరిరోజు. ఈ రాత్రికి నేను ఈ అవతారాన్ని ఉపసంహరించుకోవాలి – నా మరణానికి కారణాన్ని నేరుగా మా దేవుడి నుండే తెలుసుకొండి. కానీ బాంద్రా వెస్ట్‌లో నివసించే ఐశ్వర్యారాయ్‌గా ఎత్తబోతున్న నా కొత్త అవతారాన్ని తలచుకుంటే నాకు రోమాంచితమవుతుంది!!

**– 'ది హిందూ' 24 ఆగస్టు 2025 సౌజన్యంతో ❖**

## ఉత్తరాలు

*గుడ్ ఈవినింగ్ మై డియర్ టీం మెంబర్స్!*

ఈ రోజు పోస్టు ద్వారా ఒకేసారి అనేక పత్రికలు అందాయి. ఈ సారి విశేషం ఏమంటే అన్ని పత్రికలు మల్లె పూల వంటి తెల్ల పేపర్ పై ముద్రణ. ముఖ చిత్రాలు కూడా చాలా చక్కగా మంచి ఆర్టు పేపర్ పై ముద్రించారు. 'ప్రజాసాహితి' పత్రిక పట్టుకుంటే విడవబుద్ది కాలేదు. ఆనందన్ నీలకంఠన్ రాసిన "అసురుడు "అనే (తెలుగు అనువాదం) శాంత సుందరి) నవలపై జి. వి. భద్రం రాసిన పరిచయ సమీక్ష అనేక విషయాల సంశోధన. రావణుడి తరపునుండి సాగిన ఈ నవలలో ఎన్ని కొత్త కోణాలో ఎత్తి చూపెట్టారు. అంగలకుర్తి విద్యాసాగర్ ఐఏస్ గారు నిర్మలానంద గారి గురించిన జ్ఞాపకాలు, విశేషాలు ఆసక్తికరం. హైదరాబాద్‌లో మాయింటి సమీపంలోనే ఉండిన నిర్మలానంద పలకరింపులతో సరిపెట్టి క్షణం ఆగకుండా పనిమీద వేళ్లేవారు. మా సామాజికవర్గం గురించి సానుకూలంగా కొందరిని గుర్తుచేసేవారు. 'ప్రజాసాహితి'లో ఈసారి ప్రతి వ్యాసం ప్రత్యేక వ్యాసమే! యూట్యూబ్లో ఏది వెతికితే ఇక అదే పనిగా అలాంటివే రావడంలో ఆర్టిఫిషియల్ ఇంటలెజెన్స్ ఎలా పనిచేస్తున్నదో చదివి ఆశ్చర్య పోయాను. 'ప్రజాసాహితి' చక్కని సంచికలో కథలు లేని కొరత కనిపించింది. కథకులను అడిగి ఒత్తిడి చేసి రాయించుకొని వేసేవారు పూర్వం. ఇపుడు కూడ ఆ పని చేయడం అవసరమనిపించింది.

**- బి. ఎస్. రాములు**

*సంపాదకవర్గానికి,*

మన పత్రికలో వచ్చిన ప్రభుత్వ చట్టబద్ధ ఆస్తులను ప్రైవేటు సంస్థల వ్యాపారానికి అప్పగించటమే P.P.P. అనే వ్యాసాన్ని చాలా బాగా రాశారు. పత్రికలో వచ్చిన అన్ని వ్యాసాలు, కథలు బాగున్నాయి.

**- నరేష్, టాలీవుడ్ ఫిల్మ్ స్క్రిప్ట్ రైటర్**

# పెళ్ళిచూపుల చిత్రహింసను చిత్రించిన

# 'స్థల్' (2023)

బాలాజీ (కోల్‌కతా)

**అది** మహారాష్ట్రలోని ఓ గ్రామం. ఆ ఇంట్లో పెళ్ళిచూపులు జరుగుతున్నాయి. ఆడపిల్ల తరుపు వారు పెళ్ళి కొడుకును చూట్టానికి వచ్చారు. పెళ్ళి కూతురు తన స్నేహితురాళ్లతో సహా ఠీవిగా కూర్చుని ఉంది. ముసలమ్మలూ, నడి వయస్కులూ – అక్కడ అందరూ ఆడవారే కూర్చుని ఉన్నారు. పెళ్ళి కొడుకు ఒక పళ్లెంలో నీళ్ల గ్లాసులతో అక్కడికి వచ్చాడు. నేల చూపులు చూస్తూ అందరికీ నీళ్లందించాడు. ఆ తర్వాత మధ్యలో వేసిన స్టూలు (ఎత్తుపీట)పై తల దించుకుని కూర్చున్నాడు. పెళ్ళి కావాల్సిన కుర్రాడికి ఆ మాత్రం వినయం ఉండాలి. పెళ్ళి కూతురూ, ఆమె స్నేహితులూ అతడ్ని పై నుంచి క్రింది దాకా చూశారు. ఇక ఇంటర్వ్యూ మొదలు పెట్టారు.




పేరు? – వికాస్ గార్గాటే.
పూర్తి పేరు? – వికాస్ మనోహర్‌రావు గార్గాటే.
అమ్మ గారి గోత్రం? – చెప్పాడు.
అమ్మ గారి ఊరు? – అదీ చెప్పాడు.
పుట్టిన తేదీ? – 15 ఆగష్టు, 1947. టెన్షన్‌లో పొరపాటుగా చెప్పాడు.
ఫార్టీ సెవెనా? – కాదు కాదు, 15 ఆగష్టు, 1995.

వీడేదో పుట్టినరోజే జెండా ఎత్తేసేలా ఉన్నాడు – అందరూ గొల్లున నవ్వారు. పెళ్ళి కొడుక్కి తలకొట్టేసినట్టుంది. అయినా చేసేదేం లేదు.

నీ ఎత్తెంత? – 5 పూట్ల 6 ఇంచీలు.

ఇంతలో 'ఆరైంది, లేవవే' అంటూ అమ్మ నిద్రలేపింది. ఇదంతా కలేనని సవితకు అర్థమైంది. కలలోనే ఇలా రోల్ రివర్సల్ సాధ్యం. వాస్తవంలో అసంభవం. పెళ్ళిచూపుల్లో ఆడపిల్లలు సంతలోని వస్తువులా కూర్చోవడం సహజం, అన్యథా అసహజం అని మన మదిలో బలంగా నాటుకుని ఉంది కనుకనే ఒకటో దృశ్యం మనకు హాస్యంలా అనిపించింది.

అసలు మనకు కలలెందుకు వస్తాయ్? – వాస్తవంలో పరిష్కృతం కాని భావోద్వేగాలకూ, సమస్యలకూ సమాధానాలు చూపడానికే!

డోంగర్‌గావ్ గ్రామంలో డిగ్రీ చదువుతున్న అమ్మాయి సవితా వాంద్రే! పెద్ద అందగత్తె కాదు. ఎత్తు కూడా తక్కువే. ఆమెకు పెళ్ళిచూపుల మీద పెళ్ళిచూపులు జరుగుతున్నాయి కానీ ఎవరికీ ఆమె నచ్చడం లేదు. సవిత స్నేహితురాళ్లు ఒక్కొక్కరికీ పెళ్ళిళ్ళు ఐపోతున్నాయి. అందుకే సవిత తండ్రికి ఒకటే టెన్షన్. ఆయన ఓ పేద పత్తి రైతు. మహారాష్ట్రలో పత్తిరైతుల పరిస్థితి తెలిసిందే. ఆయన ఇంట్లో ఒకవైపు సరైన మార్కెట్ ధర దొరక్క అమ్మకం కాని పత్తి బస్తాలు పడున్నాయి. మరోవైపు పెళ్ళి కాని కూతురు పడుంది.

సవితకు మాత్రం పెళ్ళిపై ఆసక్తి లేదు. చదువుకోవాలి, ఉద్యోగం చేయాలి. మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతోంది. స్నేహితురాళ్లతో కలిసి కాలేజీకి పోవడమన్నా, ఇంటికొచ్చి చదువుకోవడమన్నా ఆమెకిష్టం. చదువులో ముందుండే ఆమె మనసుకు తీవ్రంగా నొప్పించే పని – ముక్కూ మొహం తెలీని పెళ్ళి పెద్దల ముందు తల వంచి కూర్చోవడం, వారడిగిన అడ్డమైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం, చివరికి రిజెక్టు కావడం!

చూపులూ, పెళ్ళి చూపులూ, పెళ్ళిళ్ళూ మన సినిమాల్లో వందల కోట్ల వ్యాపార వస్తువులు. 'హమ్ ఆప్కే హై కౌన్', 'హమ్ సాథ్ సాథ్ హై', 'వివాహ్' – ఇలా చాలా ఉదాహరణలున్నాయి. వీటిలో చూపేవన్నీ ఆర్థిక సమస్యలు లేని అగ్రవర్ణ పెద్దింటి వారి వివాహాలు. ఇతివృత్తాలన్నీ ఒక్కలానే ఉంటాయి. పెళ్ళే పరమార్థమనుకునే పెళ్ళి కూతురు కాబోయే వరుడ్ని ఓర కంట చూస్తుంది. అమ్మలక్కలు ఆమెతో హాస్యాలాడతారు. నిశ్చితార్థం నుండి శోభనం వరకు ఒక్కో తంతు ఒక్కో రకం ఆటపాటలతో కనువిందు చేస్తుంది. కానీ దేశంలోని సగటు ఆడపిల్ల పెళ్ళి అంత సుందరంగా జరగదు.

పురుషాధిక్య సమాజంలో పెళ్ళి చూపుల తతంగం ఆడపిల్లలకు శతవిధాలా అవమానించే ఆచారమని చెబుతుంది 'స్థల్' అనే మరాఠీ సినిమా. మరాఠీ బాషలో 'స్థల్' అంటే 'పెళ్లి సంబంధం'. ఈ సినిమా దర్శకుడు జయంత్ దిగంబర్ సోమాల్కర్. ఈ సినిమా తొలి ప్రదర్శన టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జరిగింది. ఆ తర్వాత మాస్కో, కైరో, చికాగో, డర్బన్, చెక్ రిపబ్లిక్, జాఫ్నా, లండన్, న్యూయార్క్ తదితర దేశ, విదేశాల చలనచిత్రోత్సవాల్లో పాల్గొని చాలా అవార్డులు కూడా సంపాదించుకొంది ఈ సినిమా.

‘ది గ్రేట్ ఇండియన్ కిచెన్’ అనే మళయాల సినిమాలో వంట పనిని పదే పదే చూపిస్తారు. వంట పని ఒక స్త్రీకి ఎంత మోనోటనీగా ఉంటుందో ప్రేక్షకులే స్వయంగా అనుభవించే విధంగా ఈ సినిమా చిత్రీకరణ ఉంటుంది. ‘స్థల్’ సినిమాలో పెళ్ళిచూపుల తంతు పదే పదే పునరావృతమౌతూ వుంటుంది. ఎంతలా అంటే వీక్షకులకు కంఠతా ఐపోయేటంత! సవిత అప్పటికే అరడజను పెళ్ళి ‘చూపుల్ని’ ఎదుర్కుంది. ఈ తతంగమంతా పురుషుల పర్యవేక్షణలోనే జరుగుతుంది. ఆడవాళ్లు టీ, టిఫిన్లు సప్లై చేసేవారిగా వెనక గదిలో ఉంటారు. మొదట మగపిల్లాడితో సహా ఓ నలుగురు పెద్దలు ఆడపిల్ల ఇంటిని వెదుక్కుంటూ వస్తారు. వచ్చినవారందరికీ కాళ్లూ చేతులూ కడుక్కోడానికి బకెట్లో నీళ్లూ, కొత్త సబ్బూ, చేతులు తుడుచుకోడానికి కొత్త టవల్ రెడీగా ఉంటాయి. ఆ తర్వాత టిఫిన్లూ, టీలూ, వక్కపొడులూ అయిపోయాక ఆడపిల్లను పిలుస్తారు. గది మధ్యలో వేసిన స్టూలుపై కూర్చోమంటారు. ఎదురుగా కుర్చీల్లో సుఖాసీనులైన అనామకుల ముందు ఆ ఆడపిల్ల బ్యాక్ రెస్ట్ గానీ, హ్యాండ్ రెస్ట్ గానీ లేని స్టూలుపై స్ట్రెయిట్‌గా కూర్చుంటుంది. సోషియాలజీ చదువుతున్న పిల్ల అలా తలదించుకుని కూర్చోవడం చాలా బాధనిపిస్తుంది. ఇక పోలీసు ఇంటరాగేషన్‌లా ప్రశ్నలు మొదలు!

పేరూ? – సవితా వాంద్రే.

పూర్తి పేరు? – సవితా దౌలత్‌రావ్ వాంద్రే.

తండ్రి పేరు? – దౌలత్‌రావ్ వాంద్రే.

గోత్రం? – దశరథ్ పాటిల్ లాండ్గే. చించోలీ గ్రామం.

పుట్టిన తేదీ? – అక్టోబర్ 12, 2000.

పొడవు? – ఐదు పూట్ల రెండు ఇంచీలు, కాదు కాదు ఐదు ఫూట్ల ఒక ఇంచీ.

నువ్వు కొలుచుకున్నావా? – అవును.

చదువు? – బీ.ఏ. ఫైనలియర్.

సబ్జెక్ట్? – సామాజిక శాస్త్రం.

హాబీస్? – అల్లడం, వండడం, చదవడం.

పొలం పనికి పోగలవా? – ఔనంటూ తల వూపాక ఇంటర్వ్యూ పూర్తవుతుంది.

వచ్చిన పెద్దల కాళ్ళకు మొక్కి ఆశీర్వాదం తీసుకోవాలి. మగపిల్లాడి ఇంటి పెద్ద అశీర్వాద బహుమతి కింద ఆమె చేతిలో ఓ వందో, ఐదొందలో పెడతాడు. ఆమె ఇంటిలోకి తిరిగి వెళ్ళిపోతుంది.

చూట్టానికొచ్చిన వారు ఇంటి బయటికొచ్చి కొంచెం పక్కకెళ్లి మాట్లాడుకుంటారు.

‘అమ్మాయి పర్వాలేదు.’ – ఒకడు.

‘కాదు అది మేకప్పే. చీలమండ (ఏంకిల్) దగ్గర చూడలేదూ? అక్కడ దొరికిపోయింది అసలు రంగు!’ – రెండోవాడు.

వచ్చినవారంతా అమ్మాయిని నఖశిఖ పర్యంతం చూసేవాళ్లే. పిల్ల నచ్చలేదని మొహం మీద చెప్పడం బాగోదని, ఇంటికెళ్లి అభిప్రాయం



చెబుతామని దాటేస్తారు. ప్రతిసారీ వచ్చేది నెగెటివ్ సమాధానమే. ప్రతిసారీ అదే తంతు చూసే మనకే విసుగొస్తే, ఆ అమ్మయి ఇంకా ఎంత టార్చర్ అనుభవిస్తుందో! అన్నింటికంటే విచారకరమైన విషయ మేమిటంటే ఆమె ఏ ఉద్యోగ పరీక్ష కోసం ఏడాది పాటు కష్టపడిందో, ఆ పరీక్ష రోజే మరో ‘మంచి సంబంధం’ కోసం పెళ్ళి చూపులకు కూర్చోవడం! చివరికి ఆ సంబంధమూ కుదర్లేదు, ఆ పరీక్షా చేజారింది!

మగాళ్లు తామెలా వున్నా తాము పెళ్ళి చేసుకోబోయే అమ్మాయిల్లో మాత్రం బోలెడు గొప్ప లక్షణాలు కోరుకుంటారు. అందంగా ఉండాలి, ఎత్తుగా ఉండాలి, చదువు ఉండాలి, వంట వచ్చుండాలి – ఇంకా ఎన్నెన్నో! వార్తాపత్రికల్లోని మ్యాట్రిమోనియల్స్, పెళ్లి సంబంధాల వెబ్‌సైట్‌ల నిండా ఇలాంటి గొంతెమ్మ కోరికలే!

“నేను మొదటిసారి పెళ్ళిచూపుల దృశ్యంలో నటించినపుడు నాకు పెద్దగా ఏమీ అనిపించలేదు. కానీ మళ్ళీ మళ్ళీ అవే దృశ్యాల్లో నటిస్తున్నప్పుడు విసుగేసింది. చాలా అవమానం జరుగుతోందనీ, గౌరవభంగమౌతోందనీ నాకనిపించింది. కేవలం నటిస్తున్న నాకే ఇలా అనిపిస్తే నిజజీవితంలోని అమ్మాయిలకు ఎలా ఉంటుందో ఊహించగలను.” అని సవిత పాత్రధారి ఒక ఇంటర్వ్యూలో చెప్పింది.

సవిత చదివే కాలేజీలో సోషియాలజీ బోధించే ఖాప్నే సర్ అనే యువ లెక్చరర్ ఉంటాడు. సవితకూ, ఆయనకూ మధ్య ఒక అవ్యక్త ప్రేమ కొనసాగుతూ ఉంటుంది. ఆయన కాలేజీ లైబ్రరీలోని న్యూస్ పేపర్ స్టాండుకు అవతలి వైపు నిల్చుని సవితతో సంభాషిస్తుంటాడు. తెగిపోతున్న పెళ్ళి సంబంధాల విషయం తెలుసుకుంటాడు. ఈసారి రాబోయే సంబంధం ఫైనల్ అవుతుందని చిరునవ్వు నవ్వుతాడు. సవిత ఆనందంగా పెళ్ళి చూపులకు కూర్చుంటుంది. అవతలి వారి నుండి ‘పిల్ల ఓకే’ అన్న వార్త వస్తుంది. కానీ, కట్నం ఐదు లక్షలు ఇచ్చుకుంటేనే! సావిత్రీ భాయి వేషధారణలో ఒక పాప అభినయిస్తున్న సందర్భంలోనే ఈ కట్నం సంగతి వెల్లడించడం వ్యంగ్యోక్తిలా అనిపిస్తుంది. మరో సందర్భంలో లెక్చరర్ గారి తండ్రి గారు ఒకవైపు కూరగాయల వాడితో గట్టి బేరమాడుతూనే, మరోవైపు ‘ఐదు లక్షలకు పైసా తగ్గేదీ లేదు, డబ్బు ముందుగా ముడితేనే తప్ప పెళ్లికి ఒప్పుకునేదీ లేదు’ అని పిల్ల తండ్రికి ఫోన్లో తెగేసి చెప్పేస్తుంటాడు. సోషియాలజీ క్లాసులో

‘మహిళా సాధికారత’ గురించి వేడి వేడి లెక్చర్లిచ్చే లెక్చరర్ గారు కట్నం విషయంలో తన తండ్రిని ఎదిరించే సాహసం చేయలేకపోయారు. తలతాకట్టు పెట్టైనా ఈ పెళ్ళి చేసెయ్యాలని ఉంటుంది సవిత తండ్రికి. ఆ తర్వాత ఏమైందన్నది మిగతా కథ!

ఈ సినిమాలో నటీనటులంతా కొత్తవారు. ఈ సినిమా షూటింగు జరిగిన ఊరివారే. అలాంటి ఒక కొత్త నటి నందినీ చిక్టే సవిత పాత్రలో అద్భుతంగా నటించి ఉత్తమ నటిగా రెండు అవార్డులు కూడా గెలుచుకుంది. ఆమె పాత్రను చాలా చక్కగా తీర్చిదిద్దాడు దర్శకుడు. పెళ్ళి చూపుల్లో గడించిన డబ్బును ఆమె పుస్తకాల కోసం వెచ్చిస్తుంది. లెక్చరర్ పిరికిపంద అని తెలిసిన తర్వాత అతడ్ని ఆమె క్లాసు రూములో కూడా విస్మరించే పద్ధతి భళేగా ఉంటుంది. సవిత అన్నయ్య మాంగ్యా క్రికెట్‌లో రాణించాలనుకున్నాడు. దానికై తెగించలేకపోయాడు. తను ప్రేమించిన అమ్మాయి కోసమూ సాహసించలేకపోయాడు. అతడి కంటే ఎన్నో రెట్లు ఉన్నతంగా ప్రవర్తిస్తుంది సవిత. కాలేజీ లైబ్రరీలో ఒకవైపు సావిత్రీ భాయి ఫొటో, మరో వైపు అంబేద్కర్ బొమ్మ ప్రక్కన ‘విద్యను అభ్యసించు, తోటివారిని సమీకరించు, ఉద్యమాన్ని ఆరంభించు’ అని రాసి ఉంటుంది. ఆ ప్రభావంతోనే ఆమె ప్రియుడితో లేచిపోతున్న తన స్నేహితురాలిని సమర్ధిస్తుంది. సినిమా ముగింపులో నాగరాజ్ మంజులే ‘ఫాండ్రీ’లా నిరసన ధ్వని మార్రోగేలా చేస్తుంది.

సవిత తండ్రిగా నటించిన తారానాథ్ ఖిటార్కర్ విషయం కూడా ప్రస్తావించాలి. కుమార్తె పెళ్ళి కుదరడం లేదు, కోతకొచ్చిన పంటకు ధర పలకడం లేదు. విదర్భలో పత్తి రైతులు ఏ క్షణంలోనైనా ఆత్మహత్యకు ఒడిగట్టేటంత బాధల్లో ఉంటారు. అటువంటి రైతు మనస్థితిని సినిమా మొదట్నుంచి ఆఖరువరకూ తన మొహంలో అద్భుతంగా ప్రతిబింబించాడాయన. ఉద్యోగ పరీక్ష కాకుండా పెళ్ళి చూపులకు కూర్చోమని తన కుమార్తెకు చెప్పేటప్పుడు అణిచిపెట్టుకున్న అతని బాధ మనకు స్పష్టంగా కనిపిస్తుంది. తన పొలం దగ్గర ‘అమ్మకానికి’ అన్న బోర్డు పెడుతున్నపుడు కూడా అతడి అసహాయత కళ్లలో దర్శనమిస్తుంది.

‘స్థల్’ సినిమా కులవ్యవస్థ, వరకట్న దురాచారం, లైంగిక అసమానతలను చాలా స్పష్టంగా విమర్శిస్తుంది. పెళ్ళి కాని ఆడపిల్లలు ఎదుర్కొంటున్న కఠిన వాస్తవాలను నినాదప్రాయంగా కాకుండా కథనంలో భాగంగానే మనసుకు హత్తుకునేట్టు వివరిస్తుంది. ఖచ్చితంగా ఇది మరాఠీలో వచ్చిన విలువైన సినిమా.

## చైతన్యవాహిని

**19-10-2025, ఒంగోలు :**

‘ప్రజాసాహితి’ సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక ప్రధాన సంపాదకులు కామ్రేడ్ కొత్తపల్లి రవిబాబు రచించిన వ్యాసాల సంకలనం “ప్రజాసాహిత్య సాంస్కృతికోద్యమం” పుస్తకావిష్కరణ సభ ఒంగోలు ఈమనిపాలెంలోని తరిమెల నాగిరెడ్డి భవన్‌లో జరిగింది. చైనా సాంస్కృతిక విప్లవ వైతాళికుడు లూషన్ వర్ధంతి సందర్భంగా జరిగిన ఈ సభకు జనసాహితి జిల్లా కమిటీ సభ్యులు డి.వి. ఆహ్వానం పలుకగా, ఖాదర్ భాషా అధ్యక్షత వహించారు.

ముందుగా జనసాహితి జిల్లా కార్యదర్శి ప్రసన్న మాట్లాడుతూ, లూషన్ ప్రజా రచయితగా ఎదిగిన క్రమాన్ని వివరించారు. ఆనాడు చైనా సమాజంలో నెలకొన్న విదేశీ పెత్తనం, దౌష్ట్యం వంటి పరిస్థితులు నేడు మన దేశం కూడా ఎదుర్కొంటున్నదనీ, దీన్ని ఎదుర్కోవడానికి ఆనాడు లూషన్ చేసిన సాహిత్య కృషిని మనం స్వీకరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

ఈ సభలో జనసాహితి ప్రకాశం జిల్లా అధ్యక్షులు డా॥ జి.వి. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజలకు అక్కర్లేని వస్తువులను అంటగట్టే వస్తు వ్యామోహ సంస్కృతిని జనం మీద రుద్దుతున్న పాలకులు కార్పోరేట్‌ల కోసం సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను తీసుకొచ్చారని స్పష్టం చేశారు. దేశ పౌరులను కార్పోరేట్ కంపెనీల వినియోగదారుల స్థాయికి కుదించిన కుట్రను అర్థం చేసుకోవాలని కోరారు.

జనసాహితి అధ్యక్షులు కామ్రేడ్ దివికుమార్ మాట్లాడుతూ వర్తమాన సమాజాన్ని కాలంచెల్లిన భూస్వామ్య సంస్కృతి, పతన సామ్రాజ్యవాద సంస్కృతి కలగలిసి ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. ఈ తప్పుడు సంస్కృతి యొక్క దుష్ప్రభావాలు అనేక రూపాల్లో పీడిత ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల జీవితాల్లో పాలకులు సృష్టించిన ఈ సంక్షోభాన్ని అర్థం చేసుకోవడానికి రవిబాబు రచనలు చదవాల్సిన అవసరం ఉందని, అప్పుడే పోరాట సంస్కృతిని అంతర్భాగంగా కలిగిన ప్రత్యామ్నాయ ప్రజాసంస్కృతిని నిర్మించగలుగుతామని అన్నారు. ఈ పుస్తకంలో సాంస్కృతిక విశ్లేషణతో పాటు అనేక మంది రచయితల గురించి, రచనల గురించి విశ్లేషించారని తెలియజేశారు. ప్రజాసాహిత్య సాంస్కృతిక ఉద్యమ కార్యకర్తలు ఎలా ఉండాలో వివరిస్తూ రాసిన వ్యాసాన్ని కార్యకర్తలందరూ ఆత్మవిమర్శనా పూర్వకంగా అధ్యయనం చేయాలని సూచించారు.

# విడుదల చేసిన 48 గంటల లోపే..,

**మోడీ..** మోడీ.. మోడీ హైతో మోమ్కిన్ హై.. అంటూ ప్రధాని శ్రీ నరేంద్రమోడీ గారి పనితనాన్ని, విజయాలను పొగుడుతూ ఒక పాటను అక్టోబర్ 14వ తారీఖున టి-సిరీస్ వారు విడుదలచేసి, యూట్యూబ్‌లో ఉంచారు. నాదాన్ అనే సాహిత్యకారుడు గీత రచన చేయగా, మీట్ బ్రదర్స్ అనేవారు సంగీతాన్ని సమకూర్చారు. మీట్ బ్రదర్స్ తోపాటు ఆదర్శ శుక్లా, దివ్యా భట్ లు కూడా తమ గళాలను ఈ పాట కోసం అందించారు. అయితే పాటను విడుదల చేసిన టి-సిరీస్ వారితోపాటు, మోడీ భజన చేస్తున్నవారంతా నివ్వెరపోయేలా.. 48 గంటలలోపే ఒక మిలియన్ సంఖ్యను దాటి నెటిజన్లు డిస్లైకులతో తీవ్రమైన తిరస్కారాన్ని చూపారు. డిస్లైకులతోనే ఆగకుండా తీవ్రమైన నిందాపూర్వక వ్యాఖ్యలతో సోషల్ మీడియాను ముంచెత్తారు. మోడీసాంగ్ డిజాస్టర్, బాయ్కట్ టి-సిరీస్.. వంటి హాష్ ట్యాగులతో సోషల్ మీడియాను హోరెత్తించారు. తలెత్తబోయే ఉపద్రవాన్ని సకాలంలోనే గుర్తించిన టి-సిరీస్ వారు గుట్టుచప్పుడు కాకుండా 16వ తారీఖున యూట్యూబ్ నుండి పాటను తొలగించారు. అయితే అప్పటికే వైరల్ అయిపోయిన ఆ పాట ట్యూన్, లిరిక్స్ వగైరాలను పట్టుకొని వందల సంఖ్యలో మైములు, పేరడీలు సోషల్ మీడియా నిండా పుట్టుకొచ్చాయి. పాటను అలాగే ఉంచి బ్యాక్‌డ్రాప్‌లో కూలుతున్న వంతెనలు, రైలెక్కలేక అగచాట్లు పడే ప్రయాణికులు, తొక్కిసలాటలలో నలిగిపోతున్న అమాయక భక్తులు, మత అల్లర్లు, బ్యాంకుల ముందు బారులుతీరిన జనాలు, ప్రయాణంలోనే ఒరిగిపోతున్న లారీలు వంటి దృశ్యాలు చూపే వీడియోలు కొల్లలుగా వ్యాపిస్తున్నాయి. 'రాజుగారి దేవతా వస్త్రాలను' ఎల్లకాలము దాచి ఉంచలేరు కదా... ✣




**అక్షరాలు మొలకెత్తుతూనే ఉంటాయి :** అడిగోపుల వెంకటరత్నమ్ కవితాసంపుటి; వెంకటరత్నం గారు ఇప్పటివరకు 28 కవితా సంపుటాలను వెలువరించారు. 1984 నుండి కవిత్వాన్ని రాస్తూనే ఉన్నారు. కవి నడిస్తే చాలదు / ముందడుగు వేయాలి అనే తాత్వికతతో దీర్ఘకాలంగా రచన వ్యాసంగం చేస్తున్న కవి అడిగోపుల వెంకటరత్నమ్. ప్రకృతి – సమాజం – మనిషి ఈ మూడింటి సంఘర్షణల మధ్య ఉన్న పురోగమి భావజాల ప్రతినిధి వెంకటరత్నం గారు. నిరంతర చలనశీలమైన కవిగా ఈ కవితాసంపుటి మనకి అవగాహన నిస్తుంది.

1/8 డెమ్మీలో 94 పుటలు. వెల : రూ.100. మొదటి ముద్రణ : 2025

ప్రతులకు : అడిగోపుల పద్మజ, కావేరి రెసిడెన్సి, అరబిందో మార్గ్, ఎన్జీవో కాలనీ, తిరుపతి-517507, ఆంధ్రప్రదేశ్. email : avr@adigopula.com; ప్రజాశక్తి బుక్‌హౌస్, కారల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ-520002 & అన్ని శాఖలలో & విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520004., & అన్ని శాఖలలో.

**భూమిని మాట్లాడనివ్వు :** కే క్యూబ్ వర్మ కవిత్వం – చాలాకాలంగా కవిత్వాన్ని బలంగా రాస్తున్న కవి కే క్యూబ్ వర్మ. తమ నేల కోసం పాలస్తీనా పసిపాపలు, తల్లులు, కవులు, జర్నలిస్టుల బలిదానానికి దుఃఖంతో ఈ కవితా సంపుటి అంకితం అయ్యింది. ప్రజాదుఃఖంలోని పోరాట చేవను తన కవితా శక్తికి రాపిడి పెట్టి – బతుకులపై నీ బుల్డోజర్ నడకను కాలం సహించదు అంటూ అక్షరాల ఊరేగింపును తీశారు కవి – ఈ కవితా సంపుటిలో.

1/8 డెమ్మీలో 107 పేజీల కవితాసంపుటి ఇది. ప్రచురణ : అనేక, విజయవాడ. మొదటి ముద్రణ జనవరి, 2024.

ప్రతులకు : కేకేకే. వర్మ, ఇంటి నెంబరు : 11-3-11, KPM హైస్కూలు వెనుక, పార్వతీపురం-535501., ఆంధ్రప్రదేశ్ : సెల్ ఫోన్ నంబర్ : 94934 36277; & అనేక, విజయవాడ - 92472 53884. & అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో.

**కాలం కత్తి మొనమీద :** గార రంగనాథం కవిత్వం – రాజాం రచయితల వేదిక నిర్వాహకులు., శ్రీకాకుళంలో సుమారు 40 సంవత్సరాలకు పైగా ప్రగతిశీల సాహిత్య రంగంలో కొనసాగుతున్నారు. ఈ కవితా సంపుటిలో 60 కవితలు ఉన్నాయి. కవితలు అన్నీ కూడా మానవీయ ఆకాంక్షలకు నిలువుటద్దాలు. నల్లటి మోసం – వైట్ కలర్ చొక్కా తొడిగి – దర్పంతో అంగలు వేస్తూ – జనం రక్తమాంసాలను జుర్రుకుంది – నక్క వెనక సింహాలు – కాలం మారింది ఇలా ప్రజల్ని మోసం చేసే అసాంఘిక శక్తులను ప్రజా దుఃఖమే వెల్లువై ముంచేస్తుందనే సత్యం సాహిత్యంగా కృషి చేస్తున్న కవి రంగనాథం.

1/8 డెమ్మీ 130 పుటలు. వెల : రూ.150/- మొదటి ముద్రణ : జూలై 2024; ప్రచురణ : రాజాం రచయితల వేదిక.

ప్రతులకు : గార రంగనాథం – చరవాణి : 98857 58123. & నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్ – 500027. దూరవాణి : 040-246523871 / 90004 13413.

(ఇంకా వున్నాయి) ✣

# జనసాహితి ప్రచురణలు




1/8 డెమ్మీ సైజులో 224 పేజీలు
వెల : రూ. 200/-




1/8 డెమ్మీ సైజులో 112 పేజీలు
వెల : రూ. 80/-




1/8 డెమ్మీ సైజులో 192 పేజీలు
వెల : రూ. 200/-

ఈ పుస్తకాలు దొరకుచోటు : **మైత్రీబుక్‌హౌస్,** జలీల్‌వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2. సెల్ : 70755 08270


(2వ అట్ట తరువాయి....)

ఒప్పందాలను, ఐక్యరాజ్యసమితి తీర్మానాలను తుంగలో తొక్కుతూ ఆక్రమణ యుద్ధాలను కొనసాగిస్తూనే ఉంది.

ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వమే పాలస్తీనా సమస్యను ఆరని అగ్గిలా మార్చింది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో మిత్రపక్షాల తరఫున పోరాడేందుకు అరబ్ జాతీయుల మద్దతు బ్రిటిష్ ప్రభుత్వానికి అవసరమైంది. అప్పట్లో పాలస్తీనాకు సంబంధించిన రాజకీయ విధానాన్ని తెలిపే శ్వేత పత్రాన్ని 1939 మే 17న విడుదల చేసింది. అందులో చాలా స్పష్టంగా "తమ ప్రభుత్వానికి పాలస్తీనాలో ఓ యూదు రాజ్యాన్ని స్థాపించే యోచన గానీ, యూదుల పరిపాలనలో అరబ్బులను ఉంచాలనే దురుద్దేశం గాని లేవు. రెండు రాజ్యాలను ఏర్పాటు చేసే ఉద్దేశం కూడా లేదు. యూదులు అరబ్బులు కలిసి రాజ్యపాలన చేసుకోమని" సలహా ఇచ్చింది. బ్రిటిష్ ప్రభుత్వం పాలస్తీ నాకు స్వాతంత్రం ఇవ్వకుండా ఐక్యరాజ్యసమితి ముందు సమస్యను ఉంచింది. 1947లో ఐరాస విభజన తీర్మానాన్ని అంగీకరించింది. 1948 మే 14న జియోనిస్ట్ ఇజ్రాయిల్ దేశంగా ఏర్పడింది కూడా. ఆ తర్వాత జరిగిన పంపకాల్లో ఐరాస 56% భూభాగం ఇజ్రాయిల్‌కు, 43% భూభాగం పాలస్తీనాకు, ఒక శాతం భూభాగం జెరూసలేంకు కేటాయించింది. రెండు దేశాల రాజధానులు జెరూసలేంలోనే ఉండాలని తీర్మానం చేసింది. ఇజ్రాయిల్ ఆక్రమణదారులు యుద్ధాలు చేస్తూ, చేస్తూ 53% భూభాగాన్ని 78% చేసుకుంది. 1967 నాటి యుద్ధ కాలానికి మిగతా 22 శాతాన్ని తన అధీనంలోకి తెచ్చుకుంది. అలా పూర్తిగా ఇజ్రాయిల్ అధీనంలోకి గాజా, వెస్ట్ బ్యాంక్‌లను తెచ్చుకోవటానికి చేస్తున్న యుద్ధమే ఇది.

గాజాను, వెస్ట్ బ్యాంకును కలిపి పాలస్తీనా ప్రజలకు మాతృభూమిని అప్పగించవచ్చు. 1818 నుండి పాలస్తీనాలోకి వలసలు మొదలుపెట్టిన ఇజ్రాయిల్ వలస వాసులు నేడు పాలస్తీనా దేశాన్ని ప్రపంచ పటంలో లేకుండా చేసేంత ఆధిపత్యాన్ని చలాయిస్తున్నారు. ఇజ్రాయిల్‌లో ఇప్పటికే ఇరవై ఒక్క శాతం పాలసీనియన్లు ఉన్నారు. గాజా వెస్ట్ బ్యాంకులలో 7. 6 మిలియన్ల పాలస్తీనియన్లు ఉన్నారు. శరణార్థులుగా ఇతర దేశాల్లో 4.4 మిలియన్లు ఉన్నారు. ఇజ్రాయిల్‌లో యూదులు 7.2 మిలియన్లు మాత్రమే ఉన్నారు. అందువల్ల ఒక దేశంగా ఏర్పాటు చేయటానికి కూడా వారు సుముఖంగా లేరు. వారి దేశంలోకి కలుపుకోకుండా, వేరే దేశంగానూ ఏర్పడకుండా, వారి దేశాన్ని వారికే అప్పగించకుండా ఇజ్రాయిల్, పాలస్తీనియన్లను జాతిహననం చేసి తమకు ఎదురు లేకుండా చూసుకోవాలనే సామ్రాజ్యవాద కాంక్షతో రగిలిపోతున్నది.

ఆయిల్ వనరులు, సంపదలు ఏ దేశంలో ఏ ప్రాంతంలో ఉన్నా వాటిపై ఆధిపత్యానికై సామ్రాజ్యవాదం జాతులు మధ్య, మతాల మధ్య, ప్రాంతాల మధ్య, దేశాల మధ్య చిచ్చు పెడుతూనే ఉంటుంది. సామ్రాజ్యవాదులకు, అభివృద్ధి నిరోధక పాలకవర్గాలకు, దోపిడీలకు వ్యతిరేకంగా సాగే సామ్యవాద పోరాటాల్లో భాగమైనప్పుడే పాలస్తీనాకు పరిష్కారం లభిస్తుంది. అనేక దోపిడీ రూపాల్లో ఒక రూపంగానే ఈ శాంతి పథకాలు నిలిచిపోతాయి. పాలస్తీనా ప్రపంచ ప్రజలందరి సంఘీభావంతో తన మాతృభూమిని తను రక్షించుకుంటుంది.

PRAJA SAAHITI November 2025 (TELUGU) Rs. 20/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2024-2026

No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month




ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada

A PUBLICATION OF JANASAAHITHI